www.vaaradionline.com

భక్తపంచవింశతికథలు



కేతవరపు రామకృష్ణశాస్త్రిగారు.

నాటకములు

ముత్తరాజు సుబ్బారావుగారివి

శ్రీకృష్ణతులాభారము	1	0	0
కచదేవయాని	0	12	0
రణతిక్కన	0	12	0
మార్కండేయ	0	12	0
శకుంతల	0	12	0
పద్మిని	1	0	0
చంద్రగుప్త (మౌర్యాభ్యుదయము)	1	0	0

బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారివి

సత్యవాక్పరిపాలనము	1	0	0
బుద్ధిమతీవిలాసము	1	0	0

కాళ్ళకూరి నారాయణరావుగారివి

చింతామణి	1	0	0
మధునేవ	1	0	0

ఓచాల్చువురపు యజ్ఞనారాయణ శాస్త్రిగారివి

రసపుత్రవిజయము	1	0	0
రాణాప్రతాప్‌సింగ్	1	0	0

ఆకెళ్ళ సత్యనారాయణగారివి

జయంతవిజయశాలము	0	12	0

మల్లాది అచ్యుతరామశాస్త్రిగారివి

ద్రౌపదీవస్త్రాపహరణము	1	0	0
శ్రీకృష్ణలీలలు	1	0	0
భక్తచోళామిళ	1	0	0

నాటకములు

కె. వి. సోమరాజు రామానుజ రావుగారివి

రంగూన్‌రౌడీ (వసిభక్తి)	1	0	0
సతీసక్కూబాయి	0	12	0
సతీ అనసూయ	1	0	0
భీష్మబ్రహ్మచారి	1	0	0
ధరణికోట (రెడ్డిప్రతాపం)	1	4	0
కాలకేతనము (ట్రాజిడీ)	1	0	0
తాజ్‌మహల్ (జహానారా)	1	0	0
భోజకాళిదాసు	1	0	0
మహాభక్తవిజయము	1	0	0
గంగావతరణము	1	0	0

పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారివి

పాదుకాపట్టాభిషేకము	1	4	0
రాధాకృష్ణ	0	12	0
విప్రనారాయణ	1	0	0
కోకిల	1	0	0

సోమరాజు అచ్యుతరావుగారివి

పత్నీప్రతాప్ అనసూయ	1	0	0

ముత్తనేని వెంకటచెన్న కేశవులు గారివి

చండీక	1	0	0

నూరి పార్థసారథికర్మగారివి

రంగూన్ మెయిల్	1	0	0

కేవరపు రామకృష్ణకవిగారివి

భక్తమీరాబాయి	1	0	0

శ్రీ

భేతాళ పంచవింశతి కథలు.

గ్రంథకర్త:

కేతవరపు రామకృష్ణశాస్త్రిగారు.

ప బ్లి ష ర్సు:

కురుకూరి సుబ్బారావు అండ్ సన్

ప్రొప్రయిటర్సు—సరస్వతీ బుక్కు-డిపో,

బెజవాడ.

మొదటికూర్పు 1000

1938

కాపీరైటు రిజిస్టరు]

వెల రు. 0—8—0.

రాజమహేంద్రవరమున

బొలిశెట్టి వెంకటసుబ్బయ్య అండ్ సన్సువారి

కొక్కొండ ముద్రాక్షరశాలయందు ముద్రింపఁబడినది.

1 9 3 8

శ్రీరామోపాసయసమః.

వేతాళపంచవింశతికథ

పూర్వకథ.

చతుస్సముద్రపరివేష్టితం బగుభూమండలమునకు నొప్పారు భారత ఖండమందు ధారానగర మనుపేరుగల పట్టణము గలదు. అది విశాలమై, నాలుగువర్ణములవారికి నాశ్రయమై, సమస్తమైన భవముల కాకరమై, వాస యోగ్యమై యెప్పారుచుండును. అపట్టణమునకు గంధర్వసేను డనుపరి ఖ్యాతిగల రాజశిరోమణి ప్రభువై రాజ్య మేలుచుండెను. ఆతనికిం బండితులును, పరాక్రమవంతులు నగునిర్వురు కొమరులు గలరు. పెద్ద వాడు శంఖునిసేరు భర్తృహరి. రెండవవానిపేరు విక్రముండు. గంధర్వసేనుం డు చిరకాలము రాజ్య మేలి స్వర్గలోకము నలంకరించెను. తండ్రియనం తరము జ్యేష్ఠపుత్రుం డగుభర్తృహరి రాజ్యమున కధికారియై పాలించుచుం డెను. దేశకాలపాత్రములను, ప్రజలకష్టసుఖములను గుఱుతెఱింగి ధర్మము తప్పక రాజశాసనము గావించుచుండుటచే ప్రజలందరతనియందు బద్ధా నురాగులై రాజభక్తి కలిగి యుండిరి.

ఒకనాడు భర్తృహరిమహారాజు సింహాసనాసీనుడై కొల్వుకూ టంబున గూర్చుండి మంత్రిసామంతాదిపరివారంబులతో రాజకీయనిష యములగూర్చి ముచ్చటించుచుండ నాయూరిలో నుండుమహాతపస్వి యైన బ్రాహ్మణోత్తముండు రాజసభ కేతెంచి ప్రభువును గని దీవించె ను. రా జావిప్రుని సగౌరవముగ గూర్చుండబెట్టి వచ్చినకారణ మేమని యడుగ విప్రుం డిట్లనియె. మహారాజా! నీ కొకదివ్యఫలము నొసంగు చుంటిని. ఇది నాకు పరమేశ్వరు డనుగ్రహించెను. ఈఫలమును భుజించి

నవారికి మృత్యువు లేదు. ఇదియే దీని ప్రభావము. నాకు దీనిని భుజిం పనిష్టములేక ధర్మప్రభువగు నీ కొసంగిన దేశోపకారమగునని తలంచి నీ కిచ్చితిని. ఇదియే నేను వచ్చినకారణ మని చెప్పెను. మహారా జాఫల మును కన్నుల నద్దుకొని యాబ్రాహ్మణునకుఁ గోరినంత ధన మొసంగి సంతృప్తి జేసి యాఫలమును దాను భక్షింప నొల్లక తనప్రేమంపుటిల్లా లగు పట్టపుదేవి కొసంగి దానిమహిమను జెప్పి భక్షింపు మని చెప్పెను. ప్రభువు నెడలిపోయినయనంతరము పట్టపురాణి యాఫలమును దాను తిననొల్లక తన యాంతరంగికరహస్యప్రియు డగుకొత్వాలును బిలచి వాని చేతి కిచ్చి ప్రియుడా! దీనిని భుజింపు మని చెప్పెను. కొత్వా లాఫలమును గొనిపోయి తన కింపుడుకత్తెయగు వేశ్య కొసంగి భక్షింపు మనెను. ఆవే శ్య యిట్టిమహిమగల ఫలమును తా నొక్కతె భుజించిన నేమిలాభము? ప్రభువున కిచ్చిన మిక్కిలి బహుమాన మిత్తురని తలంచి మరునాడు రా జసభ కేగి మహారాజునకు నమస్కరించి యాఫలము నెమరుగనుంచి తాను వచ్చినని విన్నవించెను.

భర్తృహరి యాఫలమును జూచి గుర్తించి వేశ్యాగృ వచ్చిన వినరమును దెలిసికొని వెంటనే కొత్వాలును బిలిపించి యోరీ! ఈఫల మునిచేతి కెట్లు వచ్చెను? చెప్పుమని యదుగ కొత్వాలు భయకంపితు డై మారాడజాలక పోయెను. మహారాజు వానిం జూచి యోరీ! అడిగిన దానికిఁ బ్రత్యుత్తరమును వచింపవేని తల దీయబడునని భయపెట్ట నాతడు గడగడ వడకుచు మహారాజా! క్షమింపుడు. నా కీఫలమును రాణిగా రిచ్చిరని చెప్పెను. రాజునకు శరీర మంతయు కొయ్యబారిపో యెను. వెంటనే కోలువు చాలించి యంతఃపురమున కేతెంచి రాణిం జూచి వెనుక నేను నీకిచ్చిన దివ్యఫలము నేమిచేసితి వని యడిగెను. ఆ మూర్ఖురాలు తాను జేసినపని ప్రభువునకు దెలియదని నమ్మియుండెను. గాని పాపము బ్రద్దలుగాక మానదను నీతిని విశ్వసింప దయ్యె.

అందువలన ధైర్యముతో నాధా! నే నా ఫలము నానాడే తిని యుంటిసని ప్రత్యుత్తరమును వచించెను. రాణియొక్క దుర్మార్గమును జూచి యామె పల్కిన యసత్యాలాపములను వినఁగనే ప్రభువునకు మహోగ్రహము గలిగి యోసీ! మాయలాడీ! పాలవంటివంశమునకు మచ్చ గల్గించితివి. పాపినీ! యని బట్టలో దాచినఫలమును జూపి యీఫలము కొత్వాలుస కెట్లు వచ్చినదని యడుగ నామె రహస్యము బట్టబయ లయ్యెను గదాయని తెలుసుకొని భయకంపితయై మూర్ఛిల్లెను. భర్తృ హరి వెంటనే కొల్వుకూటమున కేగి మంత్రిని జూచి, అమాత్యా! రాజ ద్రోహియైన కొత్వాలున కురిశిక్ష విధించితిని. నేను రాజ్యమును బరిత్య జించి యరణ్యమున కేగుచుంటిని. నాసహోదరుడైన విక్రమునకు రాజ్యా భిషేకమును గావించి యిలలయైన పట్టపురాణిని రాజ్యమునుండి వెడల గొట్టుము. ఇది నాయాజ్ఞ.

అని చెప్పి భర్తృహరి మరునాడే బయలుదేరి రాజవేషమును దీసి వైచి సన్యాసివేషమును దాల్చి వనమున కేగెను. మంత్రు లందరును విక్రముని రావించి శుభలగ్నమున నతనిని రాజ్యాభిషిక్తుని గావించిరి. విక్రముడు విక్రమార్క-మహారా జనుపేరుతో రాజ్యపరిపాలన జేయుచు సాహస శౌర్య ధైర్య దాన వితరణములయం దద్వితీయుడై యడిగిన వారికి లేదనకుండ ధర్మము జేయుచు శాస్త్రధర్మానుసారముగ దేశము లను జయించి రాజ్యవిస్తీర్ణము గావించి జంబూద్వీపమున కంతకు నధి కారి యయ్యెను.

ఒకనాడు విక్రముడు కొల్వులో నుండగా నొకసన్యాసి వచ్చి ప్రభువును దీవించి యతని కొకఫలము నొసంగి వెడలిపోయెను. ఈవిధ ముగ నాయతి ప్రతిదిన మొక్కొక్క ఫలమును విక్రమున కొసంగి పోవుచుండ నత డాఫలమును కోశాగారమున భద్రపరచుచుండెను. ఒక

నాడు విక్రము డాఫలము లేమో పరిశీలింత మని తలంచి యొకఫలమును దెప్పించి దానిం గోయింప నందుండి యొకమరకతమణి బయల్పడెను. దాని కాంతుల కందున్నవారి కన్నులు మిరుమిట్లు గొల్పుచుండెను. రాజు వెఱగుపడి మిగిలినఫలముల నన్నింటిని దెప్పించిచూడ ప్రతిఫలము నుండి యొక్కొక్కరత్నము బయలుదేరెను. విక్రముడు తనసభలో నున్న రత్నపరీక్షకులను రావించి యారత్నములను ఖరీదు గట్టుడని నియమించెను. వా రారత్నములను బరీక్షించి దేవా! యివి దేవరత్నములవలె నున్నవి. వీనికి మేము వెలువఁ గట్టజాల మని వచించిరి.

మరునాడు మామూలువేళకు యతి వచ్చి ఫలము నొసంగెను. రా జాయతీశ్వరుని జూచి యతీంద్రా! తాము విరాగులుగదా! ఇట్టి రత్నములు మీ కెట్లు లభించినని? నావలన మీ రెట్టిప్రయోజనము నపేక్షించి యిట్టి దివ్యరత్నముల నొసంగుచున్నారు? మీయుద్దేశ్య మేమో తెలిపె దరా యని యడుగ నాయతి యిట్లనియె. రాజా! రిక్తహస్తములతో ప్రభువులకడకు బోరాదుగావున నాఫలముల నిచ్చితిని. ఆరత్నములు దేవమణులు. తపోధనులము గనుక మాకు అష్టసిద్ధులును గలవు. తత్కారణమున మే మీరత్నములను సమకూర్పగలము. కాని విరాగులమగు మాకు వానితో నేమిపని? ఆరత్నములు మీవంటి ప్రభువులకడ నుండ దగినవి. 'రత్నహారీతు పార్థివః' అను న్యాయ మెరుంగవా! కావున వానిని నీ కొసంగితిని. ఇంక నీవలన నా కొకపని కావలసియున్నది. నే నొక జపము చేయుచున్నాను. ఇచ్చటికి నాలుగామడల దూరమునగల యరణ్యములో నొకదేవ్యాలయ మున్నది. నే నచ్చట నివసించి జపము చేయుచున్నాను. నాజపసిద్ధి కే పూర్ణాహుతి గావింపవలయును. అందులకు నీసాయము నా కవసరము. రాబోవు భాద్రపద శుద్ధ త్రయోదశినాటి యర్ధరాత్రి సమయమున నీవు ఖడ్గహస్తుడ వై యొంటిగ రావలయును.

అట్లు వచ్చితివేని నాకార్యము సఫల మగును. అని చెప్పెను. సాహసవిక్రమార్కుడని పేరందిన యామహారాజు వల్లెయని యంగీకరించి యాసన్యాసిని బంపివేసెను. పిమ్మట నియమితదినమునకు విక్రముడు బయలుదేరి ఖడ్గధారియై రాత్రివేళ క్రూరమృగారావసంకులితమైన యాయరణ్యమును నిర్భయముగ గడచి యాసన్యాసియున్న దేవీమందిరమును జేరి యతికి నమస్కరించి నిలుపబడెను. సన్యాసి విక్రమునిం జూచి రాజా! వచ్చితివా! సంతస మయ్యెను. ప్రస్తుతము నీవలన నా కొకపని గావలసియున్నది. ఇచ్చటికి రెండుక్రోసులదూరమున నొక శ్మశానము గలదు. అం దొకవటవృక్షము గలదు. ఆచెట్టుకొమ్మ నొకశవము వ్రేలాడుచుండును. దానిం గొనిరమ్ము. నాహోమమున కది కావలయును. అని చెప్ప విక్రముడాయుధధారియై భూతప్రేత పిశాచసంచారముతో గూడి భయదాయకంబైన యాశ్మశానమున కేగి శవమును జూచి, విక్రముడు మహాసాహసముతో నావటవృక్షము నెక్కి శాఖనుండి తలక్రిందుగ వ్రేలాడుచున్న శవముయొక్క బంధనమును దెగగోయ నాశవము క్రింద బడెను. విక్రముడు చెట్టుదిగి పచ్చినప్పటి కాశవము కొమ్మలను బాదుకొనుచు రోదనముఁ జేయుచుండెను. విక్రముడాకళేబరమును సజీవముగా నెరింగి యోరీ! నీ వెవ్వడవు? ఏటి కిట్లు వ్రేలాడుచుంటివి? నేను విక్రమార్కుడనుప్రభువును. దేవీమందిరమందలి సన్యాసి యనుమతిని నిన్ను గొంపోవ నరుదెంచితిని. నీవృత్తాంత మెఱింగింపుమన నాకళేబరము సజీవమై యిట్లనియె. రాజేంద్రా! నేను వచ్చట కొక నియమ మున్నది. నేను భేతాళుడను. నిన్ను కొన్నిప్రశ్నముల నడిగెదను. వానికి సదుత్తరముల నిచ్చెదవేని నన్ను నీవెంట గొనిపోగలవు. అట్లుగాకున్న నన్ను నీవు తిసికొని వెళ్ళజాలవు. ఇది నీకు సమ్మతమా యని యడుగ విక్రమార్కుడాప్రశ్నములను దెలిసికొనవలయునను వేడుకతో సరే యని యంగీక

రించెను. ఆకళేబరములో నున్న రాక్షసుడు విక్రమునిం జూచి రాజా! నే నడుగబోవు మొదటి ప్రశ్నమునకు సంబంధించిన కథను వచించు చున్నాను. శ్రద్ధతో వినుము—

ఒకటవకథ.

ప్రతాపముకుటు డనుపేరుగలరాజు రాజ్యమును జేయుచుం డెను. అతనిభార్యపేరు మహాదేవి. ఆరాజున కొకకుమారుడు వజ్రిము కుటు డనుపేరుగలవాడు కలడు. ఆవజ్రముకుటునకును, మంత్రికొమారున కును మిక్కిలిస్నేహ మగుటచే స్నాన, పాన, విద్యావిషయములయం దొక్కచోటనే సంచరించుచుండిరి. కొంతకాలమున కారాజపుత్రిడును, మంత్రిపుత్రుడును సంప్రాప్తయవ్వను లైరి. ఒకనాడు వా రిర్వురును గ లసి మహారణ్యమధ్యమునకు వేటాడబోయి దినమంతయు వేటలో గడపి సాయంకాల మగునప్పటికి ప్రాంతమందున్న సుందరసరోవరమును జూచి యందు కరపాదముల గడుగుకొని జలంబుల ద్రావి సమీపమునగల శివాలయములోని కేగి యందున్న శివలింగమునకు నమస్కరించి తిరిగి యాసరోవరతీరంబున విశ్రమించిరి. మంత్రి కుమారునకు నిద్ర వచ్చుటచే పరుండెను. రాజపుత్రిడు సరోవరశోభను దిలకించుచుండెను.

కొలదిగడియల కొకరాజపుత్రిక చెలికత్తెలతో పరివారసహితయై వచ్చి శివాలయములోని కేగి పరమేశ్వరుని ప్రార్థించి సరోవరమున నిర్మలజలంబుల గ్రోలి యొకవృక్షచ్ఛాయను విశ్రమించి చెలులతో మాట్లాడుచు ప్రాంతమందు విహరించుచున్న రాకొమరుని గాంచెను. వజ్రముకుటుడును రాకుమారిం గాంచెను. రాజపుత్రిక వజ్రముకుటుని జూచి తనశిరమున నుంచుకొనిన శివపూజానిర్మాల్య మగుకమలమును దీసి చేత బట్టుకొని చెవిలో నుంచుకొని వెంటనే దానిని దంతములతో

కొరికి పాదములకు తగిలించి యాకమలమును వక్షస్థలమున కదుము కొనెను. తదుపరి తనచెలికత్తెలతోఁ గలసి నగరమున కేగెను. రాజకుమారు డామెను జూచినది మొదలు మోహావివశుడై యాకన్యకామణి యొనర్చిన కార్యములు తనమనస్సునకు బోధపడకుండుటచే తిరిగి మంత్రికుమారుని సమీపించి మేలొక్కలెవ్వను. మంత్రిపుత్రుడు నిద్రనుండి లేచిన వెంటనే తాను చూచినవృత్తాంత మంతయు నెఱింగించి యాకన్యకామణి చేసినపనుల నెఱింగించి యిట్లనియె. మిత్రమా! ఆసుందరి యూరు గాని నామమునుగాని నెఱుంగలేక పోయితిని. గాని యట్టి జగన్మోహినిని వివాహ మాడకున్న నాజన్మ వ్యర్థమసుమా యని పల్కుచున్న రాకుమారుని జూచి మంత్రికుమారు డిట్లనియె!

మిత్రమా! ఆచిన్నది యొనర్చిన చర్యలను విమర్శింప నామెయు నిన్ను వలచిన ట్లున్నది. ఆసైగలు నీ కర్థము కాలేదు. నేను వచించు చుంటిని వినుము. తలపై నున్న కమలమును దీసి చెవిదగ్గిర నుంచుకొనుటవలన తాను కర్ణాటకదేశపు రాజపుత్రిక ననియును, దంతములతో కొఱుకుటవలన దంతవక్త్ర డనురాజునకు తనయ ననియు, కమలమును పాదములకడ నుంచుకొనుటవలన తనపేరు పద్మావతి యనియు, వక్షము న కదుముకొనుటవలన నీవు నాహృదయమం దుంటివనియు సూచించి నది. ఇదియే యారాజపుత్రియొక్క సాంకేతికాభిప్రాయ మని తెలిపెను. రాజపుత్రుడు వెంటనే యాదేశమునకు పోవుదమని పట్టుబట్టుటచే మంత్రి నందను డాతని వెంటగొని తురంగారూఢులై యిర్వురు కొలదిదినముల కాయూరునకు అనగా కర్ణాటకదేశమునకు వచ్చి సత్రములో బసచేసి మధ్యాహ్నకాలము దాటినతోడనే యిర్వురు నగర మంతయు జూచుచు రాజమందిరప్రాంతమున కేగిరి. తత్సమయమున నొకముదుసలియగు స్త్రీ రాజనగరులోనుండి వచ్చుచుండెను. ఆవృద్ధురాలిం గాంచి రాజమంత్రి

నందను లిర్వురును వెంబడించిరి. ఆమె క్రమముగ తనయింటి కేగి గడప లోపల గూర్చుండి రాట్టమును వడకుచుండెను. వెంటవచ్చినవా రిర్వు రును గుఱ్ఱమునుండి దిగి యాయింటిముందుకు వచ్చి నిలువబడిరి. మంత్రి పుత్రు డాముదుసలిం జూచి అవ్వా! మేము పరదేశులము. కొలదిదిన ములు నివసించుటకు నీయింటిలో నవకాశ మొసంగెదవా? నీకు పుణ్య ముండును. అని యామె చేతిలో పదిబంగారునాణెముల నుంచ నావృద్ధు రాలు మిక్కిలి సంతసించి తనయిట నుండుట కంగీకరించెను. కొన్నిదిన ములు గడచినతదుపరి మంత్రినందను డామెవృత్తాంతము దెలిసికొని యిట్లనియె. అవ్వా! లేపు నీవు మారాజకుమారితో నొకవార్త నెఱిగిం చితివేని నీకు బహుమతి లభించును. అదేమనగా గడచిన జ్యేష్ఠశుద్ధ పూ ర్ణిమనాడు నీవు వనమున జూచిన రాజకుమారుడు వచ్చియుండె నని వచింపుము.

మంత్రికుమారుడు వచించినప్రకార మాదాసి రాజపుత్రికను జేరి ప్రసంగవశమున రాజకుమారునిసంగతి నెఱిగించి యతనియందమును వర్ణించెను. ధనాశగల రాజాంతఃపురదాసీజన మెంతకైన తగుదురుగదా! పద్మావతి దాసివాక్యములను విని కోపమును నటింపుచు తనచేతిని మం చిగంధములో ముంచి యైదువ్రేళ్లు కనపడున ట్లావృద్ధురాలిదవడపై తట్టి పొమ్మని యదలించెను. ఆవృద్ధురాలు నిష్కారణముగ రాజపుత్రికకు కోపము గల్గించితి నని విచారపడుచు నింటికేగి వా రిర్వురకును రాజకు మారి చేసినపనిని వివరించి తనదవడ చూపించెను. రాజకుమారుడు దీని యభిప్రాయ మేమని యడుగ మంత్రినందను డిట్లనియె. మిత్రమా! అయి దువ్రేళ్లు తేలునట్లు కొట్టుటవలన నామె అయిదుదినములవరకునని సూచిం చినది. వెన్నెలదినము లైదును గడచినవెనుక చీకటిరాత్రులు వచ్చును. అప్పుడు సమయ మగునని తెలిపినది. అని చెప్పెను.

ఆరవనాడు మరల వృద్ధురాలు వీరిర్వురిసందేశమును పద్మావతి కెఱిఁగింప నామె యెఱ్ఱనికుంకుమతో ముదుసలిదానిదొడ్డపై మూడు బొట్లు పెట్టి పంపెను. మంత్రికుమారుడు చూచి రాజపుత్రునితో పద్మావతి ఋతుమతియై యున్నదనియు నాలుగవనాడు స్నానానంతరము సమయ మగునని సూచించినదని చెప్పెను. నాలుగవనాడు పద్మావతి వృద్ధురాలితో రాకొమరుడు రాదగినసాంకేతికమును చెప్పి పంపెను. నాటి రాత్రి రాజపుత్రుడు చక్కగ నలంకరించుకొని మంచిదుస్తులను ధరించి నడుమున ఖడ్గమును బిగించి ప్రయాణమునకు సంసిద్ధు డయ్యెను. మంత్రికుమారుడును మారుదుస్తులను ధరించి రాజకుమారుని వెంటగొని యందరు నిద్రించినవెనుక బయలుదేరి రాజకన్యాంతఃపురమునకు పశ్చిమభాగమున గలకిటికీక్రింద నిలువబడెను. పద్మావతి వారిర్వురు వచ్చుట కొకగొలుసు వ్రేలాడగట్టి యుంచెను. రాజపుత్రుడా గొలుసును పట్టుకొని పైకెక్కి పోయెను. పద్మావతి మరల గొలుసును పైకిదీసి కిటికీతలుపులను బిగించెను. మంత్రినందను డెదురుగ నున్న నొకయరుగుపై కూర్చుండెను. పద్మావతీరాజపుత్రు లిర్వురు పరస్పరము జూచుకొనిరి. పద్మావతి ప్రియుని కైదండగొని శృంగారింపబడి మనోహరముగ నున్న తనగదిలోనికి గొంపోయి హంసతూలికాతల్పమున గూర్చుండబెట్టి చందన మలంకరించి ఫలహారముల నిచ్చి తాంబూలము నొసంగి సరససల్లాపములతో నారాత్రియంతయు రాకుమారునితో నిష్టవినోదంబుల గ్రీడించెను. తెల్లవారుజామున రాజపుత్రుని తనయంతఃపురంబునగల రహస్యప్రదేశమున దాచెను. మంత్రికుమారు డుదయమువరకు కాచియుండి యథాస్థానమున కేగెను.

పద్మావతి యీవిధముగ పరులకు దెలియకుండ తన ప్రియుని పగలు దాచుచు రాత్రులయం దతనితో సుఖంపుచు నెలదినములు గడ

పెను. మధ్య నొకమారు రాజపుత్రుడు మిత్రునిజూడ బయలుదేరెను గాని పద్మావతి పోనీయక అటంకపరచెను. ఒకనాడు రాజపుత్రుడైన వజ్రముకుటునకు జన్మభూమి, తల్లిదండ్రులు, తన ప్రాణమిత్రుడు జ్ఞప్తికి వచ్చుటచే ఖిన్నుడై కూర్చుండెను. పద్మావతి వచ్చి నాథా! నే బేల చారముతో నుండిరని యడుగ నాతో డోప్రియురాలా! నామిత్రుని విడిచి చాలకాలమైనది. ఆతనివియోగము సహింపజాలను. మనయిర్వురి సమావేశమున కాతనిబుద్ధిబలమే కారణము. నీవు చూపిన సాంకేతిక ములరహస్యములను నాకు దెల్పి నీతోడిపొందును ప్రాప్తింపజేసిన మిత్రుని మరచితినిగదా యని చింతించుచుంటిని. అని పల్కిన పద్మావతి నాథా! మీ కంత చింతయేల? నేను రేపు పలురకముల పిండివంటలను వండి మీచేతి కిచ్చెదను. మీమిత్రున కిచ్చి చూచి సంతృప్తులై మరలి రండు. అని చెప్పి పలువిధములైన భక్ష్యములను వండి ప్రియున కిచ్చి రాత్రివేళ నతని బంపెను. వజ్రముకుటుడు మంత్రికుమారునికడ కేగి కౌగలించుకొనెను. మంత్రినందనుడును మిత్రుని జూచి మిక్కిలి సంతసించెను. రాకుమారుడు తనకు ప్రియురా లిచ్చినభక్ష్యములను మిత్రుని యెదుట నుంచి సఖుడా! నాప్రియురాలు నీకొఱకై స్వయముగ వండినది. వీని నారగింపు మన నత డిట్లనియె. చెలికాడా! నీ వామెతో నా విషయము నెఱిగించి ప్రమాద మొనర్చితివి. నీప్రియురాలు నిన్ను సర్వదా వశముజేసికొన దలంచినది. స్వేచ్ఛావృత్తిగల యాడువాండ్రు కుటిల చిత్తులై యుందురు. నీవు నాకడకు వచ్చుటామె కిష్టము లేదు. నిన్ను మరల తల్లిదండ్రులకడకు దీసుకొని పోవుదు ననుభయముతో కపటో పాయమున నన్ను చంపదలంచినది. అని చెప్ప రాజకుమారు డంగీకరింపక నిదర్శనము చూపు మనెను. మంత్రికుమారుడు వెంటనే పద్మావతి పంపిన పిండివంటలలో నొకదానిం దీసి యటనున్న కుక్కముందు బడ వేయ దానిని దిని యాశునకము మరణించెను. వెంటనే చెలికాడా!

చూచితివా? యున రాజపుత్రుడు క్రోధపరవశుడై ఛీ! యికదాని ముఖ మును చూడను. మనదేశమునకు బోవుదము లెమ్మని పలుక మంత్రి పుత్రుడు సఖా! నిదానించుము. నీప్రియురాలిని వెంటగొని పోవలెను. నీవు రేపురాత్రి యామెకడ కేగి పద్మావతి గాఢనిద్రలో నున్నతరి యెరింగి యామెయొడలిపై గలనగలను దీసికొని తొడలపై యీత్రిశూల మును గుర్తుపడునట్లు గ్రుచ్చి వెంటనే పయనమై నాకడకు రమ్ము. తరువాత సంగతిని దెల్పెదను. నన్నుగురించి యడిగెనేని నాకు తెలియ దనుము. అని చెప్పి రాజపుత్రుని పంపెను.

వజ్రిముకుటుడు మంత్రికుమారుడు చెప్పిన ట్లామెనగల నన్నింటిని సంగ్రహించి తొడపై త్రిశూలమును గుర్తుపడునట్లు ముద్రించి వెడలి పోయెను. మంత్రికుమారుడు రాజపుత్రునితో గలసి యాగామదేవాల యమున కేగి తమవేషంబులను మార్చి యోగులవలె వేషములను ధరించి రాజకుమారుని తనశిష్యునిగ జేసికొని యిట్లనియె. నీ వీనగలను గొనిపోయి రాజనగరునకు సమీపమున గలవర్తకులకు విక్రయింపుము. రాజభటులు వచ్చి పట్టుకొనినచో నాగురువు ఇచ్చెనని చెప్పి వారిని నాకడకు గొని రమ్మని పంపెను. రాజనందనుడు బైరాగివేషమున నగల నమ్ముచుండ రాజభటులు చూచి పట్టుకొని యీనగ లెచ్చటివని యడిగి వివరమును దెలిసికొని గురుశిష్యుల నిర్ధారను నగలతో బంధించి రాజుగారి కొల్వునకు గొంపోయిరి. రాజు వారిం జూచి ఓ బైరాగులారా! ఈనగలు నాకుమా ర్తెవి. మీ కెట్లు దొరకెనన మంత్రిపుత్రు డిట్లనెను. మహారాజా! నిన్న రాత్రి మేము శ్మశానములో జపము జేసికొనుచుండ నొకఢాకిని సర్వా భరణభూషితయై మమ్ము సమీపించెను. మే మామెను మంత్రములతో స్వాధీనము జేసికొని యామెనగలను దీసికొని తొడలపై త్రిశూలచిహ్న మును వేసి పంపితిమి. అని చెప్పెను. రాజు అంతఃపురములోని కేగి భార్యను పిలిచి పద్మావతి తొడలపై త్రిశూలచిహ్న ముండెనో లేదో

చూచి రమ్మని పంప రాణికుమార్తెను పరీక్షించి ఎడమతొడపై త్రిశూల చిహ్న మున్నదని పలికెను.

రాజు కపటయోగిని రహస్యముగ బిలిచి కర్తవ్య మేమని యడుగ నత డోరాజేంద్రా! నీకుమార్తె ఢాకిని. దానిని రాత్రివేళ నూరి బయట వదలివేయుము. లేకున్న నీకు నీరాజ్యమునకు కీడు. అని పలుక రా జారాత్రియే పద్మావతి నిద్రలోనుండ నామెను మంచముతోసహా సేవకుల కిచ్చి రుద్రభూమిలో వదలివేయుడని చెప్పెను. సేవకులు రాజా జ్ఞను బాలించి పద్మావతిని శ్మశానములో వదలి పట్టణమునకు వచ్చిరి. చాటున దాగియున్న రాజకుమార మంత్రినందను లామెను గుఱ్ఱముపై నెక్కించుకొని కతిపయప్రయాణముల నిజనగరం జేరి తల్లిదండ్రులకు సం తోషము గలిగించిరి. వజ్రముకుటుడు శుభముహూర్తమున పద్మావతిం బెండ్లాడి యామెతో సకలసుఖముల ననుభవించుచుండెనని చెప్పి భేతాళు డిట్లనియె. రాజా! ఈకథలో రాజపుత్రుడు-మంత్రినందనుడు-కొత్వాలు-రాజు నల్వు రున్నారు. ఈనల్వురిలో దోషి యెవరో తెల్పుమన విక్ర ముడు యోజించి పద్మావతి తండ్రియగు రాజే దోషియని నామతము. ఏమనగా! మంత్రిపుత్రుడు, కొత్వాలు రాజాజ్ఞనెరవేర్చినవారు. ప్రభువు కోరిక దీర్చుట వారిధర్మము. కావున వారు దోషులు కారు. వలచిన దాని నెట్లయిన స్వాధీనపరచుకొన దలంచిన రాజపుత్రుడు దోషి గాడు. చెప్పుడు మాటలలోని యదార్థమును గ్రహింపలేక కూతురును వెడల గొట్టిన రాజే దోషియని చెప్పగా భేతాళుడు మరల వానిని బట్టి బంధిం చెను. భేతాళుడు రెండవప్రశ్నమును గూర్చినకథను జెప్ప నారంభించెను.

రెండవకథ.

రాజా! వినుము. యమునానదీతీరమున ధర్మస్థాన మనునగరము కలదు. గుణాధిపు డనురా జాపురమును బాలించుచుండును. ఆనగరమున

కేశవశర్మ యనుతపోనిష్ఠాగరిష్ఠుడైన బ్రాహ్మణోత్తము డొకడు కలడు. అతని కొకకుమారుడు కుమార్తెయు గలరు. కుమార్తెపేరు మధుమాలతి. కొంతకాలమునకు కూతురు వివాహోచితవయస్క యగుటచే తల్లిదండ్రులు సోదరుడు నామెకు వరునికై ప్రయత్నించుచుండిరి. ఇట్లుండ నొకనాడు కేశవశర్మ బంధువులయింటిలో శుభకార్య మగుటచే నట కేగెను. కుమారు డొకమిత్రుని గృహమున కేగెను. ఇంటిలో తల్లి యొక్కరిత యుండెను.

ఇట్లుండ నాసమయమున పరదేశస్థుడైన యిరువదివత్సరములు వయస్సుగల విప్రు డొక్క డాయింటి కరుగుదెంచి సావడిలో గూర్చుండి యుండెను. ఇంటియజమానురా లాబ్రాహ్మణపుత్రుని కుల, శీల, విద్యాసాంప్రదాయములను విచారించి సంతృప్తి నంది యతనితో నీకు నాకుమార్తె నీయ దలంచితిని. నాభర్త వచ్చువరకు నుండుమని చెప్పెను. విప్రుడు వల్లెయని యటనే గూర్చుండెను. బంధువులయింటి కేగిన కేశవశర్మ యటనున్న విప్రకుమారులలో నొకని విద్యావినయసద్గుణము లను గాంచి తనకుమార్తె మధుమాలతి నిచ్చెదనని వాగ్దాన మొసంగి వెంటగొని వచ్చెను. ఇదేవిధముగ నామెసోదరుడుకూడ నొకవిప్రయువ కునకు దనసోదరి నిత్తునని చెప్పి తీసికొనివచ్చెను. ఈవిధముగ వా రిర్వ్వ రును చెరియొకవరుని దెచ్చునప్పటి కింటిలో నొకవరు డుండుటజూచి కేశవశర్మ తనకూతురును మువ్వురువరుల కిచ్చు టెట్లాయని యోచింప నారంభించెను. విప్రయువకులు మువ్వురిలో నొకనిపేరు త్రివిక్రముడు. రెండవవానిపేరు వామనుడు. మూడవవానిపేరు మధుసూదనుడు.

కేశవశర్మ కర్తవ్యజ్ఞానశూన్యుడై విచారించుచుండ నింతలో భార్య రోదనము జేయుచు వచ్చి మధుమాలతిని పాముకరచె ననియు మడియున్నదనియు దెలిపెను. తండ్రి దుఃఖాక్రాంతుడై యూరిలోని

కేగి నల్వురై దుగురు విషవైద్యులను మంత్రిగాండ్రను పిలుచుకొని వచ్చెను. వా రంద రాపడియున్న విప్రకన్యకను జూచి నాటి తిథి, వార, నక్షత్రములను, కాలములను గమనించి యీమె జీవింపదని నిర్ధారణ మొనర్చి వెడలిపోయిరి. కొలదిగడియల కావిప్రబాలిక ప్రాణములను విడిచెను. తండ్రి కన్నీరు గార్చుచు కుమార్తె కళేబరమును గొనిపోయి రుద్రభూమిలో దహనము జేసి యింటికి వచ్చెను. విప్రయువకులు మువ్వురు నాదహనము చేసిన చోటి కేగిరి. వారిలో నొక డామె యెముకల నేరి మూటగట్టుకొని బైరాగివలె వేషము ధరించి దేశములపై కేగెను. మరియొక డామిగిలినబూడిదను మూటగట్టుకొని యీప్రాంతమునే నొకతాటియాకులగుడిసెను నిర్మించుకొని యుండెను. మూడవ వా డొకసన్యాసియై దేశములన్నియు దిరుగుచు నొకదినమున నొకయూరిలోనికి బోయి బ్రాహ్మణగృహమున కేగెను. ఆయింటియజమాని వచ్చి యీదినమున మాయింట నతిథిసత్కారము గైకొనవలయునని ప్రార్థింప వల్లెయని యంగీకరించి స్నానము జేసి యొకపీఠమున గూర్చుండి జపము జేసికొనుచుండెను. ఆబ్రాహ్మణుని భార్య వంట జేసికొనుచుండెను. మధ్యాహ్నకాల మగునప్పటికి వంట యగుటయేగాక బ్రాహ్మణుని జపము పూర్తి యయ్యెను. గృహయజమాని వచ్చి స్నానముజేసి దేవతార్చనము పూర్తి జేసి నివేదన మొనర్చెను. ఇంటియజమానురాలు అరటియాకులను పఱచి వడ్డన జేయ నారంభించెను. కొంతవడ్డన యైనది. మరికొన్నిపదార్థములు మిగిలినవి. ఇంతలో నామెకొమరు డైదేండ్లవాడు నిద్రలోనుండి లేచివచ్చి రోదన మొనర్చుచు తల్లిని చుట్టుకొనెను. పిల్లవానిని మరిపింప నెంతప్రయత్నించినను వాడు తల్లిని వదలలేదు. వడ్డించుట పూర్తి కాలే దనుకోపము తొందరయు వెంబడించుటచే పిల్లవాని నొక్కవిసురున మండుచున్న పొయిలో బడవేసెను. చూచుచుండగనే బాలుడు కాలి బూడిద యయ్యెను. అతిథియైయున్న మధుసూదనుడు

చూచి భయకంపితచిత్తుడై వడ్డించిన విస్తరిని వదలి లేచి నిల్చుండెను. గృహయజమాని భుజింపక లేచితివేమని యడుగ నతఁడు బ్రాహ్మణోత్తమా! నీభార్య చూచుచుండగ శిశుహత్య జేసినది. ఇట్టిపాతకము జరిగిన నీయింట నెవ్వరు భుజింతురు? కావున నేబోయెద నని పలుకగా నాయజమాని స్వామీ! తొందరపడకుము. అని లోపలి కేగి యొకపుస్తకమును గొనివచ్చి యందున్న సంజీవినిమహామంత్రమును బఠించి మూలమంత్రమును జపించి జలమును మంత్రించి చనిపోయిన బాలుని యెముకలపై జల్లగా నాబాలుడు సజీవుడై లేచి నిల్చుండెను. మధుసూదను డీవింతను జూచి యాశ్చర్యపడి భోజనమునకు గూర్చుండెను. అనంతర మాత డొల్లిన నావిద్యను నేర్చుకొనినచో తనపేరురాలిని బ్రదికించుకొనవచ్చునని నిశ్చయించి యాగృహయజమానిని ప్రార్థించి కొన్ని దినముల కాతనిదయవలన నావిద్యను గ్రహించి యాగ్రంథమును సంగ్రహించి మధుమాలతిని దహించిన ప్రదేశమున కేగునప్పటికి త్రివిక్రమవామను లచ్చట జేరి యుండిరి వా రిర్వురును మధుసూదనుని జూచి విదేశముల కేగి యే యే విద్యల నార్జించితి వని యడుగగా నాత డిట్లనియె. మిత్రులారా! నేను మృతసంజీవినీవిద్యను నేర్చితిని. దానిప్రభావము వలన చనిపోయిన వారిని బ్రదికింపగలను. అని చెప్పెను. అట్లయినచో మధుమాలతిని బ్రతికింపు మని యడిగిరి. త్రివిక్రముడు తన మూటలోనున్న ప్రధానాంగములకు సంబంధించిన యెముకల నన్నింటిని నొక్కచోనుంచెను. వామనుడు తాను మూటకట్టి దాచిన భస్మమును చుట్టునుంచెను. మధుసూదనుడు స్నానము జేసి పుస్తకమును విప్పి యామంత్రమును పఠించి జలమును మంత్రించి యాభస్మరాసిపై చల్లగనే మధుమాలతి జీవించెను. ఆవిప్రబాలిక సజీవ యైనంతనే యాముగ్గురు నాకన్యకను స్వీకరించుటకై కలహింప నారంభించిరి. రాజేంద్రా! ఆబాలిక నాముగ్గురిలో నెవ్వరు స్వీకరింపదగునో వచింపు మన విక్ర

మార్కు-డిట్లనియె. భస్మరాసిని ప్రోవు జేసికొని శ్మశానమున గాపుర మున్నవాడే యాకన్యకకు భర్త యగును. కారణ మే మనగా అస్తులను గ్రహించి దేశభ్రమణ మొనర్చినవాడు పుత్రతుల్యుడు. ప్రాణదాన మొనర్చినవాడు తండ్రితో సమానుడు. భస్మరాసిని ప్రోవుజేసికొని దహ నప్రదేశమును గనిపెట్టుకొని యున్నయాతడే భర్త యగును. అని చె ప్పెను. భేతాళు డాసమాధానమును విని మరల చెట్టు కొమ్మ కెగిరి వ్రేలాడుచుండెను. విక్రమార్కుడు మరల వృక్షము నెక్కి యాతనిని బంధించి, భుజమున వై చుకొని వచ్చుచుండెను.

మూడవకథ.

భేతాళు డిట్లని చెప్ప నారంభించెను. రాజేంద్రా! సావధానుడ వై యాలకింపుము. వర్ధమాన మనునగరము కలదు. రూపసేను డనురా జా నగరమును బాలించుచుండెను. ఒకనా డాప్రభువు కోటసింహద్వారమునకు లోపలిభాగమున నిలువబడి కోటవెలుపల జరుగులాకోహలమును విను చుండెను. కొంతకాలమునకు ద్వారరక్షకుని బిలిచి కోటవెలుపల నాకో లాహల మే మని యడుగ నాభటుడు మహారాజా! యాచకులు బహు సంఖ్యాకులు ధర్మార్థులై వెలుపల నిలిచియున్నారు. ఈగందరగోళ మం తయు వారిదే యని విన్నవింప నాప్రభు వాయాచకులను ధాన్యవస్త్రా దులచే సంతోషపరచి పంపుమని నియమించి పంపెను. మరికొంత కాల మున కింకొకభటుడు వచ్చి దేవా! ఎవ్వరో యొక వీరభటు డాయుధ పాణియై తమదర్శనమునకు వచ్చియున్నాడని విన్నవించెను. ప్రభు వా మాటను విని వానిని కొల్వుకూటమునకు గొనిరమ్మని పంపి తాను దర్బారునకు వెడలిపోయెను. రాజాజ్ఞ నొంది యాసేవకు డావీరభటుని దర్బారులోనికిం గొంపోయి ప్రభువునెదుట నిలువబెట్టెను. ప్రభు వాతనిం జూచి నీ వేమి పనిచేయుదువు? నీ కేమి జీతము కావలయునని యడిగెను.

భటుడు నమస్కరించి మహారాజా! నేను రాజపుత్రుడను. తా మేకా
ర్యము జేయు మనినను సంసిద్ధుడను. నాకు జీతము దినమునకు వేయి
తులములు బంగారము కావలయు నని యడిగెను. నాభార్య, ఒకకుమా
రుడు, ఒకకుమారిత, నేను తప్ప నాకుటుంబమున నైదవనారు లేరు.
నాపేరు వీరబలు డందురు. ఇదే నావృత్తాంత మని విన్నవించెను. వాని
మాటలను విని సభలోనివా రందరును నవ్వుకొన నారంభించిరి. ప్రభు
వగురూపసేనుడు మాత్రి మట్లుగాక వీరబలుని వాంఛితమునుగూర్చి
తలపోయుచుండెను. ఇంత గొప్పవేతనము నడిగినవారు లేరు. ఇత డెం
దుల కడిగెను? ఇందులకు బ్రతిఫలముగ నత డేమి చేయునో జూడవల
యు నని నిశ్చయించి ఖజాంజీని పిలిచి కొన్నిదినములవరకు నీత డడిగినట్లు
దినమునకు వేయితులములబంగారము నిచ్చుచుండు మని యాజ్ఞాపించెను.

వీరబలు డాప్రకారము ప్రభు వొసంగెడి బంగారమును మూడు
భాగములుగ జేసి రెండుభాగములు బ్రాహ్మణులకు, బీదలకు దానము
కొఱకును సన్యాసి - సాధువులు మొదలగువారియాతిథ్యముకొఱకును
వెచ్చించుచు మిగిలినవంతుబంగారమువలన తనకుటుంబవ్యయము జేసికొ
నుచు కాలము గడుపు చుండెను. మరియును ప్రతిదిన మతడు సంధ్యా
కాలమునకే కార్యక్రమమును పూర్తి జేసికొని డాలు, ఖడ్గమును ధరించి
రాజు పరుండు శయనమందిరద్వారమున నిలువబడియుండి ప్రభు వెప్పుడు
పిలిచిన నప్పుడు సిద్ధముగ నుండుటయే గాక మహారాజున కంగరక్షకుని
వలె సంచరించుచుండెను.

ఒకనాడు మహారాజు రాత్రివేళ పరుండియుండ నతనిచెవులకు
స్త్రీరోదనము వినబడెను. రూపసేనుడు లేచి కూర్చుండి ఎవరు వారు?
అని కేకవైచెను. వీరబలుడు రాజుయొక్క పిలుపును విని దేవా! ఏమి
యాజ్ఞ యని యడుగ నతడు ఎచ్చటనుండియో స్త్రీరోదనము వినవచ్చు

చున్నది. బహుశా రుద్రభూమిసమీపమున యని తలంచెదను. నీవు పోయి యీరహస్యమును తెలిసికొని రమ్మని పల్కెను. వీరబలుడు చిత్త మని ప్రభువుకు నమస్కరించి వెడలిపోయెను. ఇంతరాత్రికాలమున నీచీకటిలో రుద్రభూమినిగూర్చి పోవ్రుటయన దనసేవకులలో నెవ్వడును సాహసించి యుండడు. ఈవీరబలుడు సాహసించి పోవ్రుచున్నాడు. వీనికార్యక్రమ మేమో చూడవలయు నని తలంచి నల్లనిమస్తులను ధరించి ఖడ్గమును దుస్తులలో దాచి యీయంధకారములో రాజు వీరభటుని వెనువెంట గూఢముగా బోవ్రుచుండెను. వీరబలు డాధ్వని ననుసరించి క్రమముగ శ్మశానవాటిక కేగెను. అచ్చట నొకసౌందర్యవతియైన స్త్రీ శిరముమొదలు పాదమువరకు సువర్ణాభరణముల ధరించి రోదన మొనర్చుచుండెను. మధ్య నొకమారు గంతులు వేయుచు దనలో దానె నవ్వుకొనుచు మరల గొమ్మ మోదుకొనుచు రోదనము జేయుచుండెను. వీరబలుడు దూరముననుండి యామెయొక్క విధానము నంతయు జూచుచు సాహసముతో సమీపించి నీ వెవ్వతెవు? ఈరుద్రభూమిలో గూర్చుండి రోదనము జేయుచుంటి వేల? అని యడుగ నామె యిట్లనియె. నేను రాజలక్ష్మిని. ఈరూపసేనమహారాజుయొక్క రాజభవనమున సదాచారము నశించి దురాచారము బయలుదేరుచున్నది. జ్యేష్ఠాదేవి ప్రవేశింప బోవ్రుచున్నది. నే నిక నుండజాలను. నే నీప్రభువు నాశ్రయించి చాల శాంతచిత్తనై యుంటిని. కాని నే నెంతయో కాలము నిలువను. మరియు నీరాజు నెలదినములకు మరణించును. అందువలన దుఃఖించుచుంటి నన వీరబలుడు దేవీ! మాప్రభువు చిరంజీవియై యుండుట కేమియు మార్గము లేదా? యని యడుగ నాదేవి వీరుడా! వినుము. ఈరుద్రభూమికి తూర్పుగా నాలుగుక్రోసులదూరమున నొకదేవీమందిరము కలదు. నీ కుమారుని గొనిపోయి యాదేవికి బలి యొసంగితివేని రూపసేనమహారాజు దీర్ఘాయుష్మంతుడై రాజ్య మేల గలడు. ఇది యథార్థము అని వచించెను.

వీరబలుడు తిరిగి తన యింటికిఁబోవను బోవుచుండ రాజు వెన్నాడి యతనికార్యక్రమమును గనిపెట్టియుండెను. వీరబలు డింటికేగి భార్యను, కుమారుని నిద్రనుండి లేపి కూర్చుండబెట్టి రాజ్యలక్ష్మి చెప్పిన వృత్తాంత మంతయు వివరించి యిప్పుడు కర్తవ్య మేమి యని యడుగ కుమారుడిట్లనియె. తండ్రీ! నాజన్మము కృతార్థత నందుతరుణము వచ్చినది. ధర్మాత్ముఁడై మరియును మన కన్నదాతయైన ప్రభురక్షణ మవశ్యకర్తవ్యము. అదియునుగాక జనకాజ్ఞ మరియును బలీయము. ఇంతేగాక నాదేహము పరమేశ్వరియైన కాళీమాత కర్పిత మగుచున్నది. ఎప్పుడో యొకప్పు డీశరీరము నశించునదే. కావున జన్మ సార్థక మగుమరణ మానందకరము గావున నాలస్యము జేయక పోదము రమ్మని వచించెను. వీరబలుడు భార్యం జూచి గృహిణీ! జనకాజ్ఞను బాలించు కొమరుడు-రోగహీన మగుదేహము - సర్వలాభకరమైన విద్య - చతురుడైన మిత్రుడు - పతియాజ్ఞను జరించు భార్య కలవాడు ధన్యుడని పెద్దలందురు. కావున నీవు నీకొమరుని సంతోషముతో నాతెంట బంపెదవా? యన నామె యిట్లనియె. నాథా! ప్రపంచకమున నాకు కుమారుడు, కుమార్తె, సోదరుడు, బంధువు మొదలగు వారితో నెట్టి యవసరమును లేదు. నాకార్య మంతయు మీతోనున్నది. నాసద్గతి మీరే. స్త్రీలకు వేరు వ్రతములుగాని, దానముగాని, పూజలుగాని లేవు. పతిసేవయే ప్రధాన వ్రతము. దరిద్రుడుగాని, కుంటిగాని, గ్రుడ్డిగాని యెట్టివాడైనను వానిని సేవించి వానియాజ్ఞల నొనర్చి తరింపవలయునని శాస్త్రములు ఘోషించుచున్నవి. పతియాజ్ఞను దిరస్కరించిన యువతికి నరకమె గతియని పెద్దలందురు. కావున మీయాజ్ఞయే నాకు కర్తవ్యము. మీసంకల్పమే నాకు శిరోధార్యము. ఇంతకన్న నేను చెప్పనలసినది లేదని వచించెను. కుమార్తె తండ్రిని జూచి నాన్నగారూ! ప్రాణముల నిచ్చియైన ప్రభువును రక్షింపవలయును. రాజు లేకున్న రాజ్య మరాజక మగును. ప్రజ

లనేక కష్టములకు బాల్పడుదురు. కావున ప్రభురక్షణముకొఱకు మన కుటుంబ మంతయును త్యాగమునకు సిద్ధపడవలయును. అని చెప్పెను. ఈవిధముగ వారు నల్వు రాలోచించుకొని బయలుదేరి యరణ్యము దాటి దుర్గాలయమును జేరిరి. కుమారుడు దేవిముందు సాష్టాంగపడి తల్లీ! లోకమాతవైన నీకు నాశిరమును కానుకగా నొసంగుచుంటిని. ఈయుపహారమును గైకొని మాప్రభువును- ఆతనివంశమును- రాజ్యమును రక్షింపుము. అని పల్కి మెడను వంచి తండ్రీ! సిద్ధముగ నుంటినన వీరబలుడు వెంటనే ఖడ్గమెత్తి జయ పరమేశ్వరాయని యొక్కవ్రేటుతో కుమారుని శిరమును తెగనరికెను. తల తెగి క్రింద బడెను. సోదరుని మరణమును జూడలేక చెల్లెలు తటాలున తండ్రిచేతి ఖడ్గము నందుకొని తన శిరమును ఖండించుకొనెను. బిడ్డల మరణమును జూచి గుండెలు చెదరిపోయి తల్లి యును కరవాలమున తనశిరమును కాళికి కానుకగా నర్పించెను. ఇట్లు కొమరుడు, కొమరిత, భార్య మరణించుట జూచి ఆహా! నే నెవరిని పోషింప ధన మార్జించుచుంటినో యట్టి దారపుత్రాదు లీలోకమును బరిత్యజించిరి. ఇక నెవరికొఱ కీధనార్జనము? ప్రభువును రక్షింప దలంచిన నాకోర్కె నెఱవేఱినది. ఇంక నాప్రాణములతో నవసరము లేదు. అని తలంచుచు చేతిఖడ్గముతో పొడుచుకొని వీరభటుడు తన ప్రాణములను వదలెను.

చాటుననుండి చూచుచున్న ప్రభువు వీరబలుని సంపూర్ణ త్యాగమును జూచి ఆశ్చర్యపడినవాడై ఆహా! ఒక్కనా జీవితము కొఱకీకుటుంబ మంతయు నాత్మహత్యకు బాల్పడినదే. వీరిస్వామిభక్తి లోకాతీతమైనది. ఇట్టి మహాత్ముని కుటుంబము నాకొఱకై ప్రాణపరిత్యాగము జేయ నే నేల జీవింపవలయును? అని తలంచి రూపసేనుడు క్రిందపడియున్న ఖడ్గమును గైకొని తనకంఠమును నరుకుకొన బోవుచుండ దేవి ప్రత్యక్షమై నీ సాహసమునకు భృత్యవాత్సల్యమునకు సంతోషించితిని.

నీకిష్టమైనవరము నడుగుమన రూపసేనుడు దుర్గాపాదములకు ప్రణమిల్లి లోకజననీ! నాకై యీవీరబలుడు కుటుంబసహితముగ మరణించినాడు. కావున సకుటుంబముగ వీనిని బ్రదికింపుము. ఇదే నావాంఛ యనవుడు దుర్గాదేవి సంతసించి వీరబలుని భార్యాపుత్రులతో సజీవుని గావించెను. వీరబలుడు భార్యాపుత్రులతో నిద్రనుండి లేచినట్లు నిలువబడెను. రూపసేనుడు వీరబలుని కౌగలించుకొని యతని స్వామిభక్తికి మెచ్చుకొని తన రాజ్యములో సగభాగ మాతని కొసంగెను.

అని చెప్ప విక్రమార్కుడు వీరబలుని స్వార్థత్యాగమునకు పలు విధముల మెచ్చుకొని ఇట్టి విశ్వాసపాత్రులైన భృత్యులుగల ప్రభువు ధన్యుడని మెచ్చుకొనెను. భేతాళు డిట్లనియె. రాజా! ఈయెదుగురిలో నెవరు త్యాగశీలురని యడుగ విక్రమార్కు డిట్లనియె. ప్రభు వగురూపసేనుని త్యాగమే గొప్పది. కారణ మేమనగా? జనకాజ్ఞను పాలించుట కై పుత్రుడును, సోదరమరణమును జూడజాలక పుత్రికయు, సంతతియొక్క దుర్మరణమున కోర్వలేక తల్లియు మరణించుట స్వాభావికములు. స్వామి కొరకు సంపూర్ణత్యాగమునకు సిద్ధపడుట వీరబలునకు ధర్మము. సేవకుని ధర్మబుద్ధికి సంపూర్ణత్యాగ మొనర్చినందులకు బ్రతిఫలముగ దన ప్రాణముల గోల్పోవ దలంచిన రూపసేనుని త్యాగమే గొప్పది. అని పలుకగా భేతాళుడు తటాలున పైకెగిరి చెట్టుకొమ్మను వ్రేలాడుచుండెను.

నాలుగవకథ.

విక్రమార్కుడు మరల భేతాళునిబట్టి తెచ్చుచుండగా భూతాధిపతి యిట్లు చెప్ప నారంభించెను. రాజా! భోగవతి యనునగరమును కీర్తికేతుడను రాజు పాలించుచుండెను. ఆరాజుదగ్గర త్రికాలవేదియైన చిలుక యొకటి కలదు. ఒకనాడు రాజు చిలుకను సమీపించి యోకీరరాజమా!

నే నొక్కటి అడిగెదను. ప్రత్యుత్తరము నిచ్చెదవా యన నాచిలుక రాజేంద్రా! నీ వెట్టిప్రశ్నము నడిగినను చెప్పెద నన రాజు నాకు దగిన భార్య యెచ్చట నున్నదో చెప్పు మనగా నాశుకము రాజా! మగధేశ్వరుని కుమార్తెయగు చంద్రావతి యనుకన్యక గలదు. ఆమె సౌందర్యవతి, గుణవతి, విద్యావతియు నని ప్రసిద్ధి జెందినది. ఆమెయే నీకు దగిన భార్య యని వచించెను. కీర్తికేతుడు మరునాడు సభలోనుండి తనపట్టణములో నున్నగొప్పజ్యోతిష్కుని రావించి చిలుక నడిగినప్రశ్నము నడిగెను. ఆజ్యోతిష్కుడు లెక్కవేసి ప్రశ్నమును జూచి దేవా! మగధేశ్వరుని కుమార్తెయే నీకు భార్య యగు ననిచెప్పెను. ఆమాటను విని యొకబ్రాహ్మణుని బిలిపించి విప్రోత్తమా! నీవు మగధేశ్వరునికడ కేగి యతని కుమార్తె చంద్రావతిని నా కొసగుటకు చెప్పి సంధానము జేసికొని రమ్ము. నీకు విశేషించి బహుమతుల నిచ్చెద నని పల్కి యూపా అని మగధేశ్వరునికడ కంపెను.

చంద్రావతిదగ్గర నొక్కమైనాగోరువంక గలదు. అపక్షియు నెవ్వరెట్టిప్రశ్నము నడిగినను చెప్పగలదు. ఒకనాడు చంద్రావతి దానిని సమీపించి మైనా! నాకు తగినభర్త యెవ్వరో చెప్పెదవా యన నాశారిక రాజకుమారీ! భోగవతీనగర మహారాజగు కీర్తికేతుడు నీకు భర్త యగును. అని చెప్పగా నాకన్యక చూడకున్నను కీర్తికేతునిపై వలపు గలిగియుండెను. భోగవతీపురబ్రాహ్మణుడు మగధేశ్వరుని కొల్వుకూటమున కేగి ప్రభువును దీవించి యాతనిచే గౌరవింపబడి పీఠమున గూర్చుండి కీర్తికేతునిసందేశ మెరింగించి యతనిప్రతిబింబమును చేతి కిచ్చెను. మగధేశ్వరుడు సంతసించి తనపుత్రిక యనుమతినిగూడ గైకొని యొకబ్రాహ్మణుని పిలిచి బ్రాహ్మణోత్తమా! నీ వీప్రభుతితో భోగవతీనగరమున కేగి కీర్తికేతునితో మే మంగీకరించితి మనియు, శుభలగ్నమును విచారిం

చి పెండ్లికి తరలి రావలయునని చెప్పి మే మిచ్చుకానుకల నతని కొసంగి రమ్మ్మ. అని చెప్పి పంపెను. బ్రాహ్మణు లిర్వురును శీఘ్రకాలములో భోగవతీనగరముం జేరి ప్రభువు కొల్వుకూటమున కేగి నిలువబడి యాశీర్వదించి యొక చోట నాసీనులైరి. మగధేశ్వరుని యంగీకృతిని విని కీర్తి కేతుడు సంతోషముతో శుభలగ్నమునకు సపరివారుడై పెండ్లికి తరలి పోయెను. మగధేశ్వరుడు చంద్రావతి నిచ్చి పరిణయము గావించి మహా వైభవముతో వేడుకలు జరిపెను. కొలదిదినములకు కీర్తి కేతుడు భార్య తోడను, పరివారముతోడను మగధేశ్వరుని యనుమతిని గొని తననగర మునకు వచ్చెను. చంద్రావతి వచ్చునపుడు తనప్రాణపదమగు గోరువం కనుగూడ దెచ్చుకొనెను. రాజు చిలుక గోరువంకల పంజరములను రెండింటిని చంద్రావతియంతఃపురమున గట్టించెను.

ఒకనాడు కీర్తికేతుడు భార్యతో నంతిపురమున సరససల్లాపముల నాడుచు నిట్లనియె. దేవీ! మన మీశుకశారికలకు వివాహము చేయుద మా యన నామె యంగీకరించెను. మరునాడు రాణి రాజు లిర్వురును గూర్చుండి శుకశారికలకు వివాహము జేసి యా రెండింటి నొక్క సుందరమైన పంజరమున నుంచిరి. నాటిరాత్రి చంద్రావతీకీర్తికేతు లిర్వురును పరుండియుండ పంజరములోని శుకము శారికను జూచి ప్రియురాలా! మన మిర్వురము కేళీవిలాసముల ననుభవింతము. భోగమునకన్న నధిక మే మున్నదని పలుక శారిక యిట్లనియె. నాకు పురుషజాతియన్న విరోధము. పురుషులు దుర్మార్గులు, క్రూరులు, హంతకులు. ఆజాతిని నమ్మరాదని పలుక శుక మిట్లనియె. నీవు పొరబడుచుంటివి. స్త్రీ లెంత సాహసమున్నకైన వెనుదీయరు. పాపములకు, విశ్వాసఘాతుకత్వమునకు యువతులు స్థానములు. స్త్రీ జాతియంత దుష్టజాతి వేరు లేదనెను. ఆ రెండింటి కిట్లు వివాదము జరుగుచుండ ప్రభు వాశుకశారికలను బిలిచి

వారివివాద మే మని యడుగ నొరికె తనయభిప్రాయ మెఱింగించి మహా రాజా! పురుషుల దుర్మార్గమునకు మీ కొకయుదాహరణమును దెల్పెద నాలకింపుడు.

మహేంద్రపురమున మహాధనికుడని పేరుగాంచిన మహాధనుడను వ్యక్తి గలడు. అతనికి చిరకాలము గడచినను సంతానము కలుగకపో వుటచే తీర్థయాత్ర లొనర్చియు - పెక్కు-వ్రతము లొనర్చియు - మహా త్ముల సేవించియు - నవిధముగ పెక్కు-పుణ్యకర్మ లొనర్చుటవలన నతని కొకకుమారుడు గల్గెను. మహాధను డానందభరితుడై ధనమును విచ్చల విడిగా వెచ్చించి పుత్రోత్సవమును బంచిపెట్టెను. బ్రాహ్మణుల కవ్వే రిగా ధనము నొసంగెను? బీదల కన్నదానము జేసెను. అబ్బాలునకు శై శవము గడచి యైదవయేడు వచ్చుటజూచి తల్లిండ్రులు కేశఖండన మొ నర్చి చదువ వేసిరి. లేకలేక పుట్టినబాలు డగుటచే గారాబముగా పెంచు చుండుటవే నాబాలుడు క్రమముగ భయభక్తులు లేక పాఠశాలకు బో యి పాఠములు చదువక బాలురతో వాదము లాడుచు, కలహించుచు నాటపాటలచే ప్రొద్దు బుచ్చుచుండెను. ఈవిధముగ బదునెన్మిదేడులు వచ్చునప్పటికి సకలదుర్గుణములు పట్టుబడెను. క్రమముగ వారనారీసాంగ త్యమును సంపాదించుటచే ధనమును మంచిసీటివలె ఖర్చు పెట్టుచుండె ను. కొంతకాలమునకు ధనశూన్యుడై తనయూరు వదలి చంద్రపురమను నగరమున కేగి హేమగుప్తుడను వర్తకునియింటికి బోయెను. హేమగుప్త డతని నాదరించి వృత్తాంత మడుగ నిట్లనెను. నే నొకవర్తకుని కుమారు డను. సరకుల నోడ కెక్కించి ద్వీపాంతరమున కేగి వాని నమ్మి ధనము లోనూడ తీసుకొని స్వదేశము జేరుచుండ తుపానుగాలి విజృంభించి మే మున్నయోడను ముంచివైచెను. అందరు చనిపోయిరి. నాచేతి కొకయో షకొయ్య దొరకినది. దాని నాధారము జేసికొని కొట్టుకొనిపోవుచు

మూడుదినముల కొకయొడ్డు జేరితిని. పరివారము పోయినది. ధనము సముద్రములో గలసినది. కట్టుగుడ్డలతో నీవిధముగ స్వదేశము జేరబోవుచుంటిని. ఇదియే నావృత్తాంతము.

అని చెప్ప హేమగుప్తుడు విని చాల విచారించి తనమనమున నిట్లు తలపోసెను. ఇత డొకధనికుడగు వర్తకుడు. కాలకర్మమున నిట్లు కష్టములకు బాల్పడెను. దరిద్రము చిరస్థాయి కా నేరదు. కావున నా కున్నయొక్కకుమారిక నీతని కిచ్చి యింట నుంచుకొనెద ననితలంచి భార్యకడ కేగి తనయభిప్రాయ మెఱింగింప నామెయు భర్తృయభిప్రాయ ముస కంగీకరించెను. వెంటనే హేమగుప్తుడు బ్రాహ్మణుల రావించి శుభలగ్నము నేర్పాటుచేసి తనకుమార్తె యైన చంద్రికను నిచ్చి కన్యాదాన మొనర్చెను. మహాధనుని కొమరు డిట్లు చంద్రికను బరిణయమై మామ గారియింట కొంతకాలము సుఖముగ నుండి యొకనాడు భార్యతో తన స్వదేశమునకు బోవలయునని వచించెను. చంద్రిక పతియభిప్రాయమును తల్లిదండ్రుల కెఱింగింప తండ్రి యిట్లనియె. పరాధీనయైన కన్యయంను మన కెట్టిస్వాతంత్ర్యమును లేదు. ఆతడు నెల్లదలంచిన మాయభ్యంతర మేమియును లేదు. అని చెప్పి యల్లుని బిలిచి నాయనా! మాకు చంద్రిక యేకమాత్రసంతానము. చిరకాల మామెను నదలి యుండజాలము. కావున మీస్వదేశమున కేగి శీఘ్రకాలములో నిం రిర్వురు మరలి రావలయునని నాకోరిక. తదుపరి నీయిష్టము. అని తనయభిప్రాయ మెఱింగించి పెక్కునగలు, సారెచీరలు, అల్లునకు ధనము బహుమతుల నొసంగి కుమార్తెను జామాతను సాగనంపెను. చంద్రిక యొకపరిచారికను వెంట నిడుకొని సవారి నెక్కి భర్తవెంట బోవుచుండ నొకచోట రాత్రి యయ్యెను. చీకటిపడినతోడనే భార్యయైన చంద్రికను జూచి నీవగ లన్నియు నాచేతి కిమ్ము. రాత్రివేళ చోరులు చూచిన పరిమాదము. నేను భద్రపరచి

యుదయమైనంత నొసంగెద నని వచింప చంద్రిక పతిమాటలను నమ్మి తననగల నన్నింటిని దీసి యతనిచేతి కీయ నాదుర్మార్గు డొకరాత్రివేళ బోయాలకు ధన మిచ్చి సాగనంపి వెంటనున్న దాసి నొకనూతిలో దోర్చిసి, నిద్రలో నున్నతనభార్యను మరియొక నూతులో బడ్డైచి తన తోర్చివ నేగెను. చంద్రిక నూతిలో బడి రోదనము చేయుచు తెల్లవారు వర కానూతిలో నుండెను. ప్రాతఃకాలమున నాతోర్చివ నొకబాటసారి పోవుచు నూతులోనుండి రోదనధ్వని విని తొంగిచూడ చంద్రిక కన పడెను. వెంటనే దిగి యామెను పైకి దీసికొనివచ్చి నీ వెవ్వారవు? ఈ నూతులో నెట్లు పడితివి? అని యడుగ నామె యిట్లనియె. నేను హేమ గుప్తుండను వర్తకుని కుమార్తెను. నాభర్తతో నత్తవారింటికి బోవు చుంటిని. త్రోవలో దొంగలు వచ్చి నాపరిచారికను జంపి, నానగలను హరించి యీనూతిలో ద్రోసినారు. నాభర్త జీవ యే మయ్యెనో నాకు దెలియదు. అని చెప్పెను. అంతియేగాని మానవతి యగుచంద్రిక భర్త చేసిన దుర్మార్గమును వెల్లడింపలేదు. ఆబాటసారి జాలిపడి చంద్రిక నామె పుట్టినయింట నప్పగించి వెడలిపోయెను. హేమగుప్త డాశ్చర్యపడి కుమార్తెను జూచి జరిగినవృత్తాంత మే మని యడుగ చంద్రిక బాటసారికి జెప్పి నవిధముగ అరణ్యములో దొంగలు నాభర్తను బంధించుకొనిపోవుచు మమ్మిరువురను నూతులో ద్రోసినారు. నాభర్త గతి యే మయ్యెనో తెలియ లే దని చెప్పెను. గాని భర్త చేసినదుర్మార్గమును తండ్రితో చెప్ప లేదు. హేమగుప్త డామె నూరడించి నీభర్తను వెదకించి పిలుపింతునని చెప్పెను. కుమార్తెకు తిరిగి యాభరణముల జేయించెను. ఆదుర్మార్గు డైన చంద్రికభర్త యాభరణములను గొని తనయూరుజేరి కొంతకాలము వేశ్యా - ద్యూత - మద్యపానాదులలో మునింగి తేలెను. ఆద్రవ్యము పూర్తియయ్యెను. మరల తిండికి గతిలేనివాడై దారి యేమా యని తలంచి మరల భార్య నెవిన మోసగించి ద్రవ్యమును సంగ్రహింపవల

యు నని నిశ్చయించి కతిపయదినముల కత్తవారింటిని జేరెను. కాని లోనికి బోవ శంకించుచుండెను. తనభూతుకకృత్యము భూమగారికి తెలిసి యుండును. అందువలన వా రేమైన నిందింతు రనుసంశయముతో వీధి లో నిల్చుండెను. చంద్రిక భర్తను జూచి గుర్తించి చేయి పట్టుకొని లోనికిం గొంపోయి తనగదిలోఁ గూర్చుండజెట్టి యిట్లనియె. నాథా! భయపడకుడు. దొంగలవలన బాధింపబడితి మని నాతండ్రితో జెప్పితిని. మి మ్మడిగినచో దొంగలు నగలను దీసికొని నన్ను వదలి రని చెప్పుడు. అని చెప్పి వానిభయము దీర్చి తనపతి వచ్చెనని తల్లితో చెప్పెను. అందరును చాల సంతసించిరి. మామగారు జామాత నెంతయో యాద రించి యింట నుంచుకొనెను. కొంతకాల మట్టుండిన తదుపరి యాపాపా త్ముఁ డొకఁడు చంద్రిక తననగలను ధరించుకొని పట్టుచీర గట్టుకొని తనభర్తదగ్గరకు వచ్చెను. రాత్రి గాఢనిద్రలో నున్నసమయమున మెల్లగ లేచి రహస్యముగ దాచినబొక్కెను దీసి దయలేక గుండెలలో పొడిచి బలవంతముగ జంపి యానగల నన్నింటిని దీసికొని యర్ధరాత్రమున బారి పోయెను. మహారాజా! ఇది నేను కంటితో చూచిన సంగతి. అందువలన పురుషజాతియన్న నా కసహ్యము. అంతకృతఘ్నులు గనుక పురుషుల యందు నాకు నమ్మకము లేదు అనెను.

మైనా యీవిధముగ చెప్పి యూరకుండెను. కీర్తికేతుడు శుక మును జూచి కీరరాజమా! శారిక చెప్పిన వృత్తాంతమును వింటివిగదా! ఇందులకు నీ వేమి చెప్పెద వన నా చిలుక యిట్లనియె. మహారాజా! స్త్రీలు దుష్టబుద్ధిగలవారని దెల్పుట కొక యుదాహరణమును వచించు చుంటిని వినుడు. కంచనపురమను నగరము కలదు. ఆపురమున సాగర దత్తుడను వర్తకుడు గలడు. అతనికి శ్రీదత్తుడను కుమారుడు గలడు. ఆశ్రీదత్తుడు విజయపురనివాసియైన సోమదత్తు డనువానికుమార్తెయగు

జయశ్రీ యనునామెను పెండ్లియాడెను. వివాహమైన కొలదిదినముల కాశ్రీదత్తుడు వ్యాపారమునిమిత్తమై పరదేశములకు బోయి పదు రెండు వత్సరములైనను తిరిగి రాలేదు. తల్లిదండ్రుల దగ్గరనున్న జయశ్రీ యూవ్వనవతియై పతిసమాగమమున కెదురుచూచి విసిగిపోయెను. ఒక నాడు చెలికత్తెను పిలిచి రహస్యముగ నిట్లనియె. చెలీ! నన్ను విరహ తాపము వేధించుచున్నది. ఈకామబాధ మిక్కుటముగా నున్నది. తాళ జాల కుంటిని. నూగ్గమేమియును నాచెలికత్తె యిట్లనియె. అమ్మా! విచారపడకుము. శీఘ్రకాలములో పరమేశ్వరానుగ్రహమువలన నీపతి రాగలడు. అప్పుడు నీవాంఛలు తీఱగలవు. అని పలుక నామాటలను బెడచెవిని బెట్టి చెలికత్తెతో మేడనీదకు బోయి రాజమార్గమున వచ్చుచు బోవుచున్నవారిం జూచుచు దెలుపబడెను. తత్సమయమున నొక నవయవ్వనుడు దివ్యాంబరంబుల ధరించి యొయ్యారముగ రాజ మార్గమునుంచి వచ్చుచుండుటను జయశ్రీ చూచి యాయువకునిపై తనమనస్సు లగ్న ఘగుటచే రెప్పవాల్పక చూచుచుండెను. ఆసనయున కుడును సోమదత్తుని మేడక్రిందకు నచ్చి తలయెత్తి చూడ జయశ్రీ తన్ను నిదానించి చూచుచున్నట్లు తెలుసుకొనెను. ఇర్వురి వీక్షణములు లగ్నములైనవి. జయశ్రీ చెలికత్తెను జూచి సఖీ! ఆపోవుచున్న వయసుకా డెంత యందముగ నున్నాడో చూచితివా? వానితో పొందును నాకు సమకూర్చుము. లేకున్న నాప్రాణములు నిలువవు. అని పలుక నాచెలి వెంటనే క్రిందకు దిగి నాయువకుని గలిసికొని చేసన్నచే తన యింటికిం గొంపోయి సోమదత్తుని తనయ నీపొందుగోరి పరితపించుచున్నది. నీవు రేపురాత్రికి నాయింటికి రమ్ము. అని చెప్ప నాత డానందముతో వెడలి పోయెను. చెలికత్తెయు జయశ్రీ కావార్త నెఱింగించి కాలమును దెలి పెను. మరునాటిరాత్రి చీకటి పడినతోడనే యా యువకు డాచెలికత్తె యింటికి జేరెను. వాని నింట నుండుమని చెప్పి యాలేమ జయశ్రీకడ

కేగి రహస్యముగ నీప్రియుడు వచ్చెనని యెరింగింప నాపడతి పట్టజాలని యానందముతో నలంకరించుకొని యందరు నిద్రించినవెనుక చెలికత్తె సాయమున మెల్లగ తలుపు తెరచుకొని గమ్యస్థానముం జేరెను. చెలికత్తె వారి నిర్వురను గదిలోని కనిపి తాను ద్వారమున భద్రపుగ బరుండెను. జయశ్రీ యూరాత్రియంతయు నాయువకునితో కేళీవిలాసముల గడపి తెల్లవారుఝామున లేచి చెలికత్తె సాయమున నింటికి జేరెను. ఆయువకుడును ప్రాతఃకాలమున లేచి తనయింటి కేగెను. ఈవిధముగ కొన్ని దినములవరకు వారిర్వురకును రహస్యసమావేశము జరిగెను. చెలికత్తెయు వారిరహస్యమును గాపాడుచుండెను.

ఒకనాడామెభర్తయగు శ్రీదత్తు విదేశములనుండి బయలుదేరి యత్తవారింటికి వచ్చెను. భర్తను జూడగనే జయశ్రీకి గుండెలలో రాయి పడెను. అన్నము రుచికరముగ లేకపోయెను. రహస్యముగ చెలికత్తెను బిలిచి సఖీ! ఏమిచేయుదును. నాపురదృష్టము నేడు ప్రత్యక్షమైనది. నేడు నాసుఖమున కాటంకము గల్గినది. అని చెప్పుచు నామెవలన తనప్రియునకు వార్త పంపెను. నాటిరాత్రి తలిదండ్రులామెను శృంగారించి యల్లుడు పరున్నగదిలోనికి బంపిరి. కాని జయశ్రీ భర్తను జూచి సంతోషింపలేదు. మాటాడలేదు. భర్త తనకొఱకు దెచ్చిన కానుకలనైన కంటజూడక పరుండెను. శ్రీదత్తుడు ప్రాణమువిసిగి క్రొత్తయగుట సిగ్గుపడిన దేమో యని తలంచి ప్రయాణముచే బడలి యుండుటచే పరుండెను. వెంటనే నిద్రపట్టెను. సమయమున కే వేచియున్న జయశ్రీ మెల్లగ లేచి భర్త గాఢనిద్రలో నుండు టెరింగి మెల్లగ లేచి తన ప్రియునికొఱకు చెలికత్తెయింటికి బయలుదేరెను. మార్గములో నొక దొంగ జయశ్రీని జూచి యీమె యెవ్వరు? నగలను ధరించి యర్ధరాత్రమున బోవుచున్నది. ఈరహస్య మేమో తెలిసికొనవలయు నని

తలంచి యామెను వెన్నంటెను. జయశ్రీ తన చెలికత్తె యింటిముందున కేగునప్పటి కామెప్రియు డంతకుముందే ప్రియురాలికొఱకు వచ్చుచు గుమ్మములో కాలుపెట్టగనే యొకక్రొచూపు మటనుండి కాటు వేసెను. వెంటనే వా డాయరుగుమీదనే పరుండి ప్రాణములను విడిచెను. జయశ్రీ మెల్లు దాటి యరుగుమీదనున్న ప్రియుని కళేబరమును జూచి నిద్రించు చున్నాడని తలంచి పట్టరానిమోహమున వానిపై బడి ముద్దు పెట్టుకొను చుండెను. చోరుడు రహస్యముగ దాగి యామె కార్యక్రమమును గని పెట్టుచుండెను. మరియును ప్రాంతమం దొకమఱ్ఱిచెట్టుపై నున్నబ్రహ్మ రాక్షసుడు జయశ్రీ చేయుపనిని జూచి యామెతో భోగింపవలయునని తలంచి పరకాయవిద్యచే నామెప్రియుని శరీరములో ప్రవేశించి యామె తో సురతక్రీడల దేలి చివరకు ముద్దుబెట్టుకొనబోయి యామెముక్కును పూర్తిగ కరచి చెట్టుమీదకు బోయెను. జయశ్రీ బాధచే నేడ్చుచు చెలికత్తెను పిలిచి యామెతో జరిగిన సంగతి యంతయు నెఱింగింప నా చెలి నీవు సత్వర మింటికి బోయి యీకార్యమును నీభర్తపై మోపు మని చెప్పి పంపెను. జయశ్రీ శీఘ్రమే బయలుదేరి యింటికి వచ్చి భర్తగదిలో ప్రవేశించి వెక్కివెక్కి రోదనము జేయ నారంభించెను. ఆరోదనమును విని తల్లిదండ్రులు మొదలగువా రాగదిలోనికి వచ్చిరి. చూడ కుమార్తె ముక్కు కోయబడియుండెను. కారణ మడుగ నామె తనభర్తయే యిట్లు కోసెనని వచించెను. అం దున్నవారంద రాతని నిం దింప నారంభించిరి. భర్తయైన శ్రీదత్తు డిది యంతయు చూచి తెల్ల బోయి ఆహా! స్త్రీ లెంతసాహసులు? అందువలననే చంచలయైన యువ తిని - కృష్ణసర్పమును - ఆయుధమును ధరించిన విరోధిని - విశ్వసింపరా దని గ్రంథములు వచించుచున్నవి. అని యెంచి తనపై వచ్చిన అపవాద మునకు జింతింప నారంభించెను.

సోమదత్తుడు కొత్వాలును బిల్చి యల్లుడు చేసినపనిని వివరించి యాతని కప్పగించెను. కొత్వా లాతని బంధించి రాజసమ్ముఖమునకు దో డ్కొనిపోయి సర్వము విన్నవించెను. రాజు శ్రీదత్తుని యడుగగా నాతడు దేవా! నే నేమియు నెరుగ ననెను. జయశ్రీ నడుగ మహారాజా! ఒక్కగదిలో పరుంటిమి. నాముక్కు సతడు గాకున్న నిం కెవరు గోయు రు? న్యాయము దయచేయు డని యేడ్చెను. సాక్ష్యబలమునబట్టి ప్రభువు శ్రీదత్తునకు శూలారోపణశిక్ష విధించెను. భటు లాతని శూల ముకడకు గొంపోయిరి. ఇదంతయు జూచుచున్న చోరుడు తెల్లబోయి నిష్కారణముగ నిరపరాధి దండింపబడుచుండె నని తలంచి భటులను సమీపించి అన్యాయ మని మొఱపెట్టెను. భటు లాచోరుని రాజసముఖ మునకు గొనిపోయి నిలువబెట్టిరి. ప్రభువు వానిం జూచి నీ వెవ్వడవు? ఇం దన్యాయ మేను? అని యడుగ చోరు డిట్లనియె. దేవా! ఇతడు నిర పరాధి. తాము నిష్కారణ శిక్ష విధించినారు. ఇది అన్యాయము కాదా? యన రాజు నిక్కోపియని నీ వెట్లెరుంగుదువని యడుగ చోరుడు స్వామీ! ఈతడు తనభార్యముక్కును గదిలో కోసియుండుటగదా! ఆకోయబడిన ముక్కును తెమ్మని యడుగుదు. అట్లు చెప్పను. రాజు సోమదత్తునితో కోసినముక్కును తెమ్మని బంపెను. కాని యెంత వెదకినను కానరాలేదు. ఊరక వచ్చెను. చోరుడు రాజుం జూచి మహారాజా! ఆముక్కును నేను చూపెదను రండని వెంట గొనిపోయి చెలికత్తె యింటి కేగి యాకళేబర ము నోటిలో నిరుకుకొనిన ముక్కును జూపి రాత్రి జరిగిన చరిత్రమును వివరించెను. ప్రభువు యదార్థమును తెలుసుకొని శ్రీదత్తుని వదలి నిజ మును గ్రహించిన చోరునకు బహుమతి నొసంగి పంపివేసెను. పిమ్మట జయశ్రీని బిలిపించి గాడిదపై నెక్కించి యూరేగించెను. విక్రమార్క మహారాజా! శుకశారికలు చెప్పినకథలు వింటివిగదా! పురుషుడు దుర్మా ర్గుడా? స్త్రీ దుర్మార్గురాలా నిర్ణయింపు మన విక్రముడు స్త్రీలే దుష్ట

రాండని చెప్పెను. కారణ మేమనగా పురుషుడు దుర్మార్గమున బడినను తగిన శిక్ష యుండినచో కొంతకాలమునకు మరలును. అడుది పెడమార్గ మున కాలుపెట్టినదా? బ్రహ్మయైన నామెను మంచిమార్గమునకు దిప్ప జాలడు. కావున శుకము చెప్పినదే యదార్థము. అని చెప్ప భేతాళుడు తటాలున నెగిరి చెట్టుకొమ్మను వ్రేలాడుచుండెను.

అయిదవకథ.

భేతాళుడు విక్రమునితో నైదవకథను చెప్ప నారంభించెను. ఉజ్జయని యనునగరమున మహాబలు డనుపేరుగల రాజు రాజ్యము సేయుచుండెను. ఆరాజుదగ్గర హరిదాసను పేరుగల యుద్యోగి కలడు. ఆయుద్యోగికి మహాదేవి యనుపేరుగల కుమార్తె యుండెను. ఆమె మిగుల సుందరియు, విద్యావతియు నై యుండెను. వివాహోచితవయస్కు రాయైనంతనే తండ్రి వరాన్వేషణము జేయుచుండ నొకదినమున కుమార్తె వచ్చి తండ్రీ! నేను సకలవిద్యాసంపన్నురాలు, సద్గుణవంతురాలునగు వరుని పెండ్లాడెద నని చెప్పెను. తండ్రియు నామెమాటల నంగీకరించి యట్టివా నికై వెదకుచుండెను. ఒకనాడు ప్రభువు హరిదాసును బిలిచి దూరదేశ మందున్న తనమిత్రుడైన మరియొకప్రభువు కుశలవార్తను తెలిసికొని రమ్మని పంపెను. హరిదాసు రాజాజ్ఞ చొప్పున నాదేశమునకు బోయి యారాజునకు దనస్వామి పంపినసందేశ మెఱింగించి యతనియనుమతిని కొన్నిదినము లట నుండెను. ఇంతలో నొకదినమున బ్రాహ్మణు డొక్క డాహరిదాసును సమీపించి నీ కొకవిద్యావతియైన కుమార్తె యున్నదని వింటిని. ఆమెను నా కొసంగుము. అని యడుగ హరిదాసు అతనికి తన పుత్రికనువల్లభము నెఱింగించెను. బ్రాహ్మణుడు హరిదాసుతో నేను సక లవిద్యలు- అరువదినాలుకళలు- నేర్చి యుంటినని చెప్పెను. అందుల కాహరిదాసు బ్రాహ్మణోత్తమా! నీవిద్యాప్రభావము జూపెదవా యన

నత డొకరథమును గొనివచ్చి హరిదాసునకు జూపి దీనిని నేను తయారు చేసితిని. దీనిప్రభావ మేమనగా ఇందు గూర్చుండి యెచ్చటికి బోవలయున న్నను పోవచ్చు నని చెప్పెను. హరిదా సావిప్రునిగూడ వెంట నిడుకొని రథమున గూర్చుండి ఉజ్జయనికి బోవలయునని తలంచినంతనే యారథము నిచిత్రముగ దృటికాలములో వారి నిర్వుర నుజ్జయనిలో గమ్యస్థానమున జేర్చెను. వీ రిర్వురును జేరకముందే హరిదాసుగృహమున నొకచిత్రము జరిగెను. ఏమనగా ఒకబ్రాహ్మణుడు హరిదాసుయొక్క పెద్దకుమారుని జూచి నేను సకలకళలు తెలిసినవాడను. నాకు నీసహోదరి నిచ్చి పెండ్లి చేయు మన నాతడు సరే యని యంగీకరించెను. వీరికి తెలియకుండ మరి యొకబ్రాహ్మణుడు హరిదాసుభార్యను జూచి నేను సకలవిద్యలయం దారితేరినవాడను. నాకు నీకుమార్తె నిచ్చి పెండ్లిచేయుమన నామె సరే యని యంగీకరించెను. ఈవిధముగ హరిదాసు బ్రాహ్మణునితో నిల్లుజే రునప్పటి కిర్వురు వరు లధికముగ సిద్ధపడుటచే నొకకన్యను ముగ్గుర కిచ్చు టెట్లా యని తలపోయుచుండ నాటిరాత్రి యొకరాక్షసు డామ హాదేవిరూపమును జూచి మోహితుడై యపహరించుకొని వింధ్యాద్రి పై నినసించెను. తెల్లవారుజామున లేచి తల్లి, తండ్రి, సోదరుడు మొదలగు వారు మహాదేవికొరకు వెదుకగా నామె యెచ్చటను గాన రాలేదు. అనేకప్రదేశములలో వెదకిరి. ఊరంతయు తిరిగినను కానరాకపోవుటచే చింతాక్రాంతులై యామె కై కన్నీరు విడుచుచుండిరి. హరిదాసు కన్యా ర్థమై వచ్చిన వీరులను జూచి అయ్యలారా! మీరు సకలవిద్యాపారం గతులు. నాకుమార్తె యెచ్చటనున్నదో వచింపు డనగా వారిలో సోద రునిచే నియమింపబడిన వరుడు అయ్యా! నేను త్రికాలవేదిని. మీనంశ యము బాపెదనని చెప్పి కూర్చుండి ధ్యానదృష్టిచే తెలిసికొని హరి దాసూ! నీకుమార్తెను రాక్షసు డొక డపహరించుకొనిపోయి వింధ్యాద్రి పై నుంచె నని చెప్పెను. వెంటనే హరిదాసుచే నియమింపబడిన వీరుడు

ముందునకు వచ్చి నారథము ఫై గూర్చుండిన సత్వర మట చేరగల మని నుడివెను. తల్లిచే నియమింపబడిన వరుడు హరిదాసుం జూచి నేను యుద్ధవిద్యలో ప్రవీణుడను. ధనుర్యుద్ధము, ఖడ్గయుద్ధము రెండును చేయ గల నని నచించెను. నెంటనే యాముగ్గురును వింధ్యాచలమున రాక్షసు డుండు ప్రదేశమున కేగి యా దైత్యుని పారదోలి మహాదేవిని స్వస్థాన మునకు జేర్చిరి. అటుపిమ్మట నాముగ్గురును కన్యకొరకు కలహింప నారం భించిరి. తండ్రియైన హరిదాసుకూడ కూతు నెవ్వని కిత్తునా యని యా లోచింప బొడంగెను. విక్రమార్క మహారాజా! ఆముగ్గురిలో కన్యకు భర్తగా నుండదగినవా డెవ్వడో దెల్పుమన విక్రముడు యోజించి రాక్షసుని సంహరించినవాడే భర్త యని నచించెను. భేతాళు డతనిం జూచి జ్ఞాని నచినకుమ్న నామెజాడ తెలియదు. రథము లేకున్న వా రచ్చటికి పోజాలరు. వీరుడు లేకున్న దైత్యుని జయింపజాలరు. వీరిలో నెవ్వరివిద్య తక్కువైనది? అని యడుగ విక్రము డోభూతరాజా! వినుము. నీవు చెప్పినమూడును సమానములే- కాని రాక్షసుని జయించిన వీరుడు ప్రధాన కారణము. తక్కువా రిర్వురు నతనికి సహాకారకారణ ములు. కావున జయించినవాడే యాకన్యను బరిగ్రహింప నర్హుడని వచింప భేతాళుడు యథాప్రకార మెగిరి వృక్షశాఖను తలక్రిందుగ వ్రేలాడ నారంభించెను.

ఆరవకథ.

మరల విక్రముడు భేతాళుని బట్టి తెచ్చుచుండ నత డిట్లు చెప్ప నారంభించెను. రాజా! వినుము. ధర్మపుర మనుగొప్పపట్టణము గలదు. ఆపురమును ధర్మాత్ముడై న రత్నవర్మ యనురాజు పాలించుచుండెను. అంధకు డనుపేరుగల మంత్రిసాహాయ్యమున నాప్రభువు రాజ్యమును న్యాయబుద్ధితో పాలింపుచుండెను. ఒకనాడు మంత్రి ప్రభువుసన్నిధిం జేసి

మహారాజా! దేవతలలో కెల్ల దుర్గాదేవి మహామహిమ గలది. వాంఛితా
ర్థములు నిచ్చు లోకజనని. ఆదేవి కొకదేవాలయము గట్టించి నిత్యము
షోడశోపచారములచే పూజించినయెడల గొప్పపుణ్యము గల్గును. అని
చెప్పగా రత్నవర్మ మంత్రి చెప్పినట్లు చక్కని దేవ్యాలయమును గట్టించి
యొకశుభలగ్నమున దుర్గామాత నందు బ్రతిష్ఠించి పరమభక్తితో ప్రతి
దినము పూజించుచుండెను. కొంతకాలము జరిగినతదుపరి సంతానహీను
డైన యారాజు దుర్గాదేవి సన్నిధిం జేరి సాష్టాంగనమస్కార మాచరించి
తల్లీ! లోకమాతా! నీవు సర్వమంగళవు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు
గూడ పూజనీయవు. మహిషాసుర - భాండాసుర - రక్తబీజాదిదానవు
లను బరిమార్చి భూభారమును దీర్చిన మహామహిమోపేతవు. తల్లీ!
నీ వాశ్రితభక్తజనకల్పలతికవు. దాసుడనైన నావాంఛను దీర్పుము. అని
వినుతింప నాదేవ్యాలయమునుండి రాజా! నీభక్తికి మెచ్చితిని. నీ కభీష్ట
మగువరము నిచ్చెద కోరుకొనుమని యడుగ నారాజు జగజ్జననీ! పుత్రులు
లేనివానికి గతు లుండవు. వర్గత్రయము తరించుటకు పుత్రునొకయే ప్రధా
నసాధనము కావున నొక్కసుపుత్రు ననుగ్రహింపు మని వేడ నాదేవి
రాజా! నీకోర్కె నెఱవేఱును. మహాపతాపశిరోమణియగు పుత్రుడు
జనించును. అని వర మొసగెను. రత్నవర్మ మహానందభరితుడై నిత్య
మతిభక్తితో దేవీపూజ యొనర్చుచుండ కొంతకాలమున కామహాదేవీ
ప్రసాదమువలన రత్నవర్మభార్య గర్భవతియై పదవనెలలో సుపుత్రుని
గనెను. రత్నవర్మ మహానందభరితుడై పుత్రోత్సవము నతివై భవముగ
జేసి దుర్గాదేవి కుత్సవములు పూజలు జేయించెను.

కొంతకాలమైనతదుపరి ధర్మపురవాసియైన చాకలి యొకడు తన
స్నేహితులతో గలసి తీర్థమను బోవుచు నట నున్నదుర్గామందిరమును
జూచి నమస్కరింపవలయునని లోని కేగెను. అంతకు ముందే పొరుగూరి

లోనున్న రజకకన్యామణి యొకర్తుక దేవీదర్శనమునకు వచ్చి యుండుటచే చాకలి యాసుందరిని జూచి మోహించి యింటి కేగెను.

పోవుసమయమున దుర్గకు మ్రొక్కి– తల్లీ! ఈసుందరిని నాకు భార్యగా జేసితివేని నాశిరమును నీకు కానుకగా నర్పింతు నని పల్కి యింటి కేగెను. అదిమొద లాకన్యకపై మోహముచే విరహపీడితుడై యుండెను. వాని తల్లిదండ్రులు కుమారుని మనోవ్యధకు గారణము తెలిసికొనజాలక చింతించుచుండ మిత్రుడు వచ్చి నాటివృత్తాంతము నెఱిం గించి మీ రాకన్యకను దెచ్చి యతనికి పెండ్లి చేయనియెడల జీవించుట దుర్ఘటము అని చెప్పెను. వెంటనే తండ్రి యాకన్యకయొక్క గోత్ర మును తెలిసికొని యాయూరి కేగి యాసుందరియొక్క తండ్రిని జూచి తాము వచ్చినవృత్తాంతమును దెలిపి నాకుమారునకు నీకుమార్తె నీయు మని యడిగెను. వాడును తనకూతురువలన విషయమును దెలిసికొని యున్నవా డగుటచే యందుల కంగీకరించి శుభలగ్నమునకు తరలి రండని పల్కెను. అని చెప్పి వా డింటి కేగి బ్రాహ్మణులవలన శుభలగ్నమును నిశ్చయించి యానాటికి బంధుప్రులతో కుమారుని వెంటబెట్టుకొని ఆయూరి కేగెను. ఆకన్యాదాతయు పేరి నెమరొక్కని కలిగినంతలో లోపము లేకుండా తనకుమార్తె నిచ్చి కన్యాదానము జేసి పెండ్లిచేసెను. వివాహానంతరము వియ్యంకునకు, అల్లునకు బహుమతు లిచ్చి కూతునకు సారెచీరల నిచ్చి యల్లునివెంట నత్త వారింటి కనిపెను.

కొంతకాలమువర కారజకదంపతులు సంతోషముతో కాలము గడి పిరి. ఒకనాడు చాకలి మామగారియింట శుభకార్యము జరుగుచుండుట చే యాహ్వానింపబడి సఖులతో, భార్యతో గూడి యత్తవారింటికి బోవు చుండ తోవలో దుర్గాలయము కనబడెను. వెంటనే యతనికి తా నా నినమున మ్రొక్కుకున్న సంగతి జ్ఞప్తికి వచ్చుటచే అయ్యో! నేనెంత

యసత్యవాదిని. దేవతాసముఖమున జేసిన వాగ్దానమును దీర్పజాలక పోయితిని. అట్లొనర్చుట మహాపాతకమని తలంచి వెంటనే మిత్రుని జూచి సఖా! నీ వీమెను చూచుచుండుము. నేను దేవీ దర్శనము జేసి వచ్చెదను. అని చెప్పి సరోవరములో స్నానము జేసి దుర్గాదేవియెదుట నిలిచి నమస్కరించి తల్లీ! ఇదే నావాగ్దానము చెల్లించుకొనుచుంటిని. అని పల్కుచు ఖడ్గను నెత్తి యొక్కవ్రేటున శిరమును ఖండించుకొనెను. మొండెమునుండి శిరము వేరై పడెను. వెలుపలనున్న మిత్రుడు కొంతసేపు నిరీక్షించి తనస్నేహితుడు రా లేదని దేవీమందిరములోనికి బోయి చూడ చెలికాడు మరణించి యుండుట తెలిసికొనెను. మరియు నిట్లు తలపోసెను. దేవి సమక్షమున తానొనర్చిన వాగ్దానమును చెల్లించుటకై నామిత్రుడు తనశిరమును కానుకగా సమర్పించెను. ఇట్టిసత్యవాదియైన మిత్రుడు నెడబాసి బ్రతుకుటకన్న మరణించుటయే మేలని యెంచి వెంటనే స్నానమాడి దేవిముందు నిలిచి తనశిరమును ఖండించుకొని మిత్రుడు ప్రాణములను వదలెను.

వెలుపలనున్న భార్య తనభర్తయు నతనికొఱకేగిన మిత్రుడును చాలకాలమైనను రాకుండుటచే కారణమును తెలిసికొనవలయు నని దేవాలయములోని కేగి యిర్వురును తల తెగి పడియుండుట తెలిసికొని గుభాలున మూర్ఛబోయి కొంతవడికి తెలివి తెచ్చుకొని కటకటా! ఎంత ఘోరము. ఈహత్యల కెవరు కారకులు? ఏకాంతముగ నే నిచ్చోట నుండుటనలన నీహత్యలను జూచిన లోకు లేమని తలంతురు? ఈదుర్మార్గురాలు వ్యభిచారిణి యగుటచే తనకామవాంఛ కాటంక మని యెంచి వెంటనున్న మగనిని, వానిహితుని చంపినదని తలంచెదరు. ఈయపకీర్తి నెట్లు భరింతును. మరియును విధవనై జీవించుటకన్న మరణమే మేలని తలంచి యట పడియున్న ఖడ్గమును దీసికొని తన కంఠమును ఖండించుకొ

నబోవుచుండ నామె సాహసమునకు మెచ్చి దుర్గాదేవి యదృశ్యరూప మున నిట్లనియె. కుమారీ! నీపతిభక్తికిని, సాహసమునకును మెచ్చితిని. వరంబును వేడుమన తల్లీ! వీ రిర్వురిని బ్రతికింపుమని యడుగ నాదేవి యిట్లనియె. నీ వాశిరములను రెండింటిని కళేబరముల కంటింపు మని చెప్పెను. ఆమె యామాటను విని సంతోషముతో నొడలు తెలియక తొందరలో పతిశిరము మిత్రునికళేబరమునకును, మిత్రునిశిరము పతికళే బరమునకు నంటించెను. దుర్గాదేవి వా రిర్వురిపై యమృతవర్షమును గురిపింప వా రిర్వురు సజీవులై లేచి నిలువబడిరి. విక్రమార్కమహా రాజా! వా రిర్వురిలో నామెభర్త యెవరో తెల్పుమన విక్రము డిట్లనియె. నదులలో గంగానదియు, పర్వతములలో మేరుపర్వతమును, వృక్ష ములలో కల్పవృక్షమును, అవయవములలో శిరస్సు ప్రధానములు, శ్రేష్ఠము లని శాస్త్రములు చెల్పుచున్నవి గాన పతిశిర మేకళేబరము నకు నుండెనో యతడే యామె భర్త యని నిర్ణయింప భేతాళు డెగిరి తరుశాఖను వేలాడుచుండెను.

ఏడవకథ.

భేతాళుడు మరల నిట్లు చెప్ప నారంభించెను. చంపాపురమనుపు రముకలదు. చంపకేశ్వరు డనురా జానగరమును బాలించుచుండెను. అత నికి సులోచన యనుభార్యయు- త్రిభువనసుందరి యనుపేరుగల కుమా ర్తెయు గలరు. త్రిభువనసుందరి యదార్థమునకు సార్థకనామము గలది. చంద్రబింబమును బోలిన ముఖము- తామరరేకులను బోలిన నేత్రములు- ధనస్సు ననుకరించు కనుబొమలు- దానిమ్మగింజల బోలిన పలువరుస- సింహమధ్యమును బోలిన నడుము- త్రాచును బోలిన జడ- పూర్ణిమనా టిచంద్రికవలె స్వచ్ఛమై, మనోహరమైయున్న నామెయవ్వనమున కెంత యు వన్నె దెచ్చుచుండెను. మరియు నాసుందరాంగియొక్క చక్కద

నము దేశము లన్నియు వ్యాపించుటచే పెక్కు-మంది రాజు లామంద యూనను భార్యగా బడయ దలంచి తమరూపపటములను చంపకేశ్వరుని కడ కంపిరి. అత డారూపపటములను తనకుమా ర్తెకు జూపి నీ కనుకూ లుడగు వరు డెవరో తెల్పు మన నాత్రిభువనసుందరి చిత్తరువుల నన్నిం టిని పరిశీలించి చూచి తండ్రితో నిట్లనియె. జనకా! నాకు వీరిలో నొక్క-రును సచ్చలేదు. కారణ మేమనగా! వీ రందరికి నొకటియున్న నింకొకటి లేదు. రూపమున్న గుణమునున్న. గుణమున్న నిద్యశూన్యము. విద్య యున్న పరాక్రమము - ఉత్సాహోచితపౌరుషములు లేవు. కావున నాకు రూప-బల - సుగుణ - విద్యా- జ్ఞాన సంపదలు గల భర్తయే కావలయు నని చెప్పెను. చంపకేశ్వరు డావిధముగ నలుదిక్కు-లకు జాటబంపెను. కొంతకాలమునకు నల్వురు రాజకుమారులు చంపకేశ్వరునికడ కరుదెంచిరి. రాజు వారిని గూర్చుండబెట్టి రాజపుత్రులారా! మీ కున్నయర్హ తలను తెలియజేయు డని వచింప వారిలో నొక డిట్లనియె. రాజేంద్రా! మీరు కోరిన వన్నియు నాయందు గలవు. మరియు నితరులకడ లేని మరియొకవి శేషము కలదు. నే నొకవస్త్రమును నేసి యైదురత్నముల కమ్మెదను. వానిలో నొకటి బ్రాహ్మణున కిచ్చెదను. రెండవదానిని దేవున కిచ్చెద ను. మూడవదానిని నేను గ్రహించి నాల్గువదానిని నాభార్య కిచ్చి అయి దవ దానితో కుటుంబమును పోషించెదను.

రెండవవా డిట్లనియె. నేను జలస్థలములయం దుండుపక్షిభాషల సన్నింటి నెఱుంగుదును. నాతో పోట్లాడగల బలశాలి లేడు. నారూప మును మీరు చూచుచున్నారుగదా యని వచించెను. మూడవవా డిట్ల నియె. నేను సకలశాస్త్రములయందు ప్రావీణ్యము కలవాడను. నాతో వాదించువారు లేరు. సౌందర్యమున నాసంగతిని మీరు చూచుచున్నా రని వచించెను. నాలుగవవాడు రాజేంద్రా! శస్త్రవిద్యలో నాకంటె

ఘను డెవ్వడును లేడు. శబ్దభేదిబాణములను బ్రయోగించుటలో నాకు నేనే సాటి యని చెప్పెను. చంపకేశ్వరు డానల్వురివాక్యములను విని తనకుమారిక నెవ్వరి కిచ్చుటకు దోచక త్రిభువనసుందరికడ కేగి యామె తో రాజపుత్రులవృత్తాంత మంతయును వివరించి పుత్రీ! వీరి నల్వురిలో నీ వెవరిని వరించితివో నా కెఱిగింపు మన నామె కొంతకాల మాలో చించి యేమియును దోచక సిగ్గుతో తలను వంచుకొనెను. విక్రమరా జేంద్రా! కథ యంతయును వింటివిగదా! ఆత్రిభువనసుందరి యీనల్వు రిలో నెవరిని వరింప దగియున్నదో వచింపు మన విక్రమార్కు డిట్లనియె. బట్టలను నేసెదనని చెప్పిన రాకొమరుడు శూద్రతుల్యుడు. పట్టి భాషల నెరింగినవాడు వైశ్యతుల్యుడు. శాస్త్రవాదన చేయగలవాడు బ్రాహ్మణతుల్యుడు. ఇక ధనుర్విద్యలయందు నిపుణతగల యీనాలుగవ రాజపుత్రుడే త్రిభువనసుందరికి భర్త కా దగినవా డని చెప్పగా భేతా ళు డెగిరి మరల చెట్టుకొమ్మను బ్రవేలాడుచుండెను.

ఎనిమిదవకథ.

విక్రముడు పట్టి తెచ్చుచుండ భేతాళు డిట్లు చెప్ప నారంభించెను. మిథిలావతి యనునగరమున గుణాధిపు డనురాజు రాజ్యము జేయుచుం డెను. ధర్మప్రభువని ప్రఖ్యాతి బడసెను. ఇట్లుండ నొకనాడు దూరదేశ వాసియగు చిరదేవు డనుపేరుగల రాజపుత్రుడు గుణాధిపుని కొలువ నా నగరమునకు వచ్చి ప్రతిదినము రాజసభకు బోవుచుండెను. కాని ప్రభు దర్శనముగాని, ప్రభువుతో మాట్లాడుటగాని లభింపలేదు. చిరదేవుడు తాను వెంట దెచ్చుకొనిన ద్రవ్య మైపోయినను కష్టమున జీవించుచు ప్రతిదినము రాజసభకు బోయి వచ్చుచుండెను.

ఒకనాడు రాజు పరివారసహితముగ వేటాడుట కై యరణ్యమున కేగెను. చిరదేవుడుగూడ గుఱ్ఱము నెక్కి రాజు ననుసరించి పోవుచుండెను.

అరణ్యములో కొంతకాలము వేటాడినపిదప దైవయోగమున గుణాధిపుడు తనపరిజనమునకు దూరుడై అరణ్యమున చాలదూరము పోయెను. పరివారముకూడ రాజును గనుగొనలేక నాతనికొఱకై వన మంతయు వెదకుచుండిరి. చిరదేవు డొక్కడు రాజును వెన్నంటి పోవుచుండెను. పోవపోవ రాజున కలసట వచ్చెను. తనపరివారము కానరా లేదని చింత పడుచుండ చిరదేవుడు సమీపించి మహారాజా! నే నొక్కడనే మీవెంట నుంటిని. మీపరివార మంతయు వెనుక జిక్కియున్నది. అని చెప్పగా గుణాధిపుడు వానిం జూచి నీ వెవ్వరవు? ఇట్లు చిక్కి బలహీనునివలె నుంటివి. కారణ మేమి? న న్నెందులకు వెంటాడుచుంటివి? అని యడుగ నత డిట్లనియె. రాజేంద్రా! నాది చాలదూరదేశము. కులమునకు రాజ పుత్రుడను. పేరు చిరదేవుడు. నేటికి సుమారు సంవత్సరముక్రింద తమ కొలువు జేయ వచ్చితిని. ప్రతిదినము సభకు వచ్చుచుంటినిగాని నాదుర దృష్టవశమున నేలినవారియనుగ్రహమునకు పాత్రుడను గాకపోయితిని. తమదృక్పథమున బడ్డనైతిని. వెంట కొనివచ్చిన ధన మైపోయినది. క్షత్రి యుడ నగుట నితరులను యాచింపజాలను. దుర్భరముగ జీవితమును గడు పుచుంటిని. తమదర్శనముగోరి మీవెంట వచ్చితిని. ఇదియే నాచరిత్రము అని పలుకగా చిరదేవుని జూచి రాజు నా కాకలి యగుచున్నది. మార్గ మే మనగా? చిరదేవుడు మృగమాంసమును దెచ్చి అడవిపుల్లల నేరి ప్రోగుచేసి చెకుముకిరాతితో కొట్టి నిప్పు జేసెను. ఆయగ్నిహోత్రమున నామాంసమును పక్వ మొనర్చి రాజుముం దుంచెను. గుణాధిపు డా మాంసమును భక్షించి యాకలి దీర్చుకొని నగరము జేరు టెట్లాయని తల పోయుచుండ చిరదేవుడు మార్గదర్శకుడై రాజును రాజధానికి జేర్చెను. ఆదినమున చిరదేవునివలన తాను పొందిన యుపకారమునకు సంతసించిన వాడై గుణాధిపు డతనికి విశేషధనమును బహుమతి నొసంగి తన కొల్వు లో నుద్యోగ మిచ్చి గౌరవించెను.

ఒకనాడు రాజు చిరదేవుని యొకకార్యమున్నై సముద్రతీరమునకు బంపెను. చిరదేవుడు తురంగారూఢుడై పోయి సముద్రతీరము జేరి రాజకార్యము నెఱవేర్చి వచ్చుచు నటనున్న శివాలయమును జూచి లోని కేగి పరమేశ్వరుని పూజించి తిరిగి వచ్చుచుండ సతనికంటి కొకదివ్య సుందరి కన్పడెను. చిరదేవు డామెం జూచి మోహించి రెప్ప వాల్పక జూచుచుండెను. ఆసుందరి యతనిని సమీపించి నీ విచ్చటి కేల వచ్చితివి? నన్ను నిదానించి చూచుటకు గారణమేమి? అని యడుగ నత డోసుందరీ! నే నొక రాజకార్యమున్నై యిటకు వచ్చితిని. నీ సౌందర్యమును గాంచి ముగ్ధుడ నైతిని. నీయాశ్లేషసుఖమును వాంఛించి చూచుచుంటి నని చెప్పెను. చిరదేవునివాక్యమును విని యాలేమ చిరునవ్వు నవ్వుచు నోవీరాగ్రణీ! ముందు నీ వాకొలనులో స్నానము జేసి రమ్ము. తదనంతరము నీయభీష్టము నెరవేరునని చెప్పెను. చిరదేవు డామాటలను సమ్మి గుఱుమునుండి దిగి యాకొలనులో మునిగి లేచి యొడ్డును జేరునప్పటి కతడు మిథిలావతిలో నుండెను. చిరదేవు డాశ్చర్యమగ్నుడై యాసుందరి తన్ను మోసగించెనని తెలిసికొని రాజును సమీపించి జరిగిన వృత్తాంత మంతయు వచించి యిట్లనియె. మహారాజా! యాసుందరి నావంటిమంద భాగ్యునకు దగదు. దేవరవా రామెను జేపట్ట నగును. అని చెప్ప గుణాధిపుడు విస్మయపడి యావింత యేమో చూతము రమ్ము అని చిరదేవుని వెంట నిడుకొని సముద్రతీరమున కేగి యాశివాలయము జేరి విశ్రమించి యుండ మామూలువేళ కాసుందరి శివాలయమును జేరనచ్చి యట నున్న గుణాధిపునిం జూచి యతనిని మోహించి యోరచూపుల జూచుచు నిలువబడెను. రాజామెను జూచి సుందరీ! ఏల యట్లు నిలువబడితివి? అని యడుగ నామె రాజేంద్రా! నీరూపమును జూచి నిన్ను వలచితిని. నీయాజ్ఞకు విధేయురాలనై యుందును. వచింపు మన నత డోకాంతా! నిన్ను నాయాంతరంగిక సచివుడైన చిరదేవు వలచియున్నాడు. కాన నీవు

నాకు తగవు. ఇతడు క్షత్రియుడు, శూరుడు, యథార్థవాది, సద్గుణవంతుడు కావున నీ వాతని బరిణయ మాడు మని చెప్పి యామె నంగీకరింపజేసి వా రిర్వుర కాశివాలయములోనే పాణిగ్రహణము జేసెను. విక్రమార్క-మహారాజా! వింటివిగదా! చిరదేవగుణాధిపులలో నెవరు త్యాగశీలులు? అని యడుగగా విక్రమార్కు డిట్లనియె. చిరదేవుడే త్యాగశీలుడు. కారణ మేమనగా తనసేవకుడు వలచిన కన్యను తా నపేక్షింపక నతనికే పరిణయము గావించి పరోపకార మొనర్చుట క్షత్రియుడగు ప్రభువునకు విధాయక ధర్మము. అందులో గొప్పగ జెప్పుకొనవలసిన విషయ మేమియును లేదు. చిరదేవుడు తానువలచిన కన్య తన కలభ్య యని తెలిసికొని తనకు లేకున్నను తన ప్రభువున కామె సమకూర్పదలం చినాడు. ఇది సరోత్కృష్టమైన త్యాగము. కావున చిరదేవుడే త్యాగశీలుడు. అని చెప్పగా విని భేతాళుడు మరల నెగిరి పృష్ఠాగ్రమున వ్రేలాడుచుండెను.

రెండవకథ.

భేతాళు డిట్లనిచెప్ప నారంభించెను. రాజా వినుము. మదనపుర మనునగరమును వీరవిక్రము డనురాజు పాలించుచుండెను. ఆపట్టణము లో హిరణ్యగుప్తు డనువర్తకుడు గలడు. అతనికి మదనసేన యనుకూ తె కలదు. అసుందరాంగి యొకనాడు తనస్నేహితురాండ్రతో గలసి యుద్యానవనమున విహరించుచుండెను. ఇంతలో నాతోటలోనికి ధనికు డైన ధర్మదత్తుడను వైశ్యునికుమారుడు సోమదత్తుడు నవయవ్వనుడు షికారుగ వచ్చెను. మదనసేన కొంతకాలము విహరించి యింటికి బోవు చు నటనున్న సోమదత్తుని జూచెను. అతడును మదనసేనం జూచెను. ఇర్వురి వీక్షణములు లగ్నము లయ్యెను. పరస్పరవీక్షణములవలన వారి ర్వురును మోహాక్రాంతులైరి. సోమదత్తుడు నిలువజాలక మదనసేనను

సవిూపించి యోకాంతామణీ! నిన్ను జూచినదిమొదలు మదనుడు పుష్ప బాణములచే వేధించుచున్నాడు. నామోహాగ్నిని నీవు చల్లార్పవేని నా ప్రాణములు నిలువవు. అని పలుకగా మదనసేన యిట్లనియె. సుందరుడా! నీ వట్లనవలదు. నాహృదయమునకు జాలపరితాపముకల్గును. నేనును నీసౌందర్యమును గాంచి నిలుపజాలని తమిచేత వేగుచుంటిని. కాని ప్రస్తుతము నేను నీకోర్కె దీర్పజాలను. కారణ మే మనగా నా కైదుదినములలో వివాహము జేయుదురు. పెండ్లియైన తదుపరి నాయత్తమామలు నన్ను గొంపోయెదరు. నేను నాభర్తతోగలసికొనుటకై పోవుటకు ముందే నీవాంఛను దీర్చి నాపతిని జేరుదును. ఇది నిశ్చయ మని చెప్పి తనతోర్మివను బోయెను.

అయిదవనాడు మదనసేనవివాహము జరిగెను. వివాహము పూర్తియైన తదుపరి అత్తమామలు మదనసేనను తమయింటికి గొనిపోయిరి. కొన్నిదినములు జరిగినతరువాత మంచిదినము చూచి మదనసేనకు పునస్సంధానమును జరిపిరి. రాత్రి స్నేహితురాండ్రందరును గలసి దంపతుల నేకము జేసి గదితలుపులు వేసి వెడలిపోయిరి. అందరును నిద్రించిన తదుపరి భర్త నవోఢయైన మదనసేనను చేయిపట్టి లాగి పాన్పుపై గూర్చుండబెట్టుకొని కౌగిలించుకొనబోవ మదనసేన తప్పించుకొని భర్తతో మున్ను తాను సోమదత్తున కిచ్చిన వాగ్దానము నెఱవేంగించి యాడిన మాటలు తప్పిన దోషము కావున సోమదత్తునికడకు బోయి వచ్చుటకనుమతి నొసంగవలయు నని యడిగెను. భర్త యామెం గాంచి నీవు నీవాగ్దానమునకు భంగ మొనర్చుకొనవలదు. తప్పక పోయి రమ్ము. అని యనుమతి నొసంగి యామెను బంపెను. మదనసేన సర్వాభరణములను ధరించి ప్రియుని జేరబోవుచుండెను. త్రోవలో నొకచోరుడు మదనసేనను జూచి నీ వెవ్వతెవు? ఇంతరాత్రివేళ నగలను ధరించి యెచ్చు

టికి బోవుచుంటివి? నిలువుము. నీయాభరణముల నన్నింటి నిటబెట్టి యావలి కేగు మన నామదనసేన ఓయీ! నాకు సాయము మదను డున్నాడు. అని పల్కి తన చరిత్ర యంతయు నెఱిఁగించి యోచోరా గ్రేసరా! నే నిప్పుడు పతియాజ్ఞను బొంది నాప్రియుని సంతృప్తి జేయ బోవుచుంటిని. నాశృంగారమును భంగము జేయకుము. నేను తిరిగి వచ్చునపుడు నీ కేనగ లన్నియు నిచ్చెద నని వాగ్దానము చేయుచుంటిని. నన్ను విడువుము. అని పలుక నాచోరుడు సమ్మతించి వదలెను. మదన సేన సోమదత్తునియింటి కేగి నిద్రలోనున్న యాతని మేల్కొల్పి ప్రియుడా! లెమ్ము. అని పల్కెను. సోమదత్తుడు మేల్కొని కన్నులు నలుపు కొనుచు కట్టెదుట నిలిచిన యాసుందరిం జూచి నీవు దేవకన్యకవా? నాగ కన్యకవా! యక్షకన్యకవా! ఎవ్వతెవు? అని యడుగ నామె నే నెవ్వ తెను కాను. హిరణ్యగుప్తునికుమార్తెను. నాపేరు మదనసేన. నాడు వన ములో నీకు నేను వాగ్దాన మొసంగితిని. వివాహితుడై న భర్తతో కలి యకముందు నీకోర్కె దీర్తునని పల్కితిని. మాటప్రకార మరుగుదెంచి తిని. నీవాంఛితము నెఱవేర్చుకొనుము. అని పలుక నతడు తెల్లబోయి యోసుందరీ! నీవు పతియాజ్ఞను బొందితివా యన నామె తలయూచి నాభర్త యంగీకరించియే నీకడ కంపెనని బల్క సోమదత్తుడు హృదయ మున నిట్లు తలపోసెను. ఆహా! స్త్రీలెంతకైన తగుదురు. వారుచేయజాలని కార్యములు లేవు. ప్రపంచకమున వస్త్రములు లేని నగలు. నేయిలేని భోజనము - స్వరహీనమైన సంగీతము - అనుకూలుడైన పతిలేని కావు రము - దుర్భరము. మాసినబట్టలు తేజస్సును హరించును. దురన్నము బలమును హరించును. దుష్టభార్య పతిప్రాణముల దీయును. కుపుత్రుడు కులనాపకు డగును. అట్లనే పరస్త్రీసాంగత్యము ఇహపరముల రెండింటిని జెరచును. స్త్రీలు మనమున నున్నవిషయమును వచింపరు. వచించినట్లు క్రియలో గన్పింపరు. భగవంతు డీస్త్రీలను విచిత్రముగ సృష్టించినాడు.

వీరిమాయలకు లోబడరాదు. అని తలంచి మదనసేనం జూచి కాంతామణీ! నీవు పరస్త్రీ వగుటచే నిన్ను స్పృశింపరాదు. పొమ్మని పల్కి యామెను పంపివేసెను. మదనసేన బయలుదేరి వచ్చుచు దనకొఱకై నిరీక్షించి యున్న చోరుని సమీపించి జరిగినవృత్తాంతము నెఱింగించి నగలు తీసి కొనుమని పల్కెను. ఆచోరుడామె సత్యమునకు మెచ్చి తల్లీ! నీకు నమస్కారము. నీవంటి మహాసాధ్వీమణుల కపకారము చేయుజాలనని పల్కి యామెతో నింటివరకు వచ్చి వెడలిపోయెను. మదనసేన పతిం జేరి జరిగిన వృత్తాంత మంతయు దెలిపెను. ఆతడును రహస్యముగ వెంటనంటి జరిగిన వృత్తాంతమును చూచి యుండుటచే యట్టి సత్యసిష్ఠగలభార్యను కొగ లించుకొని యాదరించెను. రాజా! వింటివా? ఈమువ్వురిలో నెవ్వ రధికు లో చెప్పుమన విక్రమార్కుడు చోరుడే యధికుడు. ఏమనగా భార్య యొక్క సత్యమును రక్షించుట భర్తకు ధర్మము. పరస్త్రీని వర్జించుట సోమదత్తునకు ధర్మము. కాని చౌర్యమే వృత్తిగా బెట్టుకొనిన యాదొంగ చేతి కందిన బంగారమును వదలుటయే గొప్ప యని వచింప భేతాళుడు తటాలున నెగిరి వృక్షశాఖను వ్రేలాడుచుండెను.

పదవకథ.

విక్రమార్కుడు తిరిగి భేతాళుని కొనివచ్చుచుండ భేతాళు డిట్లు చెప్ప నారంభించెను. వర్ధమాన మనునగరమును గుణశేఖరు డనురాజు పాలించుచుండెను. ఆతనికి అభయచందుడ్ని డనుమంత్రి గలడు. ఆమంత్రి నాస్తికమతాభిమాని యగుటచే రాజునకు సమయము దొరకినపు డెల్ల తనయభిప్రాయములను బోధించుచు క్రమక్రమముగ దైవగురుభక్తిశూ న్యుని గావించుచు సప్తవ్యసనములకు బాల్పడ జేయుచుండెను. ఒక నాడు రాజు విశ్రాంతిగా నున్నతరి మంత్రి ప్రక్కను జేరి రాజేంద్రా! పరిపంచకమున పుట్టుట సుఖానుభవముకొఱకే. పూజ లనియు- నోము

లనియు- ధర్మము లనియు- దేవు డనియు- లేనిపోని శంకలను- తలంపు లను బెట్టుకొని నిష్కారణముగ జీవితమును వ్యర్థము జేయుచుంటిమి. మన మనుభవించుచున్న సౌఖ్యములే మనకు స్వర్గసంపదలు. మరణించుట యే జీవన్ముక్తి. భగవంతు డిందియాత్మకమైన శరీరమును మన కొసం గినందుల కార్యాకార్యములను నెఱవేఱ్చుచు నానందింపవలదా? కామ క్రోధాదులు శరీరము నాశ్రయించి యుండునవి. శరీరముతోనే పోవును. వానిని వదల్చుకొనుట మహత్తరము కాదు. కావున దేవరవారు నేటినుం డియు నేను చెప్పినవిషయములను మనమున నిడుకొని యీమతిమాలిన దేవపూజలు మొదలగువానిని మాన్పించి కాంతాకనకములను సమకూ ర్చుకొనుటయం దప్రమత్తులై మెలంగుచు దేవేంద్ర వైభోగము ననుభవిం పవలయును. ఇంతేగాక "రాజానుమతే ధర్మః" అను మీపరిపాలనలోని ప్రజ లందరు నిదేవిధముగ నాచరింపవలయు నని శాసనము గావింపుడు. శాసనము నతిక్రమించిన వారిని శిక్షింతు నని ప్రకటించినయెడల కొలది కాలములోనే మన యీనూతనధర్మము లన్నియు రాజ్య మంతయు వ్యాపించును. ఇదే నాప్రార్థనము అని చెప్పిన మంత్రిమాటలను విని రాజు సమ్మతించినవాడై రాజ్య మంతయు జూటబంపెను. కుమారుడైన ధర్మశేఖరుడు తండ్రి మార్గము తప్పి సంచరించు చున్నందులకు మన స్సులో కటకటబడుచున్నను చేయునదిలేక యూరకుండెను. కొంతకాల మునకు గుణశేఖరుడు కాలగతిం జెందెను.

కుమారుడైన ధర్మశేఖరుడు సింహాసనాసీను డయ్యెను. పట్టాభి షిక్తుడైన కొలదిదినములకే తండ్రి స్థాపించిన నాస్తికధర్మములను సమూ లముగా బెల్లగించి పూర్వాచారపరిపాలనము ధర్మయుక్తముగ బరిపాల నము గావించుచు రాజ్యము నిట్టిదురవస్థకు గొనివచ్చిన మంత్రిని పద భ్రష్టుని గావించి రాజ్యమునుండి వెడలగొట్టి యాపరదేశమున నొకక్రొ

త్వానిని మంత్రిగా నియమించెను. తదనంతర మాధర్మశేఖరుడు ముగ్గురు రాజపుత్రికలను పరిణయ మాడెను.

ఒకనాడు ధర్మశేఖరుడు మువ్వురుభార్యలతో విహారోద్యానవనమున విహరించుచు నం దున్నయొకసరోవరమున జలక్రీడ లాడి యొడ్డునకు జేరెను. ధర్మశేఖరుడు వచ్చునప్పుడు సరోవరమునందు తామరపూవు నొకదానిని కోసి తనపెద్దభార్యచేతి కిచ్చెను. ఆమె యాపుష్పమును చేతబట్టుకొని వచ్చుచుండ తోవలో నాకమల మామెచేతుల నుండి జారి పాదములపై బడెను. కమలము పడుటవలన నామెపాదముపై పెద్దగాయ మయ్యెను. రాజు వ్రణచికిత్సకుల బిలిపించి చికిత్స జేయించెను. మరునాడు రెండవభార్యతో మిద్దెమీద పండువెన్నెలలో పరుండి నరససల్లాపము లాడుచుండ నావెన్నెల సోకినంతమాత్రమున నతిసుకుమారమైన రెండవభార్యశరీరమునకు జ్వరము వచ్చి చాల బాధపడెను. మూడవనాడు మూడవభార్యయంతఃపురమున కేగి యామెతో కేళీవిలాసమున నుండ నచ్చటికి చాలదూరమం దున్నయొకయింటిలో వడ్లు దంచుచుండుటచే రోకలిచప్పుడు వినవచ్చెను. ఆధ్వని వినబడుటచే మూడవభార్యకు శిరోవేదనము కలిగి వారముదినములు బాధపడెను. రాజా! వింటివిగదా! ఆముగ్గురిలో సధికసుకుమారు లెవరు? నిర్ణయింపు మని విక్రముడు యోజించి మూడవభార్యయే యందరికన్న సుకుమారియని వచింప భేతాళు డెగిరి తరుశాఖ కంటుకొన విక్రము డాతని కట్టి తెచ్చుచుండెను.

పదునొకటవకథ.

భేతాళు డిట్లు చెప్పనారంభించెను. పుణ్యపుర మనుపట్టణమును వల్లభు డనురాజు పాలించుచుండెను. ఆరాజునకు సత్యప్రకాశు డనుమంత్రి సత్తము డుండెను. ఆమంత్రిభార్య పేరు లక్ష్మీదేవి. ఆవల్లభు డొకనాడు

మంత్రిని జూచి అమాత్యా! నాకు కొంతకాలము భోగము లనుభవింప వలయునని వాంఛ కలిగినది. కావున రాజకార్యములను జాగ్రత్తతో జూచుచుండుము. అని చెప్పి యాప్రభువు తన యంతఃపురమున కేగి భార్యతో నిష్టోపభోగముల ననుభవించుచుండెను.

కొంతకాల మిారీతిగ జరిగినపిదప మంత్రికి విసుగుదల జనించుట చే తనయింటి కేగి శయ్యాగృహమున బరుండి యాలోచించుచుండెను. ఇంతలో భార్య వచ్చి భర్తను సమీపించి నాథా! ఏమో యాలోచించు చున్నారు. నేను తెలిసికొనవచ్చునా యన నాత డోయర్ధాంగీ! రాజు రాజకార్యవిముఖుడై యుండుటవలన నాకు చాలకష్టముగా నున్నది.

ప్రభువు లేకుండ నే నొక్కడ నీకార్యము నెంతకాల మని భరింప గలనా యని చింతించుచుంటిని. అన నాలేమ నాథా! మీరు కొంతకాల ము రాజాజ్ఞను పొంది తీర్థయాత్రలకు పోయి రండు. మీ మనస్సునకు విశ్రాంతి గలుగు నని చెప్పగా మంత్రి భార్యచెప్పిన యుపాయము బాగు న్నదని తలంచి వెంటనే రాజసన్నిధి కేగి ప్రభునకు తనకోర్కె నెఱింగింప వల్లభుడు వల్లె యని యంగీకరించెను.

మంత్రి యొక దివ్యముహూర్తమున తీర్థయాత్రకై బయలుదేరి యనేకపుణ్యస్థలముల కేగి దేవతాదర్శనము జేసికొనుచు పుణ్యనదీస్నానం బుల జేయుచు క్రమముగ రామేశ్వరక్షేత్రమున కేగి సేతువులో మునింగి రామలింగేశ్వరున కభిషేకము గావించి వెలుపలకు వచ్చి సముద్రమును జూచుచు గూర్చుండెను. కొలదిగడియల కాసముద్రమునుండి బంగారు చాయగల్గిన వృక్షము పైకి వచ్చెను. ఆవృక్షమునకు పచ్చలతోగూడిన యాకులు, పుష్యరాగములతో గూడిన పుష్పములు, ప్రవాళములతో గూడిన ఫలములు గలిగియుండెను. ఆవృక్షశాఖామధ్యమున నొకదివ్య సుందరి వీణాపాణియై గానము చేయుచుండెను. ఆవృక్షము కొంతసే

పట్లుండి సముద్రములో మునిగిపోయెను. మంత్రి యీవిచిత్రమును గాంచి వెఱగుపడి కొన్ని దినములవరకు తీర్థయాత్రను సాగించి నిజరాజధానియైన పుణ్యనగరమున కేగి ప్రభుదర్శనము జేసికొనెను. రాజు మంత్రిం జూచి తీర్థయాత్రలో నీవు చూచిన విశేషము లేమైన కలవా యని యడుగ మంత్రి తాను రామేశ్వరమున జూచిన బంగారువృక్షముసంగతిని వినరించి యిట్టివిచిత్రమును తా నెన్నడును చూడలే దనియు చెప్పిన నెవ్వరు విశ్వసింపరని చెప్ప రాజాశ్చర్యమగ్నుడై రాజ్యమును మంత్రి కప్పగించి తాను వెంటనే బయలుదేరి రామేశ్వరక్షేత్రమున కేగి స్వామిదర్శనమును జేసి సముద్రతీరమున గూర్చుండెను. నియమితకాలమున కావృక్షము సముద్రము నుండి బయల్వెడలెను. వల్లభుడు తటాలున సముద్రమున నురికి యీదుకొనుచు బోయి యావృక్షము నెక్కి యాసుందరిప్రక్క గూర్చుండెను. రాజచ్చట కూర్చుండినతక్షణమే యావృక్షము మునింగి పాతాళము జేరెను. పాతాళలోకమున కేగినవెంటనే యాసుందరి రాజుం జూచి నీ వెవ్వరవు? ఈవృక్షము నెక్కి యిటకు వచ్చిన కారణమేమి యని యడుగ నత డిట్లనియె. నేను పుణ్యనగరాధీశుడను. నాపేరు వల్లభుడు. నేను నీరూపముం గాంచి మోహపరవశుడనై యిటకు జేరితిని. అని చెప్ప నాకోమలాంగి రాజేంద్రా! నన్ను వివాహము జేసికొనుట కొకనియమము కలదు. ఏమనగా? కృష్ణచతుర్దశినాడు నీవు నన్ను సనిూపింపరాదు. అట్లయిన-చో నంగీకరింతు నన నామెవాక్యమున వల్లభుడంగీకరించి యామెనుపరిణయ మాడెను. కొలదిదినములకే కృష్ణచతుర్దశి వచ్చెను. వల్లభుడు తన వాగ్దానము ననుసరించి నాటిరాత్రి యామెను వదలి దూరమున కేగి మారువేషమున ఖడ్గధారియై గన సమీపమున పొంచియుండి యేమి జరుగునో చూడ నిరీక్షించియుండెను. అర్ధరాత్రివేళ నొకరాక్షసు డాగదిలోని కేగి యాసుందరిని కౌగలించుకొనెను. రాజు తలుపుసందునుండి చూచి క్రోధవరవశుడై వరనుండి ఖడ్గమును

బెరికి తలుపులను ద్రోసికొని యారాక్షసుని పైకి లంఘించి దానవాధమా! నాయెదుట నాభార్యను జెఱబట్టెదవా రమ్ము. నిన్ను హత మార్చెదనని పలుకుచు నారాక్షసునితో ద్వంద్వయుద్ధమొనర్చి వానిని హత మార్చెను. వెంటనే యాసుందరి రాజేంద్రా! నీవంటి వీరశిఖామణిని నే నెచ్చటను జూచి యుండలేదు. పర్వతము లన్నిటిలో రత్నము లుండవు. పట్టణము లన్నింటిలో వీరు లుండరు. ప్రతివనములోను చందనతరువు లుండవు ప్రతి ఏనుగశిరమునను ముత్యము లుండవు. అట్లనే రాజైనంతమాత్రమున వీరు డనరాదు. క్షత్రియులలో వీరుడన నీవే. యని పల్కుచున్న నామెం గాంచి రాజిట్లనియె. ఈరాక్షసు డెవ్వరు? ఎందుకు వచ్చెను? అని యడుగ నామె యిట్లనియె. నేను విద్యాధరుని పుత్రికను. నాపేరు సుం దరి. నాతండ్రి ప్రతిదినము నన్ను తనప్రక్క నుంచుకొని భుజించుచుండు ను. నేను లేనినా డతడు భుజింపడు. ఒకనాడు నాతండ్రి భోజనసమయ మున నే నింటిలో లేకపోవుటచే నాతండ్రి కోపగించి ప్రతికృష్ణచతుర్దశి దినమున నీవు రాక్షసునిచేతికి జిక్కుదువుగాక యని శపించెను. తదనంత రము నే నావృత్తాంతమును విని నాతండ్రిపాదములపై బడి దుఃఖింపగా నతడు జాలిపడి కొన్నిదినములకు వీరు డొకడు వచ్చి రాక్షసుని సంహరించి నీకు శాపవిమోక్షమును గలిగించునని చెప్పెను నేటికి నివలన నాచెఱ యడలిన దని వచించి రాజేంద్రా! నే నింక నాతండ్రికి నమస్కరింప బోయెద నన వల్లభు డోసుందరీ! ఒక్కమారు నారాజ్యమునకు రావలయునని కోరు చున్నా నని పల్క నామె యంగీకరించెను. రాజామెను మెట నిడుకొని తననగరమున కేగెను. ప్రభువు వచ్చుటచే నగరమంతయు నలంకరింపబడెను. జను లందరు మహావైభవముగ పండుగ జేసికొనిరి. వల్లభు డొకశుభ లగ్నమున విద్యాధరకన్యను పాణిగ్రహణము జేసికొనెను. ఒకనా డామె తండ్రికడ కేగెదనని వచింప రాజు చింతాక్రాంతు డయ్యెను. ఆతని వైఖరిని గని సుందరి యిట్లనియె. రాజేంద్రా! నే నప్పుడు నాతండ్రిండకు పోవాల

ను. కారణ మేమనగా నిన్ను పరిణయ మాడుటవలన నాగంధర్వలోక నివాసము పోయినది. నే నిప్పుడు వెళ్ళినను నాతండ్రి రానీయడని చెప్ప వల్లభు డానందభరితు డై యిర్వురు భార్యలతో మహానందమున దుల తూగుచుండెను. ఈగంధర్వకన్యాపరిణయమును విని మంత్రి తటాలున క్రిందబడి ప్రాణముల వదలెను. విక్రమార్క మహారాజా! మంత్రి చని పోవుటకు కారణ మేమన? విక్రము డిట్లనియె. ఇదివర కున్నభార్యాసౌం దర్యమునకు ముగ్ధు డై రాజకార్యములను వదలిన యీరాజు గంధర్వ కన్యాసాంగత్యమున రాష్ట్రమును, ప్రజలను చూడడు. అందువలన తన కపకీర్తి, రాజ్యమున కరాజకత్వము, ప్రజలకు కష్టములు కలుగును గదా యనుచింతతో ప్రాణములను వదలె నని చెప్పగా భేతాళు డెగిరి చెట్టు కొమ్మను వ్రేలాడుచుండెను.

పదునెండవకథ.

విక్రమార్కుడు తిరిగి భేతాళుని పట్టి తెచ్చుచుండ భేతాళు డిట్లు చెప్ప నారంభించెను. చూడామణి యనునగరమున శిరోమణి యను రాజు రాజ్యము చేయుచుండెను. అతనికి దేవస్వామి యనుపేరుగల బ్రా హ్మణుడు గురువై యుండెను. ఆదేవస్వామి హరిస్వామికి యనుకుమా రుడు కలడు. ఆహరిస్వామి చక్కదనమునకు మన్మథుడు. ధనమునకు గుబేరుడు. లావణ్యవతి యనుపేరుగల విప్రకన్యక నాతడు పరిణయమై తనయింటికి గొనివచ్చెను. ఇరువురు పరస్పరప్రేమసాహసబద్ధులై మెలంగు చుండిరి.

వసంతకాలమున నొకరాత్రి హరిస్వామి భార్యతో గలసి మిద్దె పై బరుండెను. చల్లనివెన్నెలలో వా రిర్వురు సరససల్లాపములతో ప్రొద్దు గడపి నిద్రించిరి. గాఢనిద్రలో నుండుతరి లావణ్యవతి ముఖమునగల ము సుగు తొలగిపోయెను. ఒకగంధర్వుడు విమానారూఢుడై యంతరిక్ష

మున బోవుచు క్రిందకు జూచి లావణ్యావతియొక్క ముఖసౌందర్యమునకు మెచ్చుకొని క్రిందకు దిగి నిద్రలో నున్నయామెను తనవిమానముపై నెక్కించుకొని వెడలిపోయెను. తెల్లవారు జామున హరిస్వామి లేచి పక్కను భార్య లేకపోవుటచే క్రిందకు దిగి యిల్లంతయు వెదకెను. కానరాలేదు. ప్రక్కయిండ్లు వీధులు వెదకెను కానరాలేదు. ఊరంతయు గాలించెను. నూతులు, చెరువులు విమర్శించెను. కాని భార్య యెచ్చటను గానరాకపోవుటచే కన్నీరు గార్చుచు నింటికి వచ్చి హా ప్రేయసీ! యనుచు గూలబడెను. దుఃఖాక్రాంతుడై భార్యపై వ్యామోహమున మతి చెడి గృహమును వదలి తీర్థయాత్రల జేయుచు దిరుగుచుండెను. ఒకనా డొకయూరి కేగి భిక్షాటనము జేయుచు నొకవిప్రగృహమున కేగి భిక్ష నడిగెను. ఆగృహయజమానురా లొకగిన్నెలో క్షీరాన్నమును బోసి యిచ్చెను. హరిస్వామి యాక్షీరాన్నపుగిన్నెను గొని పక్కనున్న చెరువుగట్టున కేగి యట నున్నమఱిచెట్టుమొదట నాగిన్నె నుంచి స్నానమాడి దానిని దాగవలయునని తలంచి చెరువులో స్నానము జేయుచుండెను. ఇంతలో నొకసర్పము చెట్టుపైనుండి వచ్చి యాపాయసపుగిన్నెను సమీపించి యందు విషమును కక్కి పోయెను. హరిస్వామి స్నానము జేసి వచ్చి యందు సర్పవిష మున్నదనువిషయము నెఱుంగక పాటాటున గోరలెను. వెంటనే యాపాయసము గర్భము జేరుటయే తడవుగా నాలుక వెనుకకు లాగుచుండెను. ఆతనికి దాహము మిక్కుటమయ్యెను. హరిస్వామి వెనుక కేగి యాపాయసము నిచ్చిన గృహయజమానురాలిని జూచి నీవు విష మిచ్చినసంగతి నెరుంగక పాయస మనుకొని తాగితిని. నేను చనిపోవుచుంటి నని చెప్పి పడిపోయి మరణించెను. గృహమేధి భార్యం జూచి ఓసీ! పాపాత్మురాలా! నివలన నాకు బ్రహ్మహత్య లభించినది ఛీ! నీముఖము చూడరాదు. పొమ్మని యింటినుండి వెడలగొట్టెను. రాజా! వింటివా! ఆపాప మీమానల్వురిలో నెవరికి జెందును. అని

యడుగ విక్రమార్కుడు బ్రాహ్మణుడు బిచ్చము నడుగుటయు. గృహిణి యగుస్త్రీ యతిథులకు భిక్షము నిడుటయు ధర్మమే. బ్రాహ్మణ విషమును ప్రక్కుటయును ధర్మమే. కాని యదార్థమును దెలిసికొనకుండ భార్యను వెళ్లగొట్టిన పాపికి పాపము కలదు. అని చెప్ప భేతాళుడెప్పటియట్లు చెట్టుకొమ్మను వ్రేలాడుచుండ విక్రముడు పట్టి తెచ్చెను.

పదమూడవకథ.

భేతాళుడిట్లని చెప్ప దొడంగెను. చంద్రకాంత మనుపట్టణము కలదు. రణధీరుడనురాజందు పాలించుచుండెను. ఆనగరములో ధర్మధ్వజుడనుగొప్పవర్తకుడు గలడు. అతనికి శోభనాంగి యను చక్కని కుమార్తె కలదు. ఆకన్యకకు సంవత్సరములు వచ్చుచున్నకొలది వయస్సు తోగూడ యావనశోభ యంతయు ప్రత్యవయవము నాశ్రయించి సాక్షాత్ మన్మథ యనుప్రఖ్యాతి నొందుచుండెను.

ఇట్లుండ నాయూరిలో కొందరు దొంగ లా వ్రాతులయందు గన్నములను వెచి ధనమును దొంగిలించుకొని పోవుచుండిరి. ధనికులైన వర్తకులందరు నాదొంగలబాధ దాళలేక ప్రభువువద్దకేగి తమకు సంభవించుచున్న కష్టములనుగూర్చి మొఱపెట్టుకొనిరి. రాజు వారిం జూచి మీ రేమియు జింతింపకుడు నేనంమలకు దగిన కట్టుదిట్టము చేయుచున్నాను. అని చెప్పి కొత్వాలును బిలిపించి రాత్రులయందు ప్రతి వీధికిని రక్షకభటులను గస్తీ తిరుగున ట్లేర్పాటు చేసి దొంగయని తోచిన వానిని సంహరింపు మని యాజ్ఞ నొసగి పంపి వైచెను. ఇట కట్టుదిట్టము జేసినను దొంగతనములు జరుగుమనే యుండెను. దొంగలలో నొక్కడైన ను చిక్కలేదు. మఱల పౌరులందరు రాజుతో మొఱబెట్టుకొనిరి. రాజు వారి నూరడించి యర్ధరాత్రి తాను స్వయముగ మారువేషమును ధరించి నడుమున డాలు, కరవాలమును భద్రము జేసి పురములోనికి బయలు

దేరెను. కొంతదూరము నడువగ నొకదొంగ రాజున కెదురు వచ్చుచుం డెను. రాజు వానిని సమీపించి నీ వెవరవు? అని యడుగ నేను దొంగను. నీ పే వర మని యడుగ రాజు నేనును దొంగనే యని ప్రత్యుత్తర మిచ్చె ను. చోరుడు ప్రసన్నుడై అట్లయిన నిర్భయము కలసి దొంగతనము చేయుదము రమ్ము అని యాహ్వానించెను.

వా రిర్వురును కలసి యానగరములో కొన్నిధనికులగృహములను దోచుకొని యాధనమును తీసికొని యూరిబయటకు పోయిరి. రాజును వానిని వెన్నంటి వానిచర్య యంతయు గనిపెట్టుచుండెను. చోరు డాధన ము నొకపెద్దనూతిలో బడ వైచి యం చురికెను. రాజును వానినెంట నానూతులో నురికెను. ఇర్వురు నా నూతిలోపలిమార్గమున పాతాళ పురమును జేరిరి. చోరుడు రాజు నొకమందిరద్వారమున నిలుపబెట్టి తాను లోపలి కేగెను. ఇంతలో లోపలినుండి యొకదాసి వచ్చి రాజుం గాంచి మహారాజా! ఈదుర్మార్గుని నమ్మి మీ రొంటిగ నేలవచ్చితిరి? ఈదుష్టుడు మిమ్ము గుర్తించినాడను. మీ రిప్పుడు పాతిపోకున్న మీప్రాణములు నిలు వవు. అని చెప్ప రా జాదాసిం గాంచి నేను నాయూరికి బోవుమార్గమును జూపుమని యడుగ నాదాసి ప్రభువును సమీపమార్గమున చంద్రకాంత పురమును జేర్చెను. రణధీరుం డాదాసిని తనదగ్గర నుంచుకొని మరునాడు సైన్యసమేతుడై దాసిసహాయమున పాతాళపురి జేరి యాచోరునిగృహ మును ముట్టడించెను. ఆచోరుడు పరువెత్తి తన ప్రభువైన యొకరాక్ష సునితో నీవృత్తాంతమును వచించి తనకు తోడ్పడుమని యడిగెను. ఆరా క్షసుడు ప్రతిదినము చోరుపివలన సాయమును పొందుచున్నవా డగుటచే వెంటనే పరివారసహితుడై వచ్చి రాజు నెదుర్కొనెను. రాజు వారితో ఘోరయుద్ధము జేసి యారాక్షసుని సంహరించి యాచోరుని పట్టి బంధిం చి వాడు కొల్లగొని దాచిన ధనరాసులను కనుగొని వానిని పట్టించుకొని

తనరాజ్యమును జేరెను. మరునా డాచోరుని స్నానము జేయించి మంచి బట్టలను గట్టించి సేనాపతిని బిలిపించి యిట్లనియె. వీని నూరంతయు ద్రిప్పి శూలముపై నెక్కించుమని చెప్పి పంపెను. సేనాపతి రాజాజ్ఞచొప్పున నాచోరుని యేనుగపై నెక్కించి చంద్రకాంతనగరమును కొల్లబెట్టిన చోరుడు వీడే. రాజుగారు వీనికి శూలారోపణశిక్ష విధించిరి. అని చాటుచు నగర మంతయు ద్రిప్పుచుండెను. ధర్మధ్వజుని కుమార్తెయైన శోభనాంగి మేడపైనుండి నవయవ్వనములో నున్న యాచోరుని జూచి మోహించి తండ్రిని జూచి తండ్రీ! నే నాచోరుని వరించితిని. అతడే నాభర్త. నీవు రాజుగారిని జూచి యతనికి శూలారోపణశిక్షను తీసివేయింపుమన నతడు కుమారీ! నీ వెంత వెఱ్ఱిదానవు? నగరమును కొల్లబెట్టిన యాచోరుని రాజు విడచునా యన నామె జనకా! అట్లయిన నాప్రాణము నాతని తోడిదేయని పలుక విధిలేక ధర్మధ్వజుడు రాజుసమీపమున కేగి నమస్కరించి మహారాజా! తమకు లక్షలకొలది ద్రవ్యము కావలయునన్న నొసంగెదను. ఆచోరునకు ప్రాణదాన మొసంగి విడువవలయును. అని ప్రార్థించెనుగాని రా జెంతమాత్రమును చెవిని బెట్టక నానగరము నంతయు కొల్లబెట్టిన యాదుష్టు నెంతమాత్రము మన్నింప నని ఖండించి చెప్పెను. ధర్మధ్వజు డావృత్తాంతమును తనకుమార్తె కెఱిగించెను. సేనాపతి రాజాజ్ఞచొప్పున చోరుని నగర మంతయు ద్రిప్పి శూలముకడకుం గొంపోయి నిలువబెట్టెను. శోభనాంగి తండ్రితో నాప్రదేశమున కరుగుదెంచి శూలముపై నెక్కించిన చోరుని గాంచి మొదట పక్కున నవ్వెను. తదుపరి వెక్కివెక్కి యేడ్చెను. చోరుడు శూలమునెక్కి చిన కొంతకాలమునకు అనగా కొలదిఘడియలకు మరణించెను. మరణించిన వెంటనే శోభనాంగి యాశవమును గొనిపోయి ప్రాంతమం దున్న దేవీమందిరము నెదుట చితి బేర్పించి యం దాశవము నుంచి దేవిని ప్రార్థించి తానుగూడ నం దెక్కి యగ్ని నంటించుమని చెప్పి సహగమనమునకు సిద్ధపడెను.

ఈమె మనోనిశ్చలమునకు మెచ్చి దేవి కుమారీ! నీపట్టుదలకు సంతసించితిని. వరము నడుగు మన నామె తల్లీ! నామనోవల్లభుని బ్రతికింపు మన నాదేవి చోరునికళేబరముపై యమృతవర్షమును గురిపించి వానిని బ్రతికించెను. శోభనాంగి సంతోషముతో భర్తను వెంటగొని యింటి కేగెను. రాజా వింటివిగదా శోభనాంగి మొదట నవ్వుటకును, తదుపరి యేడ్చుటకును కారణ మేమని యడుగ రా జిట్లనియె. ఆమె నవ్వుటకు కారణ మేమనగా ప్రేమయొక్క పరిణామస్థితి బహువిచిత్రమైనది. తా నొక ధనాఢ్యుడైన వర్తకుని కుమారికయై యుండియు నొకచోరునిపై ప్రేమ నిల్పవలసి వచ్చినది. మోహా మెంత గ్రుడ్డిదని నవ్వినది. తదుపరి తాను వరించిన భర్త జీవించకపోయెను. జీవితములో భర్తృసుఖమునకు నోచుకొన నైతినని దుఃఖించెను. ఇదియే కారణ మని చెప్ప భేతాళుడు మరల చెట్టుపై కెగిరెను. విక్రముడు మరల నతని బట్టి తెచ్చుచుండెను.

పదునాలుగవకథ.

భేతాళు డిట్లని చెప్ప దొడంగెను. కుసుమావతి యనుపట్టణము గలదు. సువిచారుడను రాజు ధర్మయుక్తముగా నాపురమును బాలించుచుండెను. ఆరాజునకు చంద్రప్రభ యనుపేరుగల కుమార్తె కలదు. ఆమెకు పదునారువత్సరములప్రాయము వచ్చునప్పటికి జగన్మోహినియై నవయవ్వనపారిమర్ద్యావము గలిగి వివాహయుక్తయై యొప్పుచుండెను. ఒకనా డాచంద్రప్రభ చెలికత్తెలతో వనవిహారమున కేగెను. అంతకు ముందే యీవనమునకు హరిశర్మ యనువిప్రుడు నవయవ్వనుడు ఇరువది వత్సరములు వయస్సుగల సుందరాకారు డొకడు వచ్చి యొక చెట్టుక్రింద విశ్రమించియుండెను. రాజపుత్రిక విహరించుచు ముందునకు వచ్చి యీవిప్రుని జూచెను. హరిశర్మయు చంద్రప్రభను జూచెను.

ఇర్వురి చూపులు లగ్నములైనవి. చంద్రప్రభయొక్క సౌందర్యమును జూచి హరిశర్మ మూర్ఛిల్లెను. రాజకుమారియు మారసమానసుందరుడగుహరిశర్మను జూచి మన్మథబాణములకు గురియై నిట్టూర్పు విడుచుచు విడిచి పోలేక యత్యంతకష్టమున చెలికత్తెలం జేరి తనసౌధమున కేగెను.

ఇంతలో చంద్రస్వామి- మూలస్వామి యనుపేర్లుగల యిర్వురు విప్రులు పాతికసంవత్సరములవయస్సు కలవారు విదేశములలో విద్యాభ్యాసము జేసి యాయూరికి వచ్చుచు నాతోటలోనికి వచ్చి కించిత్కాలము విశ్రమించినపిదప నట మూర్ఛపడియున్న హరిశర్మను జూచి శీతలోపచారముల నేద దీర్చి కూర్చుండబెట్టి నీవృత్తాంత మేమి? నీ విట్లు పడియుండుటకు గారణ మేమి? అని యడిగిరి. హరిశర్మ యావిప్రులం జూచి అయ్యలారా! నాదుఃఖమునుగూర్చి మీ రేల యడిగెదరు? కష్టమును దీర్పగలవారితో జెప్పుకొనిన లాభము కలుగును. లేకున్నవృథా వాగ్వ్యయముకన్న నేమియు ఫలితము లేదు. అని చెప్ప మూలస్వామి యిట్లనియె. నీకష్ట మేమో మా కెఱింగింపుము. చేత నైనంతవరకు దోడ్పడెదము. అనవుడు హరిశర్మ రాజకుమారియొక్క వృత్తాంతము నెఱింగించి యామెయొక్క సందర్శనమే నా కీ దురవస్థను గలిగించినదని నుడివెను. మరియు నామెను సొంపుభాగ్యము గల్గిన జీవించెదను. లేకున్న నాప్రాణములు నిలువవు. అని పలుక మూలస్వామి నీవు మాతోమే ముండుప్రదేశమునకు రమ్ము. అందులకు దగినసదుపాయము నాలోచించెదము. లేకున్న వలయునంతధనము నొసంగెద మన హరిశర్మ యిట్లనియె. ప్రపంచకమున నెంతధన ముున్నను, రత్నము లున్నను, స్త్రీరత్నముతో సాటి గావు. సౌందర్యవతియైన స్త్రీరత్నము లేకున్న ధనముతో నేమిలాభము? ఎంతధన మార్జించినను సారీసుఖమున కేగదా. అందుకే ధర్మముయొక్క ఫలితము ధనము- ధనముపలన ఫలితము సుఖము.

సుఖముయొక్క స్థానము సుందరియైన భార్య. ఆది లేనియెడల సర్వము శూన్యమే. కావున నా కారాజపుత్రికసాంగత్యము కావలయును. అని పలుక మూలస్వామి యిట్లనియె. మావెంట రమ్ము. నీ కందుల కొక యుపాయమును జూపెదను. రమ్మని లేవదీసి యాతని వెంటగొని తమ విడిదికి జేరిరి. మరునాడు మూలస్వామి తనమంత్రబలమువలన రెండుఘు టికలను తయారుచేసి హరిశర్మచేతి కొకఘుటిక నిచ్చి యిట్లనియె. దీనిని నీవు నోట నుంచుకొంటివేని పదునారేండ్లసుందరి వయ్యెదవు. తీసినచో మరల నీయెప్పటిరూపము వచ్చును. అని చెప్పి యాఘుటికను హరిశర్మ నోటిలో నుంచినతోడనే నత డొకషోడశవర్షప్రాయము గలకన్నియగా మారెను. రెండవఘుటికను తననోట పెట్టుకొనినతోడనే మూలస్వామి డబ్బదియేండ్ల ముదుసలిగా మారెను. మూలస్వామి ముదుసలియై యా కృత్రిమకన్యను వెంట నిడుకొని రాజైన సువిచారునికడ కేగెను. సువి చారు డావృద్ధబ్రాహ్మణుని గౌరవించి కూర్చుండబెట్టి నమస్కరించి వచ్చినకార్య మే మని యడిగెను.

ఆవృద్ధబ్రాహ్మణుడును ప్రభువునకు వేదోక్తాశీర్వచన మొనర్చి యిట్లనియె. మహారాజా! నేను గంగాతీరనివాసిని. నాకుమారునికి తగిన కన్యను వెదకి తీసికొనివచ్చుటకై పరదేశముల కేగి వెదకి యీకన్యను కోడలుగా జేసికొనదలంచి గొనివచ్చితిని. ఇంటి కేగి విచారింప నాగ్రా మవాసులకు, నాభార్యాపుత్రులకు దుర్భరమైన కలహము వచ్చుటచే నా భార్యాపుత్రు లాగ్రామము వదలి యెచ్చటికో వెడలిపోయిరని తెలిసి నది. నే నిప్పుడు వారిని వెదకించుకొని రాదలంచితిని. గాని యీసుకు మారి మార్గమధ్యమున కష్టములు పడజాలదు. కావున నేను తిరిగి వచ్చు వరకు యీకన్యకను మీయంతఃపురమున నుంచవలయును. అని చెప్ప రా జిట్లు తలపోసెను. యవ్వనవతియై, సుందరియైన కన్యకను గాపాడుట కడు దుర్లభము. వీలు కా దనినచో నీవృద్ధబ్రాహ్మణుడు కుపితుడై

శపించునేమో? ఏమి చేయవలయునా యని యాలోచించి కృతనిశ్చయు డై యిట్లనియె. బ్రాహ్మణోత్తమా! అట్లే మీయిష్టప్రకార మామెను మానగరులో నుంచి శీఘ్రకాలములో దోడ్కొనిపొందు అని వచించి కుమారైయైన చంద్రిప్రభను పిలిచి యీవిప్రకన్యను నీయంతఃపుర ములో నుంచి భద్రముగ గాపాడు మని పంపెను. మూలస్వామి వెడలి పోయెను.

రాజపుత్రిక యాకపటవిప్రకన్యను చేయి పట్టుకొని యంతిపురము లోనికి గొంపోయి మజ్జన భోజన శయనాదులయందు సైతము తనకడనే యుంచుకొనెను. ఇట్లు దినములు జరుగ నొకనాటిరాత్రి వారిర్వు రేక శయ్యాగతులై పరుండియున్నప్పు డక్కపటబాలిక రాకుమారిం జూచి యిట్లనియె. చెలీ! నీకడుపున నేదోవిచార మున్నట్లు నీముఖమున బొడగ ట్టుచున్నది. కారణ మేమో నా కెఱింగింతువా యన చంద్రప్రభ యిట్లని యె. చెలీ! యేమని చెల్పుదును. కొలదిదినములక్రింద నొకనాడు వసంత కాలమున సాయంసమయమున వనవిహారమున కేగి యావనములో విశ్ర మించియున్న కామని బోలిన విప్రసుమారుని గంటిని. అదిమొదలు విర హతాపముచే కృశించుచుంటిని. అతనిసౌందర్యమును గాంచి మూర్ఛిల్లి తిని. నాచెలికత్తెలు నన్ను సవారిలో నునిచికొని యింటికి జేర్చిరి. ఆసుం దరుని వియోగమే నా మనస్తాపమునకు గారణము. అని చెప్ప నాకపట బాలిక యిట్లనియె. చెలీ! నీ కాసుందరుని పొందు సమకూర్చెదను. నా కేమి బహుమతి నొసంగెదవని యడుగ నామె నాజీవిత మంతయు నీకు దాసి నయ్యెదను. అని పలుకగా హరిశర్మ యారాకమారి కన్నులను మూసి తన నోటిలోని ఘుటిక తీసి చేతబట్టుకొని నిజరూపమును ధరించి రాజకుమారియెదుట నిలిచెను. చంద్రప్రభ గుర్తించి హరిశర్మ నాలింగన మొనర్చుకొని శయ్యపైకి జేర్చెను. నాటిరాత్రి వారిర్వురు మహానంద

సాగరమున నోలలాడిరి. తెల్లవారుఝామున ఘటికనోట ధరించి యెప్పటియట్లు స్త్రీ యయ్యెను. ఈవిధముగ హరిశర్మ రాత్రులు పురుషుడై రాజపుత్రికను సంతోషపెట్టుచు పగలు వనితారూపమున నుండి దినములు జరుపుచుండెను. ఈవిధముగ కొలదిమాసములు జరుగగనే యారాజకుమారి గర్భమును ధరించెను.

ఒకనాడు మంత్రికుమారుని వివాహము జరిగెను. ఆవివాహమునకు రాజాంతఃపురమునందలి స్త్రీలందరును వెడలిరి. మంత్రికుమారుడు స్త్రీవేషధారియైన హరిశర్మను జూచి మోహించెను. వివాహానంతరము రాజకన్యక చెలికత్తెలతోసహా తన యంతఃపురము జేరెను. మంత్రికుమారు డాకపటవిప్రబాలికపై మోహముచే యన్నపానాదులను వదలి చింతింపుచుండ నతనిమిత్రులు కొందరు ప్రక్కజేరి కారణము నడుగ నాతడు తనమనోరథమును వారి కెఱింగించెను. మిత్రులావృత్తాంతమును గొని పోయి మంత్రి కెఱింగించిరి. మంత్రి యొకనాడు రాజసన్నిధి కేగి మహారాజా! మీ యంతఃపురమున గలవిప్రకన్యకను మోహించి నాకుమారుడు పరితాపమున మునింగి యన్నపానాదులను సైతము వదలినాడు. కావున తాము కరుణించి యాకన్యకను నాకుమారున కిప్పింపుడని యడుగ రాజిట్లనియె. విప్రకన్యకను నీసుతు డెట్లు వివాహమాడును? ఇట్టి యధర్మ కార్యమును నేను చేయజాలను. అని చెప్ప మంత్రి నిరాశతో వెడలిపోయెను. మంత్రికుమారుడు విరహవేదనచే మంచము బట్టెను. కుమారుని పెగల విచారమువలన మంత్రి రాజకార్యములను వదలెను. అందువలన విధిలేక సువిచారు డొకదినమున తన మంత్రియెదుట నుండగనే యావిప్రకన్యకను బిలిపించి యిట్టనియె. విప్రకుమారీ! నీవిటకు వచ్చి చాలదినము లయ్యెను. నిన్ను దిగబెట్టి వెళ్ళిన యావిప్రు డింతవరకు జీవించెనో లేదో తెలియదు. కావున నీవు మామంత్రికుమారుని పరిణ

యమాడుము. అతడు నీపై విరాళించే మంచము పట్టియున్నాడు. సుం దరుడైన యాతని జెట్టపట్టుము. అని పలుక నాకపటబాలిక యిట్లనియె. నేను విప్రకన్యను. తీర్థయాత్రలు నెట్లు వివాహమాడగలను. మీమంత్రి కుమారుడొక్క-సంవత్సరకాలము సకలతీర్థములను మునింగి తీర్థయాత్ర గావించి వచ్చెనేని నే నాతని బరిణయమాడుదు నన మంత్రి యిట్లనియె. నీవు మాయింట నుండుట కంగీకరించినచో నాకుమారుని తీర్థయాత్రకు బంపెద నన హరిశర్మ వల్లెయని యంగీకరించెను. మంత్రి యాకృత్రిమ విప్రకన్యను వెంట నిడుకొని తనయింటి కేగెను. కుమారునితో నామె నియమమును వచింప మంత్రిసందను డామెం జూచి సంతసించినవాడై మరునాడే పయనమై తీర్థయాత్ర కేగుచు దనప్రథమకళత్రమగు సౌభా గ్యసుందరిని జూచి నీ వీమెను భద్రముగా గాపాడుచుండు మని చెప్పి వెడలిపోయెను.

హరిశర్మ యదిమొదలు స్త్రీరూపముతో నంతఃపురమున నామం త్రికుమారుని పత్నియైన సౌభాగ్యసుందరితో సమముగ స్నానభోజనాదు లలో బాల్గొనుచు దన మాటలచేతను పనులచేత నామె యనురాగము నార్జించెను. ఒకనాడు సౌభాగ్యసుందరి కపటవిప్రబాలికతో నేకశయ్య పై బరుండి యిట్లనియె. చెలీ! నే నేమిచేయుదును. నావివాహమైనది మొదలు నాభర్త నీపై ప్రేమచే న న్నొకనాడైన పలుకరింపలేదు. అతి క్రమించి వచ్చుచున్న యీయవ్వనము నాచిత్తమును నిలువనీయ కున్నది. ఈమదనతాప మెట్లు పోవును. నాహృదయ మిప్పుడు సుందరపురు షాలింగనమున కై దగగొని యున్న దేమి చేయుదు నన నాకపటవిప్రకన్య సౌభాగ్యసుందరిని గాగలించుకొని చెలీ! నేను నీబాధను నివారణ జేసె దను. నా కేమిబహుమతియన నామె యెల్లకాలము నీదాసినై పాదసేవ జేసెదనన నాబాలిక నీవు కంఠస్థ మూసుకొనుము. నామంత్రశక్తివలన నీ కొకసుందరపురుషుని జూపెదను. అని పల్క- సౌభాగ్యసుందరి కనులు

మూసికొనెను. హరిశర్మ నోటిలోని ఘుటిక దీసి తననిజరూపమున బ్రత్యక్ష మయ్యెను. మంత్రిపుత్రినిభార్య యాసుందరవిప్రయువకుని జూచి కామోద్రేకము కలిగియుండుటచే సంతోషభరితయై తటాలున గాగలించుకొని శయ్యకు దార్చెను. ఆవిధముగ వా రిర్వురు నారాత్రి యంతయు కేళీవినోదముల దేలిరి. తెల్లవారిజామున హరిశర్మ ఘుటికాసహాయమున స్త్రీ యయ్యెను. ఇట్లాతడు మంత్రిపుత్రినిభార్యను సురతసౌఖ్యమున దేలించుచుండెను.

ఈవిధముగ సంవత్సరకాల మొకతృటిలో వెళ్లించిరి. తీర్థయాత్ర కేగిన మంత్రికుమారుడు వచ్చెను. ఇంటిలోని వా రంద రతనికి మంగళాచరణములను సల్పిరి. నాటిరాత్రి హరిశర్మ స్త్రీరూపమున నేదియో పనియున్నట్లు వెలుపలకు వచ్చి నోటిలోని ఘుటికను దీసి పురుషరూపమున తన్ధానమునకేగెను. మరునాడు మూలస్వామిని జూచి జరిగిన వృత్తాంత మంతయు దెల్పి ఘుటిక నతని కొసంగెను. ఇక్కడ మంత్రి గారియింటిలో నావిప్రకుమారి మాయ మగుటచే వెదకివెదకి విసిగి యూరకుండిరి. మూలస్వామి మరల ఘుటికను నోట నుంచుకొని వృద్ధుడై చంద్రస్వామిని వెంట నుంచుకొని సువిచారుని కొల్వుకూటమున కేగి రాజుచే గౌరవింపబడి యొకచో గూర్చుండెను.

వృద్ధవిప్రుడు రాజుం గాంచి రాజా! పరమేశ్వరానుగ్రహమువలన నే నేగినపని నెఱవేఱినది. నాభార్యాపుత్రులు కనపడినారు. ఇతడే నాకు మారుడు. ఇంక నాకోడలిని బంపితివేని ఇర్వురను వెంట గొనిపోయెద ననగా జిట్లనియె. బ్రాహ్మణోత్తమా! క్షమింపుము. వీరు చిరకాలమై నను రాకుండుటచే నామెను మంత్రికుమారున కొసంగి వివాహము చేయ స్థిరపరచి పంపితిని. గాని మూడుదినములనుండి యామె మాయ మయ్యెనని వాడుకగా నున్నది. అపరాధమును క్షమింపు మన నావృద్ధుడు కపట

క్రోధము నభినయింపుచు రాజా! ఎంత యసర్థకము జేసితివి? నావంశ
ము వృద్ధి గాకుండ జేసితివి. చూడుము. నిన్ను శపించెద ననుటయు
రాజు భయపడి మహానుభావా! నన్ను శపించిన మీ కేమి లాభము?
జరిగిన దేనో జరిగినది. బ్రాహ్మణులు క్షత్రియకన్యను బెండ్లాడు టాచా
రమేకదా! నాకుమార్తెయైన చంద్రప్రభ నిచ్చెద నై కొనుడని వేడుకొన
వృద్ధుడు శాంతించి రాజా! బ్రాహ్మణులకు దీర్ఘక్రోధము దగదు.
అట్లనే వివాహము చేయు మన రాజు చంద్రస్వామికి తనకుమార్తె
నిచ్చి వివాహము జేసి యనంతరము తనకుమార్తెను వారివెంట బంపె
ను. మూలస్వామి వా రిర్వురిం గొని యథాస్థానమునకు వచ్చెను. ఈవృ
త్తాంతమును హరిశర్మ విని యటకు వచ్చి చంద్రప్రభ తనభార్య యని
కలహించెను. చంద్రస్వామి అగ్నిసాక్షిగ పెండ్లి జేసికొనిన భార్యను నీ
కెట్లిత్తు నని ధిక్కరించెను. హరిశర్మ ఇంతకుముందె యీమెకు నావలన
గర్భము నిలిచిన దని చెప్పెను. మూలస్వామి వారిజగడమును మాన్పజా
లక పోయెను. విక్రమరాజేంద్రా! వింటివిగదా! ఆమె యెవ్వనిభార్య
యగునో వచింపు మన నత డిట్లనియె. హరిశర్మవలన నిలిచినగర్భము
రహస్యము, చౌర్యము. చంద్రస్వామి యథావిధిగ పెండ్లాడినవాడు గా
వున చంద్రప్రభ చంద్రస్వామికే భార్య యగు నని చెప్ప భేతాళు డెప్ప
టియట్ల వృత్తోగ్రమున కేగెను.

పదునైదవకథ.

విక్రమార్కుడు మరల భేతాళుని పట్టి తెచ్చుచుండ నాత డిట్లు
చెప్ప నారంభించెను. రాజా! వినుము. హిమాలయ మనుపర్వతప్రాంత
మున గంధర్వనగర మనునగరము కలదు. ఆనగరమును గంధర్వరా జగు
సీమూత కేతువు పరిపాలించుచుండెను. అతడు చిరకాలము సంతానహీను

డగుటచే పుత్రార్థియై కల్పవృక్షమును పూజించెను. ఆకల్పవృక్షము మాతని పూజకు సంతసించి వరమును వేడుమన జీమూతకేతువు నమస్కరించి నాకు సర్వగుణసమన్వితుడై, వంశోద్ధారకుడైన కుమారుని ప్రసాదింపు మని యడిగెను. కల్పవృక్షము మళ్లీ యగుగాక యని పల్కెను. రాజింటికి వచ్చెను. ఒక్కసంవత్సరకాలము గడువగనే జీమూతకేతునకు తేజశ్శాలి యైన కుమారుడు గలిగెను. పుత్రజననమును జూచి తండ్రి మహాసంతోషముతో నగర మంతయు పుత్రోత్సవమును జేయించెను. బ్రాహ్మణులకు విరివిగ ధనరాసు లొసంగెను. బీదలకు - గోవ్రులకు సంతోషమును గలిగించెను. పెద్దలయనుమతిని కుమారునకు జీమూతవాహనుడని పేరు పెట్టెను.

శుక్లపక్షచంద్రునివలె జీమూతవాహనుడు క్రమక్రమముగ వృద్ధి నందుచు బండ్రెండువత్సరముల వయస్సుగల వాడైనంతనే శివపూజా ధురంధరుడై వేదములయందు, శాస్త్రములయందు, ధనుర్విద్యయందు నిరుపమానపాండిత్యమును సంపాదించి సాహసశౌర్య ధైర్యాదులయందు సాటిలేని మేటివీరుడై ధర్మాత్ముడని కీర్తి గాంచెను. తండ్రియైన జీమూత కేతువు కుమారునకు దగినకన్యకను విచారించి కడు వైభవముగ వివాహ ము జేసెను. రాజ్యములోని ప్రజ లందరు నతనిని మిక్కిలి ప్రేమించు చుండిరి. జీమూతవాహనుడు తండ్రివలెనే తానును కల్పవృక్షము నతి భక్తితో పూజించుచుండెను. కల్పవృక్షము ప్రసన్నమై జీమూతవాహనా! నీ కభీష్ట మేమో తెలుపుమన నత డోతరురాజా! నారాజ్యమందలి ప్రజ లందరును దరిద్రబాధ లేక సంతోషముతో సర్వసమత్వము గలిగియుండున ట్లనుగ్రహింపు మన నాకల్పవృక్ష మట్లే యనుగ్రహించెను. ఆకల్పవృక్ష ముయొక్క వర ప్రసాదమువలన జీమూతకేతువురాజ్యమున దారిద్ర్యము, భీతిబాధలు లేక సకలజనులు సంతోషముగా నుండిరి.

తండ్రికొమరు లీవిధముగ ధర్మాత్ములై జనరంజకముగా బరిపాలించుటజూడ జ్ఞాతుల కందర కితని పై యసూయ జనించెను. ఎట్లయిన నాతనిరాజ్యమును స్వాధీనము జేసికొనవలయునని సమయముకొఱకు కేమరుచూచుచు తరుణము రాగానే సైన్యసమేతులై వచ్చి గంధర్వనగరమును ముట్టడించిరి. ఆకస్మికముగ జ్ఞాతులు నగరమును చుట్టుకొనియున్న వృత్తాంతమును విని జీమూతవాహనుడు యుద్ధసన్నద్ధుడై తండ్రియనుజ్ఞ గోరెను. జీమూతకేతువు కుమారుని జూచి నాయనా! మనశరీరము లనిత్యములు. ధనము ప్రవాహము వంటిది. ఒకచోట నిల్చునది గాదు. పుట్టినప్రాణి గిట్టుట తప్పదు. 'జాతస్య మరణం ధ్రువం' అను నార్యోక్తి నెఱుగవా? ధర్మమును రక్షించుకొనుట ముఖ్యకర్తవ్యము. ఈయస్థిర రాజ్యభోగములకై యుద్ధమున కేగినయెడల నెందరు నిష్కారణముగా మనకొఱకు ప్రాణములను గోల్పోయెదరో? మన మెన్ని నిండుప్రాణములను దీయవలయునో యోచించితివా? హింసాకరమైన కార్యములకు దూరముగ నుండవలయును. 'అహింసా పరమో ధర్మః' అని పెద్దలందురు. పాండవాగ్రజు డగుధర్మరాజు భారతయుద్ధము పూర్తియైన తదుపరి జ్ఞాతిబంధుజనహత్యలను దలంచి మితిలేని దుఃఖములకు బాలయ్యెను. కావున రక్తప్రవాహమును గల్గించుటకు నాహృదయము సమ్మతింపకున్నయది. అని పల్క జీమూతవాహనుడు తండ్రీ! మీయభిప్రాయమట్లున్నయెడల రాజ్యమును జ్ఞాతుల కర్పించి తపస్సు జేసికొందము రండు అనిపలుక తండ్రి సమ్మతించి రాజ్యమును జ్ఞాతులకర్పించి యా తండ్రి కొమరు లిర్వురును మలయాచలపర్వతముపై కేగి యచ్చట నొకకుటీరమును నిర్మించుకొని యందు నివసించుచుండిరి.

ఆపర్వతముపై జీమూతవాహనుని కొకవనిరికుమారునితో స్నేహమేర్పడెను. వా రిర్వురు తరుచుగ విహారార్థమై పోవుచుండిరి. ఒకనాడు వా రిర్వురును పర్వతముపై విహరించుచు నచ్చటికి సమీపమున

గల భవానీదేవిమందిరమున కేగిరి. అచ్చట కొకసుందరి వీణాపాణియై చెలికత్తెతో వచ్చి భవానీదేవితెదుట గానము సేయుచుండెను. జీమూత వాహను డామెం గాంచి మోహపరవశు డయ్యెను. ఆ సమయు నావిద్యాధర పుత్రుని జూచి విరోధి జెండెను. పరస్పరవీక్షణములనలన భావము లవ గతము లయ్యెను. కొంతవడి కెవరిత్రోవను వారు పోయిరి. నాటిరాత్రి జీమూతవాహనునకు నిద్ర పట్టలేదు. మరునాడు ప్రాతఃకాలమునసే సుం దరీసందర్శనాపేక్షచే జీమూతవాహనుడు బయలుదేరి భవానీమందిర మును జేరెను. ఆసుందరియుఁ జెలికత్తెలతో నట జేరి దేవి కెదురుగ నిలు వబడి గానము సేయుచుండెను. జీమూతవాహనుడు కొంతసే పాగాన మాలించి చెలికత్తెం జేరి యీజగన్మోహిని యెవరు? అని యడుగ నామె యిట్లనియె. ఓసుందరయువకుడా! ఈమె మలయకేతుమహారాజ పుత్రిక మలయావతి. అనురూపవరుని గోరి దేవిని ప్రార్థింపుచున్నది. మీవృత్తాంత మేమో తెలిసికొనవచ్చునా? అని యడుగుటయు నాత డోయువతీ! గంధర్వనగరాధీశుడైన జీమూతకేతువునకు కుమారుడును. నాపేరు జీమూతవాహనుడు. దైవసంకల్పమువలన రాజ్యము పరులయధీన మగుటచే మే మీపర్వతమున వసించుచుంటిమి- అని చెప్పెను. మ లయావతి కొలదికాలమునుండి జీమూతవాహనునిపై గలమోహా మగ్గ ల మగ్గుటచే తిరిగి చూచుచు వెడలిపోయి విరహతాపముచే మంచ ముపై పరుండెను. తల్లి మలయావతియొక్క పరితాపమును గ్రహించి భర్తతో విన్నించి మహారాజా! మనకుమార్తె యుక్తవయస్కయై యు న్నది. వరనిర్ధారణ మొనర్పనలయును. అని పలుక మలయకేతుడు కుమారుడగు మిత్రావసువనువానిం బిలిచి మలయావతి కనుకూలవరుని వెదకి రమ్మని పంపుక నతడు తండ్రీ! గంధర్వనగరాధీశ్వరుమును, విద్యాధర కులదీపకు డగుజీమూతకేతుమహారాజు పుత్రునితో మలయాద్రిపై నివసించియున్నాడు. అతనికుమారుని మలయావతి వలచియున్నది.

అనుటయు మలయకేతువు వెంటనే పరిచరులను బంపి జీమూతకేతుని పుత్రసహితముగా బిలువ నంపి తనయభిప్రాయ మెటేంగించెను. జీమూతకేతువు సంతోషముగ నంగీకరించెను. తదనంతర మొకశుభలగ్నమున మలయావతీజీమూతవాహనులకు మహావైభవముగ వివాహమును జేసిరి. వివాహానంతరము నూతనదంపతులు పెద్దలవలన నాశీర్వచనము లను పొంది సుఖంబుగ గొలదిదినములు కాలము గడిపిరి.

ఒకనాటిప్రాతఃకాలమున జీమూతవాహనుడు మిత్రావసువను తనబావమరిదిని వెంట నిడుకొని మలయాద్రిపై విహరింపబోయెను. కొంతదూరము పోవ నతనికి తెల్లని ఎముకలప్రోవులు గుట్టలై పడియుండుట జూచి శ్యాలకునిజూచి బావా! యీయెముకల గుట్టలచరిత్ర మేమని యడుగుటయు మిత్రావసువు జీమూతవాహనుని జూచి ఇవి యన్నియు పాతాళ లోకమునందలి నాగులయెముకలు. ప్రతిదినము నొక్కొక్క నాగుడు పాతాళమునుండి వచ్చి గరుడున కాహారము కావలయును. ఇది నియమము. నాగులు చనిపోవ వానియస్థు లిట బడి యున్నవని చెప్పెను. వా రిర్వు రీవిధముగ మాట్లాడుకొనుచు కొంతదూరము పోవ జీమూతవాహనుడు తనమఱదితో నీ వింటికి బొమ్ము. నేను నానిత్య పూజావిధానమును పూర్తి గావించుకొని వచ్చెదను. అని చెప్పి మిత్రావసువును బంపి తా నాపర్వతమున దిరుగుచుండెను. ఇంతలో నతని కొకముదుసలియువతి రోదనము జేయుచు వచ్చుచున్నట్లు గన్పడ నామె సమీపమున కేగి ఓయవ్వా! నీ వెవ్వ రెవు? ఏల యి ట్లేడ్చెదవు? నీదుఃఖమునకు గారణ మేమని యడుగ నావృద్ధురా లిట్లనియె. నాయనా! నే నొకనాగకాంతను. ఈదినమున గరుడున కాహార మగుటకు నాకుమారుడైన శంఖచూడునివంతు వచ్చినది. నా కాత డొకపుత్రు డగుటచే పుత్రైమరణమువకు చింతించుచుంటిని. అని పలుక జీమూతవాహనుడిట్లనెను. ఓయమ్మా! నీవు చింతింపకుము. నే నొకవిద్యాధర పుత్రుడను.

నీకుమారునికి మారుగ నాశరీరమును గరుడున కొసంగి నీపుత్రుని కాపా డెదను. అనవుడు వృద్ధురా లోధార్మికశిరోమణీ! వలదు. నీవంటి యుదా రులు లోకమున నుండవలయును. పెక్కుమంది జీవింపగలరు. నాకుమా రునికొఱకు విలువగల జీవితమును నాశనము జేసికొనవలదు. అని పలుక జీమూతవాహను డోనాగమాతా! 'పరోపకారార్థ మిదం శరీరం' అను నార్యోక్తిని వినవా? మరణ మెప్పుడును తప్పునది కాదు. కావున పరో పకారమున కై ప్రాణత్యాగము జేసికొనుట సరోత్తమము. కావున నీ కుమారుని వెనుకకు మరల్చుకొనుము. అని చెప్పుచుండ శంఖచూడుడు వచ్చి పెక్కువిధముల వారించెను. కాని యతడు తనపట్టుదలనుండి చలిం పలేదు. సత్యవాదులు తమవాక్కును వ్యర్థము జేయరుగదా! శంఖచూ డుడు విధిలేక తల్లితో దేవీమందిరమునకు వెడలిపోయెను. జీమూతవా హనుడు వధ్యస్థానమున నిలిచియుండెను.

చూచుచుండగనే గరుడుడు రెక్కలగాలిచే వృక్షములను బెకలిం ప జేయుచు భయంకరాట్టహాసముతో నరుగుదెంచి భీకరఖడ్గములవలె నున్న తనచంచువులతో జీమూతవాహనుని కరచుకొని పోవునపుడు శరీర మంతయు గాయము లై పోవుటచే చేతిని గట్టుకొనియున్న భుజబంధు అను ఆభరణము రక్తముతో దడిసి మలయావతిముందు బడెను. మల యావతి యాభుజబంధును దీసి గుర్తించి నెత్తురిలో తడిసి పడుటచే భయాక్రాంతయై రోదనము జేయుచు తనతల్లిదండ్రుల కీవార్త నెఱిం గించెను. వారును దుఃఖపడుచు కుమార్తెను వెంటనిడుకొని జీమూతవాహ నుని వెదకికొనుచు బయలుదేరి పోవుచుండగా దేవీమందిరమునుండి వచ్చుచుండు శంఖచూడు డొదురయ్యెను. శంఖచూడుడు వారివృత్తాం తమును తెలిసికొని పరుగునబోయి చూడ వధ్యస్థానమున జీమూతవాహ నుడు లేకుండుటచే గరుడు డతని నెత్తుకొనిపోయినట్లు నిశ్చయించి శర

వెగమున గరుడునిసన్నిధి కేగి గరుత్మంతుడా! వదలుము. నీవు భక్షింప తగిన నాగుడను నేను. అమహానీయుని వదలుము. అని మొర పెట్టుకొ సెను. గరుడు డప్పుడే జీమూతవాహనుని శరీరమందలి రక్తమును పాన ము జేయుచు శంఖచూడుని మాటలను విని తెల్లబోయి యే మేమిా! ఇతడు నాగుడుకాడా? నేను పొఅబడితినా యని తలంచి ముఖమునగల వస్త్రమును దీసి యోసాహసవంతుడా! నిజ మెఱింగింపుము. నీ వెవ్వారవు? అనవుడు గరుత్మంతా! నేను విద్యాధరుడను. జీమూతవాహనుడను. శంఖ చూడునితల్లికి వాగ్దాన మొనర్చితిని. అందులకుగా శంఖచూడునకు బదు లు నాశరీరమును నీ కొసంగితి నారగింపు మన గరుత్మంతుడు జరిగిన సం గతిని తెలిసికొని వెంటనే దేవలోకమున కేగి యమృతముం దెచ్చి యత ని పై చల్లి బ్రదికి చి యిట్లనియె. రాజపుత్రా! నీసాహసమునకు మెచ్చి తిని. నీపరోపకారబుద్ధి కానందించితిని. వర మడుగుమన జీమూతవాహను డిట్లనియె. అయ్యా! నేటినుండియు నీవు నాగులను భక్షింపవలదు. ఇది వరలో మృతు లైనవారిని బ్రతికింపుము. ఇదే నాకోర్కె– యన గరుడు డతనియుదారబుద్ధికి సంతసించి నాగులను బ్రదికించి యతనికోర్కె– దీర్చి జీమూతవాహనా! నీపరోపకారబుద్ధి కానందించితిని. కొలది దినములలో నీరాజ్యము నీకు స్వాధీనమగున ట్లనుగ్రహించితి నని చెప్పి గరుడుడు స్వ స్థానమున కేగెను.

జీమూతవాహనుడు తనవారిని గలసికొని యీవృత్తాంతము నెఱింగించి తల్లిదండ్రులతో, భార్యతో తిరిగి రాజ్యమును సంపాదించి సుఖంబుగ నుండెను. రాజా! శంఖచూడ జీమూతవాహనులలో నెవరి త్యాగము మెచ్చదగినది? అని గరుడుగ విక్రముడు - శంఖచూడునిత్యా గమి గొప్పది. కారణ మేమనగా జీమూతవాహనుడు క్షత్రియుడు. పరో పకార మతనివ్రతము. ప్రాణ త్యాగమున కలవాటుపడి యున్నవాడు.

శంఖు చూడుడు - రక్షింపబడియును - తిరిగి మలయావతి దుఃఖమును జూచి జీమూతవాహనుని రక్షించుటకును - తాను చంపబడుటకు నంగీకరించెను. కావున నతనిత్యాగమే గొప్పదని చెప్ప భేతాళుడు తిరిగి వృక్షశాఖను జేరెను. విక్రమార్కుడతని బట్టి తెచ్చుచుండెను.

పదునారవకథ.

భేతాళుడిట్లు చెప్ప నారంభించెను. రాజా! వినుము. త్రివిక్రమమనునగరము కలదు. ఆపట్టణమున రత్నదత్తుడనువర్తకుడు గలడు. అతని కున్మాదిని యనుపేరుగల సౌందర్యవతి యగుకుమార్తె కలదు. ఆమెకు యుక్తవయస్సు వచ్చినవెంటనే వివాహము జేయదలంచి, తండ్రియైన రత్నదత్తుడు నగరము నేలు రాజసన్నిధి కేగి నమస్కరించి! మహారాజా! నా కొకకుమార్తె కలదు. ఆమె పేరు ఉన్మాదిని. మీవంటి మహారాజులు చేపట్టతగినది. కావున నామెను దేవర కిచ్చి వివాహము జేయ దలంచితిని. 'రత్నహారీతు పార్థివః' అనున్యాయము తామెఱింగియే యున్నారు. కావున నాకన్యారత్నమును గైకొనవలయునని ప్రార్థింపుచున్నాను. అని పలుక ప్రభువు తనయాకారంగికభావములను బట్టి మీ రీవర్తకునివెంట జని యామెను జూచి యితడు చెప్పినట్లు సులక్షణసురూపసంపదలతో నొప్పుచుండెనేని నా కెఱింగింపుము అని పంపెను.

రాజభటు లారత్నదత్తునితో బోయి యతనికుమార్తెయైన యున్మాదినిం గాంచి యామెచక్కదనమును జూచి యాశ్చర్యపడిరి. లేడికన్నులబోలు నేత్రములు - త్రాచుపాముపంటి జడ - ధనస్సునుబోలిన కనుబొమలు - తిలపుష్పమునటి నాసిక - ముత్యములవంటి దంతపంక్తి - దొండపండునంటి యధరము - శంఖమువంటి గళము - కోకిలకూతవంటి పలుకులు - గలయా చంద్రముఖి - చంపకగంధి - హంసగమన - కోకిలవాణి - యాయుదూపసంపదలగాంచి దేవేంద్రుని వలపింపగల్గు యీచక్కెర

బొమ్మను రాజు పెండ్లాడెనేని రాజకార్యములను, ప్రజలను, రాజ్యమును మరచి యీమెతోడిదే లోకముగ దలంచి వెలికి రాజాలడు. కావున రాజున కీమె సౌందర్యమును తెలియనీయరా దని నిశ్చయించుకొని యా భటులు ప్రభుసన్నిధి కేగి మహారాజా! మే మామెను జూచితిమి. తమ వంటి ప్రభువులను జెట్టపట్టగల లక్షణము లామెదగ్గర నేమియు లేవు. అని చెప్ప ప్రభువు విరక్తుడై నీకుమార్తె నాకక్కర లేదని రత్నదత్తునకు వార్త నంపెను.

తదుపరి రత్నదత్తుడు తనకుమార్తెను సేనాపతియైన బలభద్రుడనువాని కిచ్చి వివాహము జేసెను. బలభద్రుడు భార్యతో నత్తవారింటనే యుండి రాజకార్యములయం దప్రమత్తుడై సంచరించుచు భార్యతో సుఖించుచుండెను. ఒకనాడు ప్రభువు గజారూఢుడై పట్టణము జూడ బయలుదేరెను. పురకాంత లందరును గవాక్షములనుండియు, మేడల పైనుండియు, మిద్దెలపై నెక్కియు ప్రభువును వీక్షించుచుండిరి. ప్రభువు రత్నదత్తుయొక్క మేడగలవీధిని వచ్చుచుండెను. రత్నదత్తుని కుమార్తెయైన ఉన్మాదిని సర్వాభరణభూషితయు రంభోర్వసుల దిరస్కరించు సౌందర్యముతో మేడపైనుండి రాజును వీక్షించుచుండెను. ప్రభువును మేడప్రక్కకు వచ్చినప్పటికి తలయెత్తిచూడ విద్యుల్లతవలె మెఱయుచున్న ఉన్మాదిని కనబడెను. రెప్పవేయక నిదానించి చూచి ఈమె మానవకాంతయా, దేవకాంతయా, యక్షకన్యయా? ఈజగన్మోహిని యెవ్వరై యుండునో యూహింపజాలక రాజు నగరు చేరినది మొదలు చింతాక్రాంతుడై యుండెను. అంతఃపురము విడిచి వెలుపలికి రాకుండుటచే నాశ్చర్యపడుచుండిరి. ఒక రిద్దరు రాజాంతఃపురసేనకులు సాహసించి ప్రభువును సమీపించి చింతకు గారణ మడిగిరి. రాజు వారిం జూచి తాను జూచిన సౌందర్యనతి శ్రాంతము నెఱిగించి యీమె యెవ్వరని యడిగెను. సేనకు లిట్లనిరి.

మహారాజా! ఆమె రత్నదత్తునికుమార్తె ఉన్మాదిని. ప్రభువుగారి కామె నీయదలంచి కబురుపంప తా మక్కరలే దనుటచే సేనాపతి బలభద్రుడిచ్చి వివాహము జేసినాడని చెప్ప రాజు తెల్లబోయినాడు. తా నంపిన యంగరక్షకభటులు తన్ను మోసపుచ్చినారని యెంచి కోపమున నాభటుల బిలిచి పెనుక మీరు రత్నదత్తునికుమార్తెవిషయమై చెప్పినమాటలు నిజమేనా యని యడుగ వారు భయపడుచు దేవా! మే మసత్యము నాడినమాట నిశ్చయమే. కారణ మేమనగా? తా మా సుందరాంగి యొక్క మోహమున జక్కతిరేని రాజకార్యములను బరిత్యజింపగలరు. దాన దేశమునకు గీడుగదా యని తలంచి యట్లు చెప్పితిమి. ఇంతేగాని వేరు కారణము లేదు. అని చెప్ప ప్రభువు వారిని పంపి చింతాక్రాంతుడై పరుండెను. నానాటికి రాజుగారి మనోవ్యాధి యధిక మగుటచే భటుల వలన సేనాపతి బలభద్రుడు తెలిసికొని యొకనాడు రాజుకడ కేగి సవినయముగ నిట్లనియె. మహారాజా! నామనవి నాలకింపుడు. మే మందరము దేవరసేవకులము. మాశరీరములు - ధనములు - తమయధీనము. నాయధీనములో నున్ననాభార్యయు దేవరకు దాసురాలు. కొనివచ్చి తమసేవకై యప్పగించెదను. తమకు చిత్తము వచ్చినట్లు వినియోగించుకొనుడన రా జిట్లనియె. పరస్త్రీ తల్లివంటిది. పరస్త్రీగమన మొనర్చిన ప్రభువు ఇహపరములకు రెండింటికిని చెడును. కావున నీవట్లు 'మాతృన త్పరదారాంశ్చ పరద్రవ్యాణి లోష్ఠవత్' అను న్యాయము నాలోచింపు మన బలభద్రు డిట్లనియె. మహారాజా! ఆమె నాదాసి. మీయాత్మసంతృప్తి కొఱ కామెను పరిత్యజించి వేశ్యనుగా జేసి మీకడ కంపెదను. దేవర వారామెతో సుఖింపవచ్చును. అన రాజు గ్రుడ్డిజేసి నీవు రెండు తప్పిదములు చేయదలంచితివి. కులస్త్రీని పరిత్యజించుట - రెండవది ఒకసాధ్విని బలాత్కారముగ పరపురుషసంపర్కమునకు బంపుట. ఈరెండింటిని జేసిన ఫిదప నాచే శిక్షింపబడుమవు. కావున మాటాడక పొమ్ము. నాపరితాప

మునకు శాంతి లేదు. అనవుడు సేనాపతి కింకర్తవ్యతామూఢుడై వెడలి పోయెను.

తదనంతరము సుమారు పదునైదుదినములకు రాజు మనోవ్యాధిచే పీడితుడై నానాటికి చిక్కి మంచ మెక్కి తుదకు మరణించెను. రాజు చనిపోయినతోడనే బలభద్రుడు రాజగురుపునుజేరి స్వామీ! ధర్మాత్ముడైన ప్రభువు చనిపోయిన స్వామిభక్తిగల సేవకుని కర్తవ్యమేమి? అని యడుగ తనజీవితములనుగూడ బరిత్యజించి ప్రభువు యొక్కయాత్మకు శాంతిని సమకూర్పవలయును. అని రాజగురువు చెప్ప బలభద్రుడు వెంటనే లేచి ఊరిబయట కాళీదేవాలయమునన్ని దిని చితి వేర్పించి దాని నంటించి తల్లీ! కాళీ! నాకు ప్రతిజన్మమున నిట్టి ప్రభువును సమకూర్చుము. అని పల్కుచు నామంటలో నురికి ప్రాణములను వదలెను. ఉన్మాదిని యీవార్తను విని యొక్కపరుగున వచ్చి స్నానము జేసి బ్రాహ్మణులకు, సువాసినులకు బూజజేసి యగ్నికి నమస్కరించి తల్లీ! కాళీ! నాకు జన్మజన్మమునకు నిట్టిభర్తయే కావలయు నని పల్కుచు నాచితిలో నురికి ప్రాణత్యాగము జేసి భక్తి ననుసరించెను. రాజా వింటివా? ఈముగ్గురి మరణములలో నీవ మరణము విశేషమైనది? అని యడుగ విక్రమార్కుడు రాజమరణమే శ్రేష్ఠమైనది. కారణ మేమనగా? ప్రభువుకొరకు సేవకుడు చనిపోవుట ధర్మము. భర్త చనిపోయినవెంటనే సహగమనము జేయుట భార్యధర్మము. కాని తాను వలచిన కన్య తనకు లభించుచున్నను ధర్మహాని కంగీకరింపక క్షత్రియ ధర్మమును గాపాడుకొని ప్రాణములను వదలిన రాజుమరణమే కొనియాడ తగినది. అని చెప్ప భేతాళుడు మరల చెట్టునూద కెగిరెను.

పదునేడవకథ.

విక్రముడు పట్టి తెచ్చుచుండ భేతాళు డిట్లు చెప్ప నారంభించెను. ఉజ్జయినీనగరమున దేవశర్మ యనుబ్రాహ్మణు డుండెను. అతనికి

గుణాకరు డనుపేరుగల కుమారుడు గలడు. "కుపుత్రాః కులనాశకాః" అను రీతిని గుణాకరుడు దుర్గుణాకరుడై, దుష్కార్యముల కగ్రేసరుడై సప వ్యసనములకు బాల్పడెను. దూతవ్యసనలోలుడై ధనమును బాడు జేయుచుండెను. ఇంటగల వెండిబంగారములను దొంగతనముగ గొనిపోయి జూదమున సమర్పించుచు వారనారీలోలుడై నిజభార్యను పరిత్యజించెను. తల్లిదండ్రి లెంత మందలించినను వినకపోవుటచే విసిగి యందరును కలసి యాగుణాకరుని దేశభ్రష్టుని గావించిరి.

గుణాకరుడు కొంతకాలము దేశాటన మొనర్చుచు నెక్కడను నిలువ నీడలేక నొకయరణ్యమున బ్రవేశించెను. ఒకపర్వతగుహలో తపస్సు జేసికొనుచున్న సిద్ధుని జూచి యతని సమీపమున కేగి ననుస్కరించి మహాత్మా! నేను క్షుద్బాధచే పీడింపబడుచుంటిని. అని బలుక నాసిద్ధుడు జపము చాలించి యొకమనుష్యకపాలమున నాహార ముంచి గుణాకరుని ముందు బెట్టెను. దానిని జూచి యేవగించుకొని స్వామీ! నే నెప్పుడు నిట్టి పుర్రెలో దిని యెఱుంగను. ఇప్పు డెట్లు భుజింతునన నా సిద్ధు డొకమంత్రమును బఠించినంతనే యొకదివ్యసుందరి ప్రత్యక్ష మయ్యెను. నీ వీబ్రాహ్మణునకు పక్వాన్నముల నారగింప జేసి సంతోషపరచు మనగా నాసుందరి యాతని గొనిపోయి దివ్యహర్మ్యమున జేర్చి యందున్నతాసనమున గూర్చుండబెట్టి స్నానపానాదుల సంతృప్తుని జేసెను. మృష్టాన్నమును గుడువబెట్టి యొకహంసతూలికాతల్పముపై బరుండ జేసి నాటిరాత్రి యంతయు కేళీవిలాసములతో నతనిహృదయము నానందసాగరమున నోలలాడజేసెను.

గుణాకరు డీవిధముగ నామెతో నిష్టవినోదముల బొద్దు గడపి పరుండెను. తెల్లవారునప్పటి కామేడయు, హంసతూలికాతల్పము, నుంధరియు మాయమై తా నెప్పటియట్ల గుహాముఖద్వారమున బరుండి

యుండుటను దెలిసికొని యాసిద్ధుని జేరి రాత్రివిషయ మంతయు దెల్పి యిట్లనియె. స్వామీ! ఇది కలయూ లేక నిక్కువమా! యని యడుగ సిద్ధు డిట్లనియె. రాత్రి నిన్ను సంతోషపరచిన దొకయక్షిణి. నాయూ జ్ఞచే ని న్నామె శృప్తి పరచినది. మంత్రశక్తివలన నా కామె స్వాధీన యైనది. అని చెప్ప గుణాకరు డతనిపాదములబడి మహాత్మా! నాకుగూడ నట్టిమంత్రము నుపదేశింపుడు. నే నాయక్షిణీవిద్యను సాధించెద నన నా యోగి యొకదివ్యమంత్రము నాగుణాకరున కుపదేశించి నీ వీమంత్ర మును శీతకాలమున నలుబదిదినములు అర్ధరాత్రమున మొలలోతునీటిలో నిలువబడి స్మరించుచుండగా జపము జేయుము. జపసమయమున బెక్కుభ యోత్పాతంబులు కలుగును. ఎంతమాత్రము చలింపవలదు. అని పలుక గుణాకరు డావాక్యముల కంగీకరించి సిద్ధుడు చెప్పినట్లు నలుబదిదినము లు జపమును ముగించి తిరిగి వచ్చెను. సిద్ధు డతనిం జూచి యింకొక నలుబదిదినము లగ్నిమధ్యమున గూర్చుండి జపము సేయవలయు నని చెప్ప గుణాకరుడు స్వామీ! ఒక్కమారు గృహమున కేగి మాస్వజన మును జూచి వచ్చి మీరు చెప్పినట్లు చేసెద నాజ్ఞ యిండని సిద్ధుని యనుమతి గైకొని బయలుదేరి స్వగృహము జేరెను. చిరకాలమున కింటికి వచ్చిగుణాకరుని జూచి తలిదండ్రు లెంతయు సంతసించిరి. కుమా రునిబుద్ధి మారియుండు ననుతలంపుతో తండ్రి కుమారునిం జేరి యిట్ల నియె. కుమారా! ఇన్నిదినము లెట నుంటివి? జరిగిన దేమో జరిగెను. ఇంకనైన నామాటలను వినుము. తలిదండ్రుల హితోపదేశమును బెడ చెవిం బెట్టుటకన్న దోషము వేరులేదు. ఆశ్రమములలో నత్యుత్తమమైన గృహస్థాశ్రమమున నుండియు భార్యాపరిత్యాగము జేయుట మహాపాత కము. తల్లిదండ్రుల ఋణము దీర్చుట, వంశమునకు బేరుదెచ్చుటయే సుపుత్రుని ధర్మము. కావున నింకనైన నింటికడనుండి ధర్మతత్పరుడవై

నీధర్మపత్నితో గలసి సత్కర్మాచరణతత్పరుడవై వర్ధిల్లు మన గుణాకరుడిట్లనియె. తండ్రీ!

శ్లో. జన్మదుఃఖం జరాదుఃఖం జాయాదుఃఖం పునఃపునః।
సంసారసాగరం దుఃఖం తస్మా జ్జాగ్రత జాగ్రత॥
మాతా నాస్తి పితా నాస్తి నాస్తి బంధుసహోదరాః।
అర్థం నాస్తి గృహం నాస్తి తస్మా జ్జాగ్రత జాగ్రత॥

అని పెద్దలు పల్కియున్నారు. ఎవ్వరికి ఎవ్వరును లేరు. ఇ దంత యు మాయశరీరము. రక్త మాంసపురీషమూత్రములపాత్ర. దుర్గంధభూయిష్టము. ఒక్కనా డీదేహమును శుభ్రము చేయనియెడల మరునాటికి దుర్వాసన బయలుదేరును. ఇట్టిదేహమున కీవ్యామోహా మేల? మలభరితమైన ఘటమును శుద్ధిచేసినమాత్రమున లాభమేమి? అట్లనే శరీరమున బాహ్యభాగము శుద్ధిచేసినంతలో పాపవాసన వదలదు. అంతశ్శుద్ధి కావలయును. కావున మీరింక నాపై వ్యామోహమును వదలుడు. నే నొక మహాత్ము నాశ్రయించితిని. ఇంకమీద యోగసాధనము జేసి యంతశ్శుద్ధిని గావించుకొనెద నని చెప్పి మరల బయలుదేరి స్మశానికడకు వచ్చి పంచాగ్నిమధ్యమున గూర్చుండి నలుబదిదినము లామంత్రమును జపించెను. కాని యక్షిణి ప్రత్యక్షము కాలేదు. గుణాకరుడు యోగిని సమీపించెను. యోగి యతనిం జూచి యక్షిణి ప్రత్యక్షము కాలేదా యన కాలేదని చెప్పెను. రాజా! గుణాకరుడు విధ్యుక్తముగ జపించినను యక్షిణి ప్రత్యక్షము కాకపోవుటకు గారణ మేమన విక్రము డిట్లనియె. ఆ సాధకుని కేకాగ్రచిత్తము కుదురకపోవుటచే యక్షిణీదేవత ప్రత్యక్షము కాలేదు. చంచలచిత్తునకు మంత్రసిద్ధి కలుగదు. గుణాకరుడు ప్రథమమున నిష్ఠా మబుద్ధితో గాక కామేచ్ఛతో నుపదేశము నందెను. తదుపరి సగము జపముజేసి తపనాశల జూడబోయి జపవిఘ్నము జేసికొనెను. ఇం

దువలన సిద్ధుడు మనమున నిట్టిచంచలునకేల మంత్రోపదేశమును జేసితినా యని విచారపడెను. ఇన్ని కారణములవలన నాసాధకునకు మంత్రసిద్ధి కలుగలేదు. అని చెప్ప భేతాళు డెగిరి వృక్షశాఖను ప్రవేశించుండెను. విక్రముడు తిరిగి యాతనిబట్టి తెచ్చుచుండెను.

పదునెనిమిదవకథ.

భేతాళు డిట్లు చెప్ప నారంభించెను. రాజా! వినుము. కదళీపుర మును సుదక్షిణు డనురాజు పాలించుచుండెను. ఆనగరమున ధనాఢ్యు డను వైశ్యశిరోమణి గలడు. అతనికి ధనవతి యనుకన్యక గలదు. ఆధన వతిని పదవయేటనే గౌరీదత్తు డనేవాని కిచ్చి వివాహము చేసిరి. కొంత కాలమున కాధనవతికి కుమార్తె పుట్టెను. తల్లిదండ్రు లాపెకు మోహిని యని పేరు పెట్టిరి. మోహిని పదేండ్లనిండునప్పటికి గౌరీదత్తుడు చనిపో యెను. భర్త పోయినయనంతరము మరదులు, బావగార్లు మొదలగుబంధు జను లామెయింట గలసర్వస్వము నపహరించి వెడలగొట్టిరి. ధనవతి కుమార్తెతోగూడ వేరొకయూరి కేగుచు త్రోవ తప్పి రాత్రివేళ నొక శ్మశానముగుండా పోవుచు చీకటిలో కనుబడక పోవుటచే శూలారోపణ శిక్షను బొందిన యొకపురుషునిపై బడెను. వా డదివరకే భయంకరమైన బాధ పడుచుండుటచే అబ్బాయని మూలిగి ఎవ్వరిల్లు నాపై బడి నా బాధను వృద్ధి చేసినారు? అని యడుగ ధనవతి అయ్యా! చీకటిలో త్రోవ తెలియకపోవుటచే నావలన నీ కట్టిబాధ గల్గినది. కోపింపకుము. నీ వెవ్వ రవు? నీకిట్టి శిక్ష కల్గుటకు గారణ మేమి? అని యడుగ నాత డిట్లనియె. నే నెవ్వరనైన నేమి? ఈదినములలో నెవ్వరి కెవరును లేరు. ఒకరికష్ట ముల కొకరు కారకులు గారు. భాగస్వాములు గారు. చివరకు భార్యా పుత్రులైను తనకష్టములందు బాలుగొనరు. ఇట్టిస్థితిలో ఎవ్వరని యడి గిన నేమి తెల్పుదును? నే నొకచోరుడను. ప్రభువువలన నీ శిక్షను పొంది

తిని. మూడుదినములైనను ప్రాణములు పోవకున్నవి. అని చెప్పగా ధనవతి ప్రాణములు పోకుండుటకు కారణము కలదా యన చోరుడోపడతీ! కారణము డెల్పెదను నాకు చిరకాలమునుండి వివాహమాడవలయునని కోరిక గలదు. ఆవాంఛ తీరలేదు. అందువలన ప్రాణములు పోకున్నవి. నీకుమారైను నాకిచ్చి వివాహము జేసితివేని నేను దాచిన లక్షలకొలది మొహరీలను నీకు స్వాధీనము జేసెదను.

అనవుడు ధనవతి యామాటలను విని జాతులచే సర్వము కోల్పోవబడిన దగుబచే ధనాశచే తనకుమార్తెయైన మోహినిని వాని కిచ్చి పెండ్లిచేయ దలంచి యిట్లనియె. నేను దౌహిత్రుని జూడవలయు ననికోరుచుంటి . ఆసన్నమరణుండవగునీవలన నాకోర్కె యెట్లు నెఱవేరును. అని యడుగ నతడిట్లనియె. నీకుమార్తె యవ్వనవతి యయినంతనే యొక బ్రాహ్మణునకు అయిదునందల మొహరీల నొసంగి మూడురాత్రులు నీకుమార్తె నతనిస్వాధీనము జేసితివేని నీకు దౌహిత్రలాభము కలుగునని చెప్ప ధనవతి తనకుమార్తెమెడలో నాచోరునిచే సూత్రధారణ జేయించి వివాహము పూర్తి జేసెను. చోరుడు ధనవతితో ఇచ్చటికి తూర్పుదిశగా బోయిన నొకకొండ కన్పడును. దానిప్రక్క నొక కదంబవృక్షమున్నది. ఆవృక్షముక్రింద మొహరీల నిధి యున్నది. త్రవ్వుకొని దానిని స్వాధీనము జేసికొనుము. అని చెప్పి కొంతసేపటికి ప్రాణములను వదలెను. ధనవతి చోరుడు చెప్పినగురు తనుసరించి యావృక్షమును సమీపించి యచట త్రవ్వి మోయగలిగిన్ని మొహరీలను మూట గట్టికొని పుట్టినింటికి బోయి కొంతకాల ముండి తిరిగి యత్తవారియూరు జేరి యొక పెద్దమేడ నడ్డెకు గొని కుమార్తెతో నివసించియుండెను. కొంతకాలమునకు మోహిని నవ యవ్వనవతియై స్నేహితురాలితో మేడపై నిల్చుండి వీధి వైపునకు జూచుచుండెను.

ఒకబ్రాహ్మణయువకుడు పాతికవత్సరముల యెలప్రాయంపుటంద
గా డొక డావీధినుండి పోవుచుండగా మోహిని చూచి వాని చక్కదన
మునకు మెచ్చుకొని స్నేహితురాలితో చెలీ! ఆవిప్రయువకుని నాతల్లికడ
కుం గొనిపొమ్ము అని పల్కెను. వెంటనే యాచెలికత్తె క్రిందకు దిగి యా
బ్రాహ్మణుని వెంటబెట్టుకొని ధనవతిని సమీపించి యిట్లనియె. మోహినీ
దేవి పనుపున నీబ్రాహ్మణుని తమకడకుం గొనివచ్చితినని బలుక ధనవతి
యతని యందచందముల జూచి బ్రాహ్మణోత్తమా! నాకుమార్తెయైన
మోహిని నీయందమునకు వలచినది. ఆమెకోఱికదీర్చుచో నీకెంతయో
బహుమతి నొసంగెద నని పలుక నాత డంగీకరించెను. అంతట నావిప్రుడు
మోహినితో మూడుదివారాత్రములు బ్రహ్మసుఖమనుభవించెను.
చెలికత్తెలు నాలుగవనాడు మోహినితో ప్రథమరాత్రి వృత్తాంత మేమని
యడుగ నామె సిగ్గుతో లేనగవు మొగమున నలంకరింప చెలీ! ఏమని
చెప్పుదును? మీరందరు నన్ను గదిలోనికి బంపి తలుపులను బిగించిరి.
నేను సిగ్గుతో తలవంచుకొని నిల్చుంటిని. ఆయందగాడు నన్ను దనపాన్పు
పైకి లాగుకొని బాహుదండములతో కౌగలించుకొనువరకు జ్ఞప్తియున్న
ది. తదనంతర మేమి జరిగెనో నే నెఱుంగ నని చెప్పెను. విప్రుడామో
హిని యొకనెలదినములు సుఖించుచప్పటి కామెకు గర్భచిహ్నములు పొడ
గట్టుటచే ధనవతి బ్రాహ్మణుని బిలిచి నియమము ననుసరించి అయిదు
వందల మొహరీల నొసంగి పంపివేసెను.

మోహిని గర్భవతియై పదియవమాసమున కుమారుని గనెను.
కనినయారవనాడు రాత్రి ధనవతికి స్వప్నమున సర్వభూషణుడగు కపాల
మాలికాధారియు, త్రిశూలహస్తుడగు విప్రుడు గన్పడి నీమనుమని యొక
పేటికలో నుంచి వేయి వరహాల మూట నందుంచి రాజద్వారమునకు
ముందుభాగమున తెప్పవాగుటకు ముందుంచి రమ్ము. ఇది యీశ్వరాజ్ఞ

యని చెప్పుటయు ధనవతివెంటనే లేచి యీశ్వరుడు చెప్పిన ట్లాశిశువును పేటికలో నుంచి వరహాలతో గూడ యథాస్థానమున నుంచి యింటికి జేరెను. ఆరాత్రియే రాజైన సుదక్షిణునిస్వప్నమున వెనుకజెప్పబడిన విప్రుడు ప్రత్యక్షమై రాజా! నీవు ప్రాతఃకాలమున లేచి చూచితివేని నీరాజద్వారముముం దొకపేటిక యుండును. అం దొక శిశువుండును. తీసుకొనివచ్చి కాపాడుము. ఆశిశువే నీరాజ్యమునకు కర్తయని చెప్పి మాయమయ్యెను. రాజు లేచి తెల్లవారుజామున ద్వారమును దెరచి చూడ పేటిక గనపడెను. తెరచిచూడ మగశిశువు, వేయివరాల మూటసం దుండెను. రా జాద్రవ్యమును ఖజానా కంపి శిశువును గొనిపోయి తనభార్యయైన రాణిచేతి కందిచ్చెను. సాముద్రికశాస్త్రజ్ఞుల గొనివచ్చి పిల్లవాని లక్షణములను జూచి ఫలితమును దెల్పుడని యడుగ వా రందరును యాశిశువును పరీక్షించి మహారాజా! ఈశిశువు మహారాజలక్షణములు కలవాడు. దేశాధిపతి యగునని చెప్పిరి. ప్రభు వావిప్రులకు విశేషధనమును బహుమతి యొసంగి యొకశుభదినమున నామకరణమహోత్సవము జరిపి హారదత్తుడని పేరుపెట్టి యాబాలుని ప్రేమతో బెంచుచుండిరి.

హారదత్తుడు ద్వాదశవర్షవయస్కుడగునప్పటికి వేదములు - శాస్త్రములు- అరువదినాలుగుకళలు- ధనుర్వేదము- మొదలగువాని యందు నైపుణ్యము నార్జించెను. కొలదివత్సరములు గడచినతమపరివృద్ధరాజదంపతులు కాలగతిం జెందిరి. హారదత్తుడు పైతృకకర్మల నెరవేర్చినయనంతరము మంత్రులు హారదత్తుని రాజుగా నొనర్చిరి.హారదత్తుడు రాజై బాలుడయ్యును ప్రజారంజకముగా రాజ్యము నేలుచు నొకశుభముహూర్తమున తీర్థయాత్రలకు బయలుదేరి కాశీ- ప్రయాగలను జూచి గయలో పితృదేవతలకు పిండప్రదానము జేయబోవుచు ఫల్గునీ

నదీతీరమున జేరి యథావిధిగ పితరులకు పిండదాన మొనర్చెను. తత్సమ యమున హరదత్తునిచేతిపిండముల నందుకొనుట కానదిలో నుండి మూడుహస్తములు పైకి లేచెను రాజా! హరదత్తు డాపిండముల నెవరి చేతిలో నుంపవలయునో డెల్పు మన విక్రము డిట్లనియె. వివాహ మాడినదొంగయే పిండముల నందికొన నర్హుడు. కారణ మేమనగా బ్రాహ్మణునివీర్యమును ధనవతి అయిదువందలమొహారీలకు కొనియుండు టచే పిండాధికారమును గోల్పోయెను. రా జాశిశువుపోషణముకై పెట్టిలో పెట్టినవేయివరహాలమూటను గ్రహించుటవలన పిండగ్రహణాధి కారమును పోగొట్టుకొనెను. కావున చోరుడే గ్రహింప దగును. అని చెప్ప భేతాళుడు మరల చెట్టు పై కెగిరెను.

పందొమ్మిదవకథ.

తిరిగి పట్టితెచ్చుచున్న విక్రమార్కునితో భేతాళు డిట్లు చెప్ప నారంభించెను. చిత్రకూట మనుపగరమును రూపదత్తు డనురాజు పాలిం చుచుండెను. ఆ రా జొకనాడు వేటకై యరణ్యమున కేగి వేటాడి యలసి యొకసరోవరము గాంచి యందు దాహము దీర్చుకొని తీర మున గుఱ్ఱముపై నున్నజీను పరచుకొని విశ్రమించెను. ఆసరోవరమున కెదురుగ నొకమునీంద్రుని యాశ్రమము, చిన్నపూలతోట యు గలవు. ఒకగడియకాలమున కాతోటలోనికి చక్కనిమునికన్య వచ్చి పూవులను గోయుచుండెను. రా జామునికన్యకను జూచి కామమోహితుడై తానుగూడ నాతోటలోనికి బోవ యామునికన్య రాజుం గాంచి ప్రక్కకు దప్పుకొనియె. రా జామెను జూచి యోకన్యకామణీ! మీయాశ్రమ మున నతిథిపూజ యొనర్చుట లేదాయని యడిగెను. మునికుమారి యామాటను వినియు బ్రత్యుత్తర మీయక నొక్కమా ఱాతని జూచి ప్రక్కకు తిరిగెను. రాజు మరల నిట్లనియె.

సుందరీ! నామాటకు బదులు పలుక వేమి? ఆశ్రమమునకు వచ్చిన యతిథి గొప్పవాడైనను, కొద్దివాడైనను సరియే- కులీనుడైనను, పలహీనుడైనను, సరియే- దుర్మార్గుడైనను సన్మార్గుడైనను సరియే- పూజనీయుడని పెద్దలు పల్కుదురుగదా! ఆశ్రమమునకు వచ్చిన నన్ని ప్లుపేక్షింతు వేల యని పలుక నామునికన్య మా ఱాడలేదు. ఇంతలో మునీంద్రు డాప్రదేశమున కరుదెంచెను. రా జామునికి నమస్కరింప నాబుషి యతనిని దీవించి వచ్చినకారణము నడిగెను. మునీంద్రా! వేటా కవచ్చితి నని విన్నవింప నాముని రాజా! వేట యొకగొప్పవ్యసనము. ఎనుబోలు ధర్మప్రభువు లావ్యసనమున దగులొక్కరాదు. అని పలుక రా జిట్లనియె. మునీశ్వరా! మీరు పల్కెడి సుభాషితములను వినగోరిక కలదు. వచింపు డన మునీంద్రు డిట్లనియె. రాజా! సావధానుడవై వినుము. తృణమును భక్షించుచు, జలపానము జేయుచు, నిర్బాధకముగ వనమున దిరుగు ప్రాణికోటిని జంపరాదు. దాన పాపము కలుగును. ఫలములను భక్షించుచు, వియత్పథంబున నెగురుచు జీవించుపక్షులను హింసించుట నరకహేతువు. శరణు జొచ్చిన ప్రాణిగాని భయముచే పాఱిపోవుచున్న ప్రాణినిగాని సంహరించుట మహాపాపము. క్షమకన్న మించిన తపము- సంతోషమునకు మించిన సుఖము- మిత్రత్వమునకు మించిన ధనము కానరాదు. దయయే పరమధర్మము. స్వభార్యయం దనురాగము- పరస్త్రీపరాఙ్ముఖత- సత్యవాదిత్వ యుండుట మాన వుని ముఖ్యకర్తవ్యములు. రాజుభార్య-మిత్రునిభార్య- తొమ్మిదేండ్లకన్యక- ఎనిమిదినెలలగర్భిణిని- సంగమించినవాడు రౌరవాదినరకముల పాలగును. రాజా! ధర్మవిమర్శన మతిసూక్ష్మమైనది.

మునీంద్రు డీవిధముగ ధర్మోపదేశమును జేయ రాజు విని తాప సోత్తమా! తాము చెప్పిన ట్లాచరింతునన మునిసంతుష్టుడై రాజా!

నాయాశ్రమమునగల కన్యకామణిని నీకు కాస్కగా నర్పించుచుంటిని. ఆమెను భార్యగా పరిగ్రహింపుమని పల్కి యాసుందరిని విలిచి రాజు చేత నామెచేతి నప్పగించెను. రూపవత్తుడు సంతసముతో మునికి వందన మొనర్చి యాసుందరిని వెంట నిడుకొని నగరమునకు బోవుచు రాత్రివేళ నాయడవిలో నొకచెట్టుక్రింద విశ్రమించిరి. అర్ధరాత్రివేళ నాచెట్టుమీద నుండి బ్రహ్మరాక్షసుడు క్రిందకు దిగి రాజును మేల్కొల్పి రాజా! నీభార్యను భక్షించెద నని పల్కెను. రాజు భయకంపితుడై నీ వట్లు చేయవలదు. నాభార్యను వదలితివేని నీవేది కోరిన నొసంగెదను. అన వుడు బ్రహ్మరాక్షసుడు రాజా! నేటికి నారవుదినములలో నొక బ్రాహ్మ ణబాలుని నాకు బలి యిచ్చితివేని నీభార్యనువదలెదనని చెప్పెను. రా జం దుల కంగీకరించి తననగరమున కరుగుదెంచి ఎవరైన బ్రాహ్మణదంప తులు తమకుమారుని బ్రహ్మరాక్షసబలికై ప్రభువున కొసంగినయెడల వెండువందల మణుగుల బరువుగల బంగారపుబింబమును బహుమతిగా నొసంగబడునని చాటించెను. ఆరుదినములవరకు నెవరును రాలేదు. ఆయూరిలో నొకవిప్రకుటుంబము కలదు. ఆదంపతులకు ముగ్గురు కుమారులు కలరు. ఆయింటియజమాని కాబంగారువిగ్రహముపై యాస గలిగి భార్యతో ముచ్చటింపగా నామె తనకడగొట్టుపుత్రు నీయ నంగీకరించలేదు. తండ్రి పెద్దకొమారు నీయ నిష్టపడలేదు. అందరును గలసి రెండవపుత్రుని ప్రభువున కప్పగించి యాబంగారువిగ్రహమును దెచ్చుకొనిరి. ఏడవనా డాబాలుని స్నానము జేయించి, నూత్నవస్త్రముల నలంకరించి, పుష్పమాలాభరునిగ నొనర్చి వధ్యస్థానమునకు గొనివచ్చిరి. బ్రహ్మరాక్షసుడు వచ్చి సిద్ధముగ నుండెను. ఆవిప్రబాలకుడు మరణసమ యమున నొకమారు పక్కున నవ్వి తదనంతరము మధైర్యముతో తనకు పాఠశాలలో గురువులు చెప్పిన నారాయణసంస్మరణ జేసికొనుచు

ఖడ్గభూతమున కెదురు జూచుచుండెను. రాజు కత్తి యెత్తి నరకబోవు చుండ బ్రహ్మరాక్షసు డాగమని పల్కి యాబాలుని జూచి బాలకా! మరణసమయమున నీ కీధైర్యము, సంతోష మెట్లు కలుగుచున్నదన నాబాలుడు అయ్యా! "జాతస్య మరణం ధృవం" అని పెద్ద లందురు. కావున మరణమునకు వెరువ నేల? నాయట్టి నిష్ప్రయోజకుడు మరణింప వలసినదే కావున సత్వరముగ మీకార్యమును బూర్తి జేసికొనుడని పల్కుచు నారాయణభజనము జేయుచుండెను. బ్రహ్మరాక్షసు డాబా లుని హృదయగతాభిప్రాయమునకు, మనోధైర్యమునకు, దైవభక్తికి సంతసించి బాలకా! నిన్నుజూడ సంతసమైనది. నీయభీష్టము నడుగు మన నతడు రాజపత్నీజీవితము నడిగెను. వానిపరోపకారబుద్ధికి సంతసించి బ్రహ్మరాక్షసుడు కోరినవర మిచ్చి వెడలిపోయెను. రాజా! మరణసమ యమున నాబాలు డేడ్చుటకు మారు నవ్వినకారణమును దెల్పుమన విక్రమార్కు డిట్లనియె. బాల్యమున తల్లి రక్షించును. పెద్దవాడైన పిదప తండ్రి కాపాడును. ప్రభుడైనవా డసహాయులకు తోడ్పడును. ఈమూడుధర్మములు నావిషయమున విఫలము లైనవి. తల్లిదండ్రులు పుత్రవాత్సల్యమును వీడి ధనాపేక్షచే మృత్యుముఖమున నప్పగించిరి. ప్రభువు స్వార్థపరుడై భార్యకొఱ కొకవిప్రబాలకుని నిస్సహాయుని వధింప నెంచెను. ఆహా! ధర్మమున కెట్టిపాటు వాటిల్లినది. దైవమాయ. అని తలంచి యాబాలుడు నవ్వేను. అని చెప్ప భేతాళుడు మరల చెట్టుపై కెగిరెను. విక్రముడాతని బట్టి క్రిందకు దీసికొనివచ్చెను.

ఇరువదవకథ.

భేతాళు డిట్లు చెప్ప నారంభించెను. విశాలపుర మనుసగరమున అర్థదత్తుడను వర్తకుడు కలడు. అతని కనంగమంజరి యను సౌందర్యవతి యైన కుమార్తె కలదు. ఆమెను కమలపురనివాసియైన మోహను డను వాని కిచ్చి వివాహ మొనర్చిరి. ఆమోహనుడు వివాహ మాడినకొలది

నములకే వ్యాపారార్థమై పరదేశముల కేగి వర్తకకార్యమున మునింగి బహుకాలమైన నింటికి రాలేదు. అనంగమంజరి పెద్దదై నవయవ్వనవతి యై యుండుటచే పతిసుఖ మెఱుగక కామేచ్ఛగలదై యుండెను. ఒక నాడు చెలికత్తెతో మేడపై నిల్చుండియుండ మారసమాన సుందరుడగు బ్రాహ్మణు డొకడు త్రోవను బోవుచు నెలయెత్తి చూచెను. ఇర్వురును బరస్పరసందర్శనముచే మోహమగ్నులైపోయిరి.

కొంతకాల మల్లుండి యా కమలాకరుడను పేరుగల విప్రయువకుడు తనమిత్రునియింటి కేగెను. అనంగమంజరి తన శయనగృహమున జేరి మన్మథాగ్నిచే తపింపబడుచు మంచముపై బరుండియుండెను. నిద్రాహారములను వదలెను. ఈమెభావ మెఱింగిన చెలికత్తె మెల్లగ నొకనాడు ప్రక్కజేరి సఖీ! నీహృదయమును గుర్తెరింగితిని. నీమానసచోరుడెవ్వడో నా కెఱిగింపుమన యనంగమంజరి తాను జూచిన విప్రయువకుని వృత్తాంతమును వచించి యాసొగసుకానిని నాకు సమకూర్పవేని నాప్రాణములు నిలువవు. ఒక్కనిమిష మొకసంవత్సరముగ నున్నదనగా నా చెలికత్తె వెంటనే బయలుదేరి యాకమలాకరుని వృత్తాంతమును విచారించి తెలిసికొని యాతని మిత్రునియింటి కేగి కమలాకరుని జూచెను. కమలాకరు డాయనంగమంజరీవియోగమున మితిమీరిన విరహతాపమునొందుచుండెను. చెలికత్తె మెల్లగ నతని సమీపించి తా వచ్చినకార్యము నెఱింగించి అనంగమంజరి నీవియోగమున మరణావస్థలో నున్నది. నేటిరాత్రి నీవు మాయింటికి వచ్చితివేని యామెతో సమాగమ మగునట్లు జేసెదనని చెప్ప నతడు వల్లెయని యంగీకరించెను. చెలికత్తె యీవృత్తాంతము ననంగమంజరితో జెప్పుటకై పోవ విరహవేదనకు తాళజాలక కంఠమున పురి బెట్టుకొనుచుండ చెలికత్తె వచ్చి తప్పించియిట్లనియె. సఖీ! ప్రాణత్యాగము నేల జేసెదవు? బ్రదికియుండిన సుఖములు బడయవచ్చును. నేటిరాత్రి మాయింటికి వచ్చితివేని నీప్రియు

నితో సమావేశమును గలిగించెదను. అని చెప్పి యామె నూరడించి యింటికి బోయెను. కమలాకరు డాత్రి అనంగమంజరిని కూడుటకై చెలికత్తెయింటికి బోవ నాదాసి యాతని గూర్చుండబెట్టి తనప్రాణసఖిని పిలువబోయి గదిలో బ్రవేశించి చూడ అనంగమంజరి విరహవేదనకు నిలువజాలక ప్రాణత్యాగము జేసెను. దాసి విచారముతో నింటి కేగి కమలాకరున కీవృత్తాంతము నెఱింగింప నదివరకే విరహాగ్నిచే దహింప బడుచున్న కమలాకరుడు అనంగమంజరీమరణవార్తను వినినతోడనే తన ప్రాణములను వదలెను.

మరునాడు శ్మశానమున రెండుచితులలో రెండుశవములు దహన మగుచుండెను. అనంగమంజరిభర్త పరదేశమునుండి యాత్రోవనే వచ్చుచు చితులను జూచి జరిగినసంగతిని తానుగూడ దెలిసికొని నాచితిలో నురికి ప్రాణత్యాగ మొనర్చెను. రాజా! వీనిమువ్వురిలో నధికకామార్తులెవరు? అని యడుగ రాజ్ఞినియె భర్తయే కామార్తుడు అతని ప్రేమయే కొనియాడ తగినది. కారణ మేమనగా సుందరపురుషుని స్త్రీలును, పురుషులును వలచుట స్వభావమేకాని తనభార్య అన్యపురుషుని వలచి వానికై ప్రాణత్యాగ మొనర్చినసంగతి యెఱింగియు నట్టిభార్యకై ప్రాణత్యాగ మొనర్చిన మోహానునిప్రేమ నిష్కళంకము. అని చెప్ప భేతాళు డెగిరి వృక్షశాఖ కంటుకొనెను. విక్రముడు మరల నాతని యధాస్థానమునకు బట్టి తెచ్చెను.

ఇరువదియొకటవకథ.

భేతాళు డిట్లు చెప్ప నారంభించెను. రాజా! వినుము. కళింగదేశములో యజ్ఞశర్మ యనుబ్రాహ్మణుడు గలడు. అతనికి రూపవతి యను పేరుగల భార్య గలదు. ఆయజ్ఞశర్మ వేదశాస్త్రముల జదివి పెక్కు యజ్ఞములను జేసెను. కొంతకాలమున కారూపవతి గర్భవతియై చక్కనికుమారుని గనెను. తల్లిదండ్రులు లాలించాలని ప్రేమతో బెంచుకొనుచుండిరి. అయి

దవయేడు వచ్చినంతనే యజ్ఞశర్మ బాలునకు కేశఖండనము జేయించి ఆచార్యునికడ చదువ బంపెను. సూక్ష్మబుద్ధిగల యాబాలుడు పదురెండు వత్సరముల ప్రాయము వచ్చినప్పటికి బెక్కువిద్యలలో ప్రవీణు డయ్యెను. తండ్రి కుమారున కుపనయనము గావించి వేదాభ్యాసము జేయించుచుం డెను. పదునారువత్సరముల ప్రాయము వచ్చినప్పటికి ఆబాలుడు వేద శాస్త్రములను జదివి సంపూర్ణపాండిత్యము నార్జించెను. కాల మొక్క రీతిగ గడువబోదుగదా! సుఖములు మేఘచ్ఛాయవలె చంచలములు. శరీరములు బుద్బుదప్రాయములు.

ఆబాలునకు శరీరమున నొకవిధమగు వ్యాధి జనించుటచే కొలది దినములకు మృతు డయ్యెను. యజ్ఞశర్మ - రూపవతియు కుమారుని కళే బరము పెబడి పెక్కుగతుల విలపించిరి. ఆతని గుణములను దలంచుకొని రోదన మొనర్చిరి. కాని లాభ మేమి? మరణించినవారు వత్తురా? తమ పరి బంధుగణ మంతయు గలసి యాకళేబరమునకు సంస్కారము నిమిత్త మై శ్మశానమువకు గొంపోయిరి. బంధువు లందరు శవమును జూచి కన్నీ తలపోసిరి. చూచితిరా? చనిపోయినముఖ మెంతకాంతిగా నున్నదో? ఎంత చక్కనిబాలుడు! అని దహన సంస్కారమునకుప్రయత్నించుచుండిరి.

ఇంతలో నటకు కొంచెముదూరములో తపము జేసికొనుచున్న నొకయోగి యాబాలకునికళేబరమును జూచి యిట్లు తలపోసెను. ఈ బాలుడు సుందరుడు. నే నీకళేబరములో ప్రవేశించితినేని యింకను చాలకాలము ప్రాపంచికభోగముల ననుభవింపవచ్చునుగదా యని తలంచి పరకాయప్రవేశవిద్యవలన తనప్రాణముల నాబాలకుని కళేబర ముస ప్రవేశపెట్టెను. వెంటనే యాకుమారశవమును సజీవమై లేచి కూర్చుండెను. కూర్చుండినవెంటనే యొకమారు నవ్వి పిదప రోదన మొనర్చెను. తదనంతరము బంధువు లంద రాబాలుని సజీవునిగా దలంచి యుండుటకు గానబోయిరి. రాజా! వింటివిగదా! ఆయోగి కళేబరములో

ప్రవేశించినవెంటనే నవ్వుటకును- తరువాత రోదన మొనర్చుటకు గారణ మేమి? అని యడుగ రా జిట్లనియె. ఇంకను చిరకాలము సుఖానుభవ మును పొందవచ్చునని మొదట సంతసించెను. కాని యంతలో వివే కము దెచ్చుకొని అయ్యో! ఈశరీరమైన మరికొంతకాలమునకు నశించు నదేకదా! మోక్షప్రదమైన యపవర్గమార్గమును వదలి తిరిగి విషయవాం ఛలకేల లోబడితినా యని దుఃఖించెను అని చెప్ప భేతాళుడు మరల పై కెగిరెను. విక్రము డతనిబట్టి క్రిందకు దెచ్చెను.

ఇరువది రెండవకథ.

భేతాళు డిట్లు చెప్ప నారంభించెను. విదర్భదేశమున నొక గ్రామములో నారాయణశర్మ యను బ్రాహ్మణుడు, పండితుడు గలడు. అతడు సకలవిద్యలను నేర్చి పండితుడై భార్యతో గృహస్థధర్మముల నెఱవేర్చుచు మువ్వురు కొమరులను, ఇర్వురు కుమారికలను గనెను. చిర కాలము గడచెను. వృద్ధు డయ్యెను. కాని యానారాయణశర్మకు భోగ వాంఛ నశింపలేదు. అందువలన నాత డొకనాడు వెలుపలి కేగి మృతు డైన నొకబ్రాహ్మణయువకునిశరీరములో పరకాయనిద్యామాహాత్మ్యము వలన తనప్రాణములను ప్రవేశపెట్టి మారుశరీరముతో దనవారల జూడ వచ్చెను. భార్యాపుత్రు లందరు నితని జూచి వెరగుపడ నారంభించిరి. వేరుశరీరమును ధరించి వచ్చిన యాతడు మొదట తనవారి నందరిని జూచి కన్నీరు గార్చి పిదప నవ్వుచు నిట్లనియె. మీ రందరు నన్ను జూచి భ్రమపడుచున్నారు. నే నీయింటియజమానిని. వృద్ధుడ నగుటచే నాప్రాణముల నీశరీరములో ప్రవేశపెట్టి భోగాభిలాషచే యిట కరుగు దెంచితిని. ఇదంతయు నాపరకాయవిద్యాప్రవేశఫలము. నా కిప్పుడు విరాగము కలిగినది. ఈలోకములో నెవ్వారి కెవ్వరును లేరు. ఇదంత యును నాటకము. ఈనాటకములో నెవరిపాత్రను వా రభినయించి తెర మరుగున కేగుచున్నారు. ఈయస్థిరభోగములకొఱకు ప్రతివాడును

భ్రమపడి ధర్మాధర్మవిచారణను వదలి మోహమగ్నుడై తిరుగుచున్నాడు. బాల్యయవ్వనవార్ధక్యదశలు గడచినను- చూపులు తప్పినను - పండ్లూడిపోయినను- కర్ర చేతికి వచ్చినను స్థిరాభిమానము వదలదు. కాల మంతయు నిదేరీతిగ జరుగుచున్నది. ఒకడు పోవుచున్నాడు. ఇంకొకడు వచ్చుచున్నాడు. తాను మరల పోవునా డని యును పోయినవానికొఱకు దుఃఖపడుచున్నాడు. కావున వివేకవంతుడగునాడు పుట్టిన ప్రతిప్రాణియు చనిపోవునని నిశ్చయింపవలయును. ఆశ యనునది మహానది. మహాయోగీశ్వరులుగాని దానిని దరింపజాలరు.

శ్లో. ఆశానామ నదీ మనోరథజలా తృష్ణాతరంగాకులా
రాగగ్రాహవతీ వితర్కవిహగా ధైర్యద్రుమధ్వంసినీ।
మోహావర్తసుదుస్తరాతిగహనా ప్రోత్తుంగచింతాతటీ
తస్యాపారగతా విశుద్ధమనసా నందంతి యోగీశ్వరాః॥

అను నార్యోక్తిని స్మరింపుడు. మానవుడుజీవితము నూరేండ్లు. సగముకాలము నిద్రతోడను, మిగిలినదానిలో సగము శైశవక్రీడాదుల తోడను, విషయాదులతో గడచిపోవ మిగిలిన కొంచెము వృథాసేయుట మంచిలక్షణము కాదు. అని యీవిధముగ భానోపదేశ మొనర్చి నేను తీర్థయాత్రలకు బోయి యెచ్చటనో తప మొనర్చి శరీర త్యాగ మొనర్చెదననిచెప్పి వెడలిపోయెను. రాజా! వింటివిగదా! అతడు మొదట రోదన మొనర్చుటకును, తదుపరి నవ్వుటకును కారణ మేమని విక్రమార్కుడిట్లనియె. ఉన్నశరీరమును వదలి పరదేహములో ప్రవేశించుటవలన తన భార్య, పుత్రులు మొదలగువారు తనకు దూరమై పోవుటేగాక తన భోగవాంఛ నెఱవేర నందులకు చింతించెను. తదుపరి వివేకము తెచ్చుకొని సంసారబంధవిముక్తిని పొందెదనుగదా యని సంతసించెను. అని చెప్పి భేతాళుడు మరల చెట్టుపై కెగిరెను.

ఇరువదిమూడవకథ.

విక్రమార్కుడు పట్టి తెచ్చుచుండ భేతాళుడిట్లు చెప్పనారంభించెను. జయస్థలమనుపట్టణమున విష్ణుస్వామి యనుపేరుగల బ్రాహ్మణుడు గలడు. అతనికి నల్వురు కొమరులు గలరు. వారిలో మొదటివాడు జూదరి. రెండవవాడు వేశ్యాలోలుడు. మూడవవాడు వ్యభిచారి. నాలుగవవాడు నాస్తికుడు. ఇట్లుండ కుమారుల దుర్గుణములను సహింపజాలక నొకదినమున నల్వురను బిలిచి యిట్లుపదేశించెను. జూద మాడువాడు దరిద్రుడగును. వానియింట లక్ష్మి నిలువదు. రాజనీతియందు జూదరియొక్క కర్ణనాసికలను గోయవలయునని యున్నది. స్వభార్యయైనను తనభర్త జూదరియైన సమీపింపరాదు. కారణమేమన, ఉన్నధనమును గోల్పోయినది గాక భార్యాపుత్రులను సైతము విక్రయించును. ఇంక వేశ్యాగమనమువలన నపకీర్తి. శరీరము రోగగ్రస్తమగును. ఇంతేగాక తనధనమును వారి కిచ్చి దరిద్రుడై యంతతోనైన దానిని మానలేక చోరత్వమున ధనార్జనమొనర్చి వేశ్యల కీడుటయేగాక తనుపరి పట్టుబడి కారాగృహమున జిక్కుకొనును. ఇంక పరస్త్రీగమనము జేయువ్యభిచారి రౌరవాదినరకములకు బాల్పడును. వ్యభిచారిణియైన స్త్రీ భర్తనేగాక ప్రేమించినవానిని గూడ జంపుటకు వెనుదీయదు. ఇట్టి వ్యభిచారియైన పాపత్ముని దేశభ్రష్టుని జేయవలయును. దైవగురుభయములనువిసర్జించి సర్వదా విషయవాంఛాలోలుడై ప్రవర్తించు కులనాపకుడు కొడుకైనను దూరముగ బారదోలవలయునేగాని యాదురాత్మునింటనుండనీయరాదు.

ఈవిధముగ నావిష్ణుస్వామి యన్యాపదేశముగ కొమరులను మందలించెను. నల్వురును తండ్రిమాటలను విని సిగ్గుపడి విద్యాసంపాదనమనకై యొకపట్టణమున కేగి యం దొకగురువు నాశ్రయించి కొంతకాలము చదివి పండితులై, మంత్రవేత్తలై తిరిగి తమయూరికి వచ్చుచుండిరి. ఇట్లు వచ్చుచుండ నొకచోట నొకబోయవాడు సింహమును చంపి దా

ళోలును దీసి క్రిందపరచి యెముకలు, మాంసము మొదలగు వానిని మూట గట్టుకొని పోవుచుండగా చూచి యానల్వురును తమవిద్యల బరీక్షింప దలచి యాబోయవానికి ధన మిచ్చి యా మూటను దీసికొని తమ తమ విద్యాప్రభావములను పరీక్షింప నెంచిరి. ఒక డాసింహపుయెముకలను జంతువుయొక్క ఆకార మేర్పరచి దానిపై మంత్రోదకములు చల్లినంత నాయెముకలు కలుసుకొనిపోయెను. రెండవవా డానూంసమును ఆయా ప్రదేశములందు బెట్టి తనమంత్రప్రభావముచే నతికించెను. మూడవవా డాతోలును దానిపై గప్పి మంత్రోదకము చల్లినంతనే చర్మము అవ యవములపై కలుసుకొనిపోయెను. నాలుగవవాడు తనమంత్ర ప్రభావ ముచే దానిని బ్రదికించెను. సింహమునకు ప్రాణములు రాగనే గాండ్రు మనుచు నెగిరి యానల్వురను భక్షించి తనత్రోవ నేగెను. రాజా! ఈ నల్వురిలో నెవ్వ డధికమూర్ఖుడు? అని పరీక్షింప రా జిల్లనియె. బ్రదికిం చినవాడే మహామూర్ఖుడు, కారణ మేమనగా! తాను నేర్చిన విద్యవలన ఆత్మరక్షణము, పరోపకారము జేయనలయును. అట్లు చేయలేక పోగా తా నభ్యసించిన విద్యవలన తనప్రాణమును బోగొట్టుకొని పరుల ప్రాణ ముల బోగొట్టినవానిని మూర్ఖు డనక నేమందుము. కావున బుద్ధిహీనుడు విద్వాంసుడైనను నిష్ప్రయోజకుడే. అని చెప్ప భేతాళుడు మరల చెట్టు కొమ్మ కెగిరెను.

ఇరువదినాలుగవకథ.

విక్రమార్కునితో భేతాళు డిట్లు చెప్ప నారంభించెను. ధర్మ పురమున వర్ధమాను డనురాజు రాజ్యమును జేయుచుండెను. ఆపట్టణ మున గోవిందశర్మ యను బ్రాహ్మణుడు కలడు. అతనికి ముగ్గురు కుమారులు గలరు. వారికి హరిదత్తు, సోమదత్తు, యజ్ఞదత్తు అని నామకరణములు జేసెను. ఆబాలురకు పండ్రెండ్లు నిండినతోడనే తండ్రి యుపనయనములజేసి వేదశాస్త్రాధ్యయనమునకై పరదేశమున నున్న

యొకగొప్పవిద్వాంసునికడ జదువవేసిరి. పదునెనిమిదిసంవత్సరములు గురుకులవాస మొనర్చి సకలవిద్యలయందు పాండిత్యమును సంపా దించి యింటికి వచ్చిరి. తండ్రి వారిమువ్వురకు ననురూపవతులగు కన్యక లను వివాహ మొనర్చెను. నగర మంతయు నీముగ్గురిప్రఖ్యాతినిగురించి విపరీతముగా జెప్పుకొనుచుండగా మంత్రులవలన రాజు విని యొకనాడు కొల్వుకూటమున కాపండితుల మువ్వురను బిలిపించి మీ కే యే విద్య లయందు పాండిత్యము గలదన మొదటివాడగు హరిదత్తు డిట్లనియె. అయ్యా! నేను భోజనప్రియుడను. నా కావిషయమున నెక్కుడు పాండి త్యము గలదు. అని చెప్పెను. రెండవవాడగు సోమదత్తుడు నేను నిద్రాప్రియుడను. నిద్రపోవుటలో నేను మిక్కిలి పరిశ్రమ జేసితినని వచిం చెను. మూడవవాడగు యజ్ఞదత్తుడు నేను వనితాప్రియుడను. స్త్రీ సౌఖ్యమున నేను నిపుణుడనని మనవి యొనర్చెను. ప్రభు వాముగ్గురి మాటలను విని తనలో తానే నవ్వుకొని యిట్లనియె. విప్రవరులారా! ఇవి! యేటివిద్యలు? భుజించుటయు, నిద్రించుటయు, స్త్రీలతో సుఖించు టయు విద్యలగునా? మీరు మూర్ఖులవలె నున్నారన వారిట్లనిరి. మహా రాజా! దేవరవారు పరీక్షించినచో నందలివిశేషములను జూపెద మనిరి.

మరునాడు రాజు భోజనప్రియుని బిలిచి షడ్రసోపేతమైన భోజ నము, రకరకముల పిండివంటలు నేర్పరులగువారిచే తయారు జేయించి యాతనికి గుడువబెట్టి నేర్పాటుచేసెను. భోజనప్రియుడు కడుపునిండ భుజించి యింటి కేగెను. రాజు పిలిపించి పదార్థము లెట్లున్నవి? తృప్తిగ భుజించితిరా? యని యడుగ హరిదత్తు డిట్లనియె. మహారాజా! పిండినూట లు, కాయగూరలు మిగుల రుచ్యములుగా నున్నవికాని ప్రధానమైన యన్నమే బాగుండలేదు. అందువలన దృప్తిగ భుజింప జాలకపోయితిని. కారణ మేమనగా అన్నము వండిన బియ్యము శ్మశానవాటికలో పండిన పంట యగుటచే అన్నము వాసనగా నున్నదని చెప్పెను. రాజు వెం

టనే బియ్యమును పంపినవర్తకుని బిలిచి యడుగ అయ్యా! ఇది మాస్వం తభూమిలో తయారైన ధాన్యము. ప్రశస్తమైనవరి. ప్రస్తుతము మా భూమిలో నేమియు దోషము లేమిగాని తూర్పువై పున కొంతభాగము రెండేండ్లక్రింద శ్మశానముగా నున్నది. దానిని ఏలినవారియనుమతిపై మేము తీసికొని సాగు చేయించుచుంటిమి. ఇప్పుడు దివ్యమైనపంట పండుచున్నదని చెప్పెను. రాజు వర్తకుని బంపి హరిదత్తునివిజ్ఞానశక్తి చాల సంతసించి తగినబహుమతి నొసంగి పంపెను. రెండవవాడగు నిద్రాప్రియుడైన సోమదత్తుని బిలిచి నాటిరాత్రి తన నగరులో నొకవిశాలమైనగదిలో పందిరిమంచముపై మెత్తనిపరుపుల నైదింటిని పరపించి మృదువైనశాల్వాలు పక్కా వేయించి పరుండమని చెప్పెను. సోమదత్తుడారాత్రి యంతయు బరుండెను. రాజు మరునాడుదయమున సోమదత్తుని బిలిచి నిద్ర పట్టిందా? పక్కా బాగుగా నున్నదా యన నాతడో మహారాజా! ఏలినవారియనుగ్రహమున పక్కా బాగుగనే యున్నది. చల్లని గాలి వచ్చుచున్నది. కాని ప్రక్కక్రింద నెచ్చటనో తలవెంట్రుక యుండుటచే వత్తుకొని నిద్ర పట్టలేదు అని చెప్పెను. రాజు పరీక్ష సేయించి పై పరుపులు నాలుగు తీయగనే క్రిందనున్నపరుపుపై నొకపొడుగైన తలవెంట్రుక పడియుండెను. రాజు ఆనందించి వానిని సత్కరించి పంపి మూడవనాటిరాత్రి తననగరులో నొకగదిని శృంగారింపజేసి నూతనరజస్వలయై కన్నెతీకముగాని సుందరాంగియైన చక్కనివేశ్య నొకదానిని దివ్యవస్త్రాభరణాదులచే సలంకరింపజేసి యాగదిలో నుంచి వనితాప్రియుని బిలిచి నేటిరాత్రి యీసుందరితో సుఖింపుమని పంపెను. వనితాప్రియుడు లోని కేగెను. తలుపులను బంధించిరి. తెల్లవారగనే ప్రభువు వనితాప్రియుని బిలిపించి యా వేశ్యాంగసగుణము లెట్టివి? రసికురాలగునా? హృదయము రంజింపజేసిందా యని వనితాప్రియుడిట్లనియె. మహారాజా! ఆవేశ్య సకలగుణములు కలది. మంచిరసికత- చక్కనిగానము-

కలదుగదాయని యూసపడ దగ్గరకు దెచ్చితినిగాని దానినోరు మేకపాల హాసన వేయుటచే నాయాస లన్నియు వ్యర్థమైనవి. నేను వేరుగ పరుంటిని. అని చెప్పెను. రాజు దానితల్లిని బిలిచి యడుగ నది దేవా! యిది నాపెంపుడుకుమార్తె. దీనిని గన్నతల్లి పురిటిలోనె చనిపోయినది. వేరుపాలు పడకపోవుటచే మేకపాలతో పెంచితినని చెప్పినది. రాజు దానిని బంపి- ఔరా! వీ రంద రొకరికి మించినవా రింకొకరని తలంచి వనితాప్రియుని సత్కరించి బంపెను. రాజా! ఈమువ్వురిలో నెవరితెలివి కొనియాడదగినది అని యడుగ విక్రమార్కుడు నిద్రాప్రియుని గొని యాడవలయునని చెప్పెను. కారణ మేమనగా? మృదువులగు నాల్గుపరుపులక్రిందబడిన సూక్ష్మమైన తలవెండ్రుకవలన నతనికి నిద్రాభంగ మైన దన్నచో నది తప్పక ప్రశంసనీయమని నొక్కి చెప్పక తప్పదు అని చెప్ప భేతాళుడు మరల వృక్షశాఖ కెగిరెను.

ఇరువదియైదవకథ.

విక్రమార్కుడు భేతాళుని పట్టి తెచ్చుచుండ భేతాళు డిట్లని చెప్పదొడంగెను. రాజా! వినుము. శ్రీచక్ర మనుపట్టణమున మహాబలుడను రాజు రాజ్యము చేయుచుండెను. శత్రురాజు లిర్వు రతనిరాజ్యము నపహరింపవలయునను తలంపుతో సైన్యసమేతులై వచ్చి శ్రీచక్రపుర మును ముట్టడించిరి. మహాబలుడు వారితో చిరకాలము యుద్ధమును జేసెను. తుదకు సైన్య మంతయు నశించిపోవుటచే పరాజితుడై యొక నాటిరాత్రి భార్యను, కుమార్తెను వెంటగొని యరణ్యము జేరెను. తెల్ల వారువర కావనములో బహుదూరము పోయి యొకచెట్టుక్రింద విశ్రమించిరి. రాజు తనభార్యాపుత్రికల నట గూర్చుండబెట్టి వారి కాహార పదార్థములను సంగ్రహించుటకై సమీపమునగల గ్రామమున కేగి యానాటికి సరిపడిన భోజనపదార్థములను సంగ్రహించుకొని వనముననున్న

రాణిని, కుమార్తెను జేర వచ్చుచుండెను. మార్గమధ్యమున కొందరు భిల్లులు రాజును సంహరించి యాతనిభార్యాపుత్రికలకు బట్టి కొనిపోవలంచిరి. రాజునకు, భిల్లులకు నాసమయమున యుద్ధము తటస్థించెను. రాజు ధనుర్బాణములను చేత ధరించి నాయాటవికులతో ఘోరముగ బోరెను. భిల్లులలో కొందరు పారిపోయిరి. కొందరు హతులైరి. కాని భిల్లులు వేసినబాణములలో- నొకటి రెండు రాజై నమహాబలునికంఠ మున తగులుటచే నతడును ప్రాణములను విడిచెను. రాణియు, కుమార్తెయు నావనమున రాజకళేబరమున బడి పెక్కుగతుల విలపించి దిక్కులేనివా రగుటచే యామహాబలునిశరీరమునకు సంస్కారమును గావించి యటనుండి బయలుదేరి చాలదూరము నడచి యొకగ్రామదేవతగుడిలో ప్రవేశించి మార్గాయాసమును దీర్చుకొనుచుండిరి.

ఇట్లుండ చంద్రసేను రాజు తనకుమారునితో వేట కైవచ్చి యా వనములో వేటాడి తిరిగిపోవుచుండ రాణియొక్కయు, కుమార్తెయొక్క పాదచిహ్నములు గనుపడగా నిట్లు తలపోసిరి. ఇవి పురుషుల పాదముల వలె లేవు. స్త్రీలపాదములవలె నున్నవి. ఇర్వురుయువతు లీమార్గము నుండి నడచిపోయిరి. అని తలపోయుచుండ రాజు కుమారునితో నిట్లనియె. ఈమార్గమును బట్టిపోయి యాయిర్వురి స్త్రీలజాడ తెలిసికొందము. అంచులో పెద్దయడుగులుగల యువతిని నీవు గైకొనుము. చిన్నయడుగులుగల దానిని నేను గ్రహింతును. అని చెప్ప కుమారుడంగీకరించెను. ఇర్వు రాజాడలను బట్టి పోయి గ్రామదేవతాలయమునగల రాణిని, కుమార్తెను కలసికొనిరి. త్రోవలో తాము జేసికొనిన నియమము ననుసరించి కుమార్తెను తండ్రియు, రాణిని కుమారుడును గుఱ్ఱములపై నెక్కించుకొని తమనగరముం జేరి వారిర్వురం జేపట్టిరి. కొంతకాలమునకు వారిర్వురకును కుమారులు గలిగిరి. రాజా! వారిర్వురకును, తల్లులకును గల పరస్పరసంబంధమును దెల్పు మన విక్రమార్కుడీమారు ప్రత్యుత్తరము చెప్పుటకు తోచక ఆలోచించుచు నిల్చుండెను.

ఆలోచించుచు నిల్చున్న విక్రమార్కుని జూచి భేతాళుడిట్లనియె. రాజేంద్రా! నీసాహసమునకు, బుద్ధిసూక్ష్మతకును మెచ్చితిని. నీతో నొకవృత్తాంతమును దెల్పెదను వినుము. నన్ను బట్టితెమ్మని బంపిన యాకుతి ధుర్మార్గుడు. నిన్ను జంపవలయునని తలంచియున్నాడు. శ్మశాన వాసినియైన యాదేవిని పూజించి నూటయెనుబదిమంది రాకన్నియలను గాని, సాహసవితరణాది గుణములుగల యొకరాజేంద్రునిగాని, మంత్రవేత్తయె, దీక్షాపరుడైన యతీశ్వరునిగాని బలియిచ్చినయెడల నాదేవి ప్రత్యక్షమై యభీష్టవరము లొసంగును. ఈరహస్య మెరిగిన నాయతి నూటయెనుబదిమంది రాజపుత్రికలు దొరకుట యసంభవ మగుటచే నిన్ను బలిగా గొనంగ దలంచినాడు. కావున నీ విప్పుడు నేను చెప్పినట్లు చేయుము. నే నీశరీరములోనుండి వెడలిపోవ్రుమంటిని. నీ వికళేబరమును గొని యా యతిని జేరుము. ఆతడు స్నానము జేసి కళేబరమును అగ్నిగుండమున హోమము జేసి జపము పూర్తియైనతరువాత నిన్ను స్నానము జేసివచ్చి దేవికి సాష్టాంగపడు మని చెప్పును. అప్పుడు నీవు నీబుద్ధిసూక్ష్మతవలన నాయతిని మోసపుచ్చి కాళికి బలి యిచ్చితివేని నీ కాదేవి ప్రత్యక్షమై యభీష్టము లిచ్చును. నేను సర్వదా నీకు విధేయుడనై నీయాజ్ఞల జేయుచుండెదను. అని చెప్పి యాభేతాళు డాశవమునుండి తొలగిపోయెను. విక్రమార్కు డాకళేబరమును మోసికొని యాయతిం జేరి కళేబరము నెదుట నుంచి నమస్కరించెను. ఆసన్యాసి సంతసించి తనజప పూర్తి జేసి యాకళేబరము నగ్నిగుండములో హోమము జేసి విక్రమునిజూచి రాజా! స్నానము జేసి రమ్ము అని పంప విక్రముడు వెంటనే స్నాతుడై యటకు జేరెను. సన్యాసి యాతనిం జూచి రాజా! ఇటు వచ్చి దేవికి సాష్టాంగ నమస్కారము జేయుమన రా జిట్లనియె. స్వామీ! నేను ప్రభువు నగుటచే నాకు నమస్కరించిరిగాని నే నొకరికిని సమస్కరింప లేదు. సాష్టాంగ నమస్కార మెట్లు చేయనలయునో చూపిన చేయుదునని చెప్పిన యతి

యీవిధముగ జేయవలెనని దేవిముందర సాష్టాంగపడెను. విక్రమార్కుడు వెంటనే కత్తిని దూసి యాసన్యాసిమెడపై నొక్కవ్రేటు వేసెను. తల తెగి క్రిందపడెను. వెంటనే కాళికాదేవి ప్రత్యక్షమై రాజా! నీసాహసము నకు మెచ్చితిని. వరమును వేడుమన రా జిట్లనియె.

తల్లీ! యీసన్యాసిని బ్రదికింపుము. నీ వింక జీవబలులను గోర వలదు. ఇదే నాకోర్కె యన కాళి విక్రమరాజా! నీయుదారబుద్ధికి మెచ్చి నీకోరినవరము లిచ్చితిని. నీవు వేయిసంవత్సరములు రాజ్యము జేసెదవు. భూతపతియగు భేతాళుడు నీయనుచరు డగుటచే భూతప్రేత పిశాచము లన్నియు నీ పేరుచెప్పినమాత్రమున బారిపోవును. నీచరిత్ర మును పఠించిననారికి మంగళములు కలుగును. దేవేంద్రుడు నిన్నర్ధ సింహాసనమున గూర్చుండ బెట్టుకొనును. నీకు సకలశుభములు కలుగు నని వర మిచ్చి కాళికాదేవి మాయ మయ్యెను. భేతాళుడు ప్రత్యక్షమై విక్రమార్కమహారాజా! నీ వెప్పుడు తలంచిన నప్పుడు వచ్చి నీయభీష్టంబులు నెరవేర్చెదను. నే నడిగిన యీయిరువదియైదుప్రశ్నము లను బఠించినవారికి పిశాచబాధ లుండవు. అని చెప్పి వెడలిపోయెను. విక్రమార్కుడు తదుపరి తననగరము జేరి సకలజనాహ్లాదకరముగ రాజ్యమును జేయుచుండెను.

సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ

www.vaaradionline.com

www.vaaradionline.com

14269

www.vaaradionline.com